TEXT PROBLEM WITHIN THE BOOK ONLY

UNIVERSAL LIBRARY
OU_204159
UNIVERSAL LIBRARY

ఆంధ్రసారస్వత ప్రచురములు 3

# పెద్దాపురసంస్థాన చరిత్రము

గ్రంథకర్త.

వి. ఆర్. జగపతివర్మ.

శ్రీ

# పెద్దాపురసంస్థానచరిత్రము.

ఇయ్యది

వి. ఆర్. జగపతివర్మగారిచే వ్రాయఁబడి

రాయవరము

శ్రీ మేరీ ముద్రాక్షరశాలలో ముద్రింపఁబడి

రాజమహేంద్రవరము, ఆంధ్రసారస్వతనికేతనమునఁ బ్రకటింపఁబడినది.

1915.

సర్వస్వామ్యసంకలితము.

వెల రు ౦-౧౦-౦ లు.

# కృతిసమర్పణము.

గీర్వాణాంధ్రభాషాకోవిదులును, బహుశాస్త్రవిశారదులును, ఉభయభాషాకవులును, గ్రంథకర్తలును, కవిజనపోషకులును, క్షత్రియసంఘోచితగౌరవపరిపాలకులును, శ్రీరామభక్తులును, అస్మదాధ్యాత్మికగురువర్యులును, నాపితామహులును, నగు శ్రీరాజా వత్సవాయ రాయజగపతిరాజు తాతయ్యగారికిని

పతివ్రతాశిరోమణియు, స్త్రీధర్మపరిపాలకురాలును, సాధ్వీమణియు నగు నాపితామహి శ్రీమతి బుచ్చివెంకయ్యాంబాదేవి బాబయ్యమ్మగారికిని

మాతృహీనుఁడనగు నన్ను తల్లిలేనిలోపమిసుమంతయును లేకుండ ప్రేముడింజూపి పెద్దవానిని జేసి యిప్పటిస్థితికి తీసుకొనివచ్చినందులకు భక్తిపూర్వకమైన కృతజ్ఞతతో నీ గ్రంథమును వినయవిధేయుఁడనై సమర్పించుకొనుచున్నాఁడను.

వి. ఆర్. జగపతివర్మ.

గ్రంథకర్త.

# పీఠిక.

(దేశాభ్యుదయమునకుఁ జరిత్రలు మిక్కిలి లాభకరములు.) అందు ఆంధ్రదేశమునకు సంబంధించిన చరిత్రలు మనయాంధ్రులకు మిక్కిలి యుపయోగకరమైనవి. (సామ్రాజ్యములు నశించినను, సంస్థానము లడుగంటినను, వాటిచరిత్రలు మాత్రమెప్పటికిని నిలిచియుండఁ గలవు.) రోమకమహాసామ్రాజ్య మెన్నివందల సంవత్సరముల క్రిందట రూపుమాసిపోయినది! గ్రీసియను మహారాజ్య మెంతకాలముక్రిత మంతరించినది! కాని వానిచరిత్రము లిప్పటికిని శాశ్వతములై నిలిచి, యాయాసామ్రాజ్యములఁ బాలించిన చక్రవర్తుల సుగుణసంపదలను ధైర్యవిశేషములను, ఉత్కృష్టభావములను, ఉచ్చైస్స్వరమునఁ జాటుచునేయున్నది.

ఆయావిదేశీయరాజుల పరిపాలనావిధానములును, వారుచేసినదానధర్మములును, వారి పవిత్రాదర్శమును, వారిదేశాభిమానమును, జాతీయాభిమానమును, ధైర్యస్థైర్యాదిగుణములును, (జదువునంతనే మనస్సు ఉప్పొంగి యుద్రేకమతిశయించుచుండగా మనవారలచరిత్రములు, సాహసవితరణాది గుణములు, చదువుచుండునప్పుడు శరీరమెల్లఁ బులకాంకితమై, శక్త్యుత్సాహములుప్రకోపించి యొకవిధమగు నూతనావేశముదయించుచు తుట్టతుదకొక్కొకప్పుడు మైమఱపుకూడఁ గలుగుచుండునన్నది యతిశయోక్తికానేరదు.) అట్టివిధమగు నద్భుతోత్సాహమే, దాచనేల? ఆంధ్రచరిత్ర పఠనమే మమ్మీగ్రంథరచనకు దింపినదని తలంపనగును.

మేమీచరిత్రరచనకుపూనుకొని చాలకాలమైనది. ప్రథమమున నీగ్రంథము వ్రాయవలెనని చాలకుతూహలపడినను, చరిత్రసాధనములన్వేషించ మొదలిడి కొన్ని సంపాదించిన పిదప (చరిత్రరచన యనినసామాన్యమైనకార్యముకాదని బోధపడినది.) పిమ్మట బ్రహ్మశ్రీ చిలుకూరి వీరభద్రరావు పంతులుగారిచేతనే చరిత్రము వ్రాయించవలెననుకొంటిమి వారు నందులకంగీకరించి యీ చరిత్రములోని ౨౯ వ పుటలో ‹‹ శేషధర్మము నాయన కంకితము గావించెను ›› యనువఱకును వ్రాయించియున్నారు. పిమ్మట వారు వ్రాయుటకు వీలు లేకపోయినందున ఏమయిననగుంగాక, ఏదో ఒకవిధమున గ్రంథమును పూర్తిచేసినచో లోపాలోపములటుపిమ్మట సవరించుకొనవచ్చునని భావించి మా యభిప్రాయప్రకారము ఆభాగమును సవరించి మిగిలిన చరిత్రమునంతను పూర్తిచేసితిమి. కావున వారు వ్రాసిన భాగములోని యంశములకు మేమేయుత్తరవాదులమనియు, వారికించుకతో జోక్యము లేదనియు, విశదపఱచుచున్నారము. మాకువలయు సాధనసంపత్తిని సమకూర్చుకొనుటలో పంతులవారి సహాయమే లేని యెడల మేమీగ్రంథ మీమాత్రమైనను, వ్రాసియుండకపోవుదుము. మాకట్టి యమూల్యసహాయ్యము నొనరించినందులకు మహారాజశ్రీ పంతులుగారి కింపామూలమున మా కృతజ్ఞతను దెలుపుకొనుచున్నారము.

—: పూర్వ చారిత్రములు :—

అదియేమిపాపకర్మమోగాని దేశీయచరిత్రకారులెల్లరు ‹‹ మన పూర్వులకు చరిత్రమువలని లాభములు తెలియ ›› వనియు ‹‹ మన పూర్వులువ్రాసిన చరిత్రములు ఖిలమైపోయిన ›› వనియు ‹‹ మన

పూర్వులకు చరిత్రబోధములు తెలిసియేయున్నయెడల మనకింత శ్రమ లేకపోవు" ననియు ఎవరిచిత్తమువచ్చినటుల వారు వ్రాసిరేగాని మేము చూచినంతవఱకు ఎవ్వరును యదార్థమును గ్రహించినటులఁ గాన్పింపలేదు. దేశీయగ్రంథకర్తలిటుల వ్రాసియుండ, మనచరిత్రముల నుద్ధరించిన విదేశీయగ్రంథకర్తలు మన పురాణాదులు "అబద్ధపుకూంతలు" (Lying gabbles) అని వ్రాయుట యొకవింతలోనిదికాదు. మనవారే మాయభిప్రాయప్రకారము సత్యము తెలిసికొనలేకపోయినపుడు, అన్యదేశీయులై, అన్యభాషావేత్తలై, ఈదేశమునకువచ్చి కొద్దిగనో గొప్పగనో భాషాజ్ఞానము సంపాదించి అతిశయోక్తులతో, విచిత్రకల్పనలతో గూడిన మనగ్రంథములను, గీర్వాణభాషలోను, వ్యావహారికభాషలోను, వ్రాయఁబడిన మనశాసనములను, మనవ్రాతలనువిమర్శించిన విదేశీయులటులవ్రాయుట నిశ్చయముగా న్యాయవిరుద్ధముకాదు.

ఇక మనవారేల తెలిసికొనలేకపోయిరో వివరముగ తర్కించుటకిది తావు గాకపోయినను మన పురాణాదులలోని విచిత్రకల్పనలు, కత్తిగట్టిపోరాడిన మన నవనాగరికులవ్రాతలు మనవారిని పెడమార్గమునఁబెట్టుటకు కారణములైనవని మా తలంపు. అందునుగుఱించి వేరొకవ్యాసమును వివరముగ వ్రాయఁదలఁచి యిచట వివరింపలేదుగాని (శ్రీరాముని పరిపాలనావిశేషములుగాని, భారతయుద్ధముయొక్క యదార్థకారణాదులుగాని, చరిత్రకెంతవఱకు సంబంధించియున్నవో మనము నిరూపింపఁగలిగినపుడే మనపూర్వులెట్టిచరిత్రములనువ్రాసిరో మనము తెలిసికొనఁగలమని మాయభిప్రాయము.)

శ్రీయుత లాలాలజపతిరాయ దేశభక్తునిచే వ్రాయఁబడి

శ్రీయుత కొణకంచి చక్రధరరావుగారిచే నాంధ్రీకరింపఁబడిన శ్రీకృష్ణుని జీవితచరిత్రము కొంతవఱకు మాయభిప్రాయమును వెల్లడించుచున్నది కాని వారైనను హిందూదేశచరిత్రము నాగ్రంథానుసారముగ నిరఘుద్ధమని నిరూపించియుండలేదు. అటుల నిరూపించుటయుక్తమేయగును. వారి గ్రంథమును మేము ప్రథమమునచదివి యంతయో యానందమునొందితిమి ఆరీతి గ్రంథములు మాతృభాషలోనుండిన కొంతవఱకైనను దేశమునకు మేలుకలుగునని భావించి దేశమాత పత్రికాముఖమున హెచ్చరించియుంటిమి. అట్టి మతవిషయికచరిత్ర గ్రంథములు మన యవతారపురుషులనుగుఱించి కావలెననియే మాయభిప్రాయము.

(మనరామాయణము, మనమహాభారతము, మున్నగుపురాణములే మనచరిత్రములని మాయభిప్రాయమైనను, ఒక చరిత్రాంశమునననుసరించి యప్పటికాలానుసారముగ దైవభక్తిని, నీతిని, జ్ఞానమును, వివేకమును అభివృద్ధిఁజేయుటకు తగినవిచిత్రకల్పనలుచేసి మనపూర్వగ్రంథకర్తలువ్రాసిరని మేము ఘంటాపథముగఁజాటఁగలము) పిమ్మట కొంతకాలమునకు విదేశీయవిద్య, అన్యదేశాచారములు, మనకలవడిన కొలఁదియు నవనాగరికతయభివృద్ధియయి, మన గ్రంథములయందు, మన యాచారములయందు, చివరకు మనవారియందు మనకసహ్యము జనించినది! కాలమహిమ !!

“ మనపూర్వులిట్టి ఘనకార్యములు చేసిరి. ” “ అట్టిపౌరుషపరాక్రమములగన్పఱచిరి ” “ ఆరీతిదానములనుచేసిరి ” “ ఈరీతి భోగములనుభవించిరి ” మున్నగునంశములు జరిగినవిజరిగినట్లుగా వెల్లడించుటవలన, అధోగతిపాలైనజాతులు లేకసంఘములు తెలివితెచ్చుకొని,

తమతప్పులను దిద్దుకొని, తమపూర్వులమార్గము ననుసరించుటకుయత్నించును. అందు పూర్వాచారములయందాసక్తి మెండుగాఁగల విద్యాధికులున్నదేశమునకు మఱియులాభము. అట్టిలాభమే మన దేశమునకు కలిగియున్నయెడల మనయాంధ్రమహాజనసంఘమిట్లుండునా?

ఇఁక రామాయణభారతాది నీతిబోధకచరిత్రములవలన అప్పటివారు రెండుసంగతులను గ్రహించఁగలిగిరి. చరిత్రము తెలిసికొనుట యొకటి! చరిత్రాధారములవలనఁగల్పింపఁబడిన నీతిబోధకములైన గాథలనుజదివి జ్ఞానాభివృద్ధిచేసికొనుట యింకొకటి!!

మన పురాణేతిహాసములే, మనశాస్త్రములే మనకానాఁడుపుట్టి యుండనియెడల మన భారతదేశముననిలిచియున్న నీతి, వైరాగ్యము, దైవభక్తి ఆనాఁడే నశించిపోయి మనదేశ మింకను అధోగతిపాలై యుండునని యిచటమేము తెల్పుట అప్రస్తుతప్రశంసకానేరదు.

ఇట్లుచెప్పుచుంటిమని యిప్పుడు వ్రాయఁబడుచున్న చారిత్రములను నిరసించితిమని తలంచుట పొరఁబాటుకాఁగలదు. (పురాణాదులప్పటిస్థితిగతులనుబట్టి యప్పటికిఁదగిన చారిత్రములనియు, నిప్పుడు వ్రాయఁబడుచున్న చరిత్రలిప్పటిస్థితిగతులకుఁ దగినచారిత్రములనియు మాయభిప్రాయము.)

## — గ్రంథ నామము —

మేమీగ్రంథమునకు వత్సవాయసంస్థానచరిత్రమని పేరుపెట్టవలెననుకొంటిమి. కాని వత్సవాయవారనేకస్థలములలో ఆయాకాలములయందు పరిపాలించినట్లుల యిటీవల గాన్పించుటచేత ప్రథమపుటయందట్లులముద్రింపించియు పెద్దాపురసంస్థానచరిత్రమను ద్వితీయ నామకరణమొసంగితిమి.

## —: సా ధ న స ం ప త్తి :—

మాకీగ్రంథరచనలో ఏనుఁగు లక్ష్మణకవికృత రామవిలాసము, రంగారాయచరిత్రము, మహమ్మదీయమహాయుగము, ఆంధ్రకవులచరిత్రము మున్నగు ఆంధ్రగ్రంథములును డిస్ట్రిక్టుమేన్యుఅల్, గోదావరిజిల్లాగెజటీర్, ఫ్రెంచిహిస్టరీ ఇన్ ఇండియా, పొలిటికల్‌సర్వేఆఫ్ నార్తర్న్ఇండియా మున్నగు అనేకాంగ్లేయగ్రంథములును (ప్రాచ్యలిఖితపుస్తకభాండారములోని అమూల్యములైన స్థానికచరిత్రములు గల సంపుటములును చాలతోడ్పడినవి.) మేమా గ్రంథకర్తలయెడల మిగులకృతజ్ఞులమైయుందువారము.

(ఈ సందర్భమున మాకొక్కవిషయము తెలుపుట యావశ్యకమనితోచినది. మాకు విశేషముగతోడ్పడిన స్థానికచరిత్రములను గుఱించి మా గ్రంథపాఠకులకువిన్నవించుట మావిధియైయున్నది.

ఆసంపుటములనుగుఱించి మాకుగలయభిమానమునంతనుఁ గప్పఁ బుచుకొనుటకు అతిశయోక్తులతో విన్నవించుటకంటె ఆసంపుటములే లేనియెడల ఆంధ్రదేశములోని వివిధభాగముల చరిత్రములను తెలిసికొనుటకు ఎంతమాత్రమువీలుండదని ఒక్కవాక్యములో విశదపఱచుచున్నారము. అట్టి సంపుటములు మాకు ‘‘ పండలకొలది ఆంధ్రగ్రంథములు వెలువడుటకు ఆధారభూతులైన లక్ష్మీపుత్రులుగల ఆంధ్రదేశము మమ్మీవిధమున అనామధేయులుగఁజేయుట న్యాయమేనా? ’’ యని మొరలిడుచున్నటుల గాన్పించినవి. వేయేల? ఒక్కొక్కసంపుటము ఒక్కొక్కనవలవలె విచిత్రకల్పనలతోనలరారుచు మనపూర్వుల యమాయకమును, ప్రాచీనగాథలయందు వారికిగల కృత్రిమరహిత

విశ్వాసమును, కొంతవఱకు మనయాంధ్రభాషాపరిణామమును వేనోళ్ల చాటుచున్నవి.

మద్రాసునందలి ఆంధ్రసాహిత్యపరిషత్తువారు కెప్పటికయినను, యీ గ్రంథసంపుటములు వ్యవహారికభాషలోనున్నను, ముద్రింపించిన యెడల ఆంధ్రభాషాభిమానులచే నొసంగబడిన పరిషద్ధనమును సద్వినియోగము చేసినవారగుదురు.)

—: కృ త జ్ఞ త :—

మాకీగ్రంథరచనయం దుత్సాహముకలదని విన్నవించినపిదప మాయాశమును గ్రహించి మాకనుజ్ఞనిచ్చిన శ్రీరాజా నారాయణ జగపతిరాజుబావాజీగారికిని, మాపినతండ్రిగారగు శ్రీరాజా వరాహ నరసింహజగపతిరాజు నాన్నయ్యగారికిని, ఇంకను మా గ్రంథరచనకు తోడ్పడి మాకనేకవిధముల ప్రోత్సాహమును కలిగించిన మల్లంపల్లి సోమశేఖరశర్మ, వత్సవాయి సూర్యనారాయణరాజు, నడింపల్లినారాయణరాజుగార్లు, మున్నగుమిత్రులకును, బంధుగులకును, తదితరమిత్రవర్గమునకును, ఇందలిచిత్రపటములనొసంగిన ఆంధ్రపత్రికాధిపతులగు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారికిని, మా వందనములర్పించుచున్నారము. మా గ్రంథప్రకాశకులగు మేరీ ముద్రాక్షరశాలాధిపతులు మాకెన్నియోవిధముల తోడ్పడియుంట మేము వారియెడల మిగుల కృతజ్ఞులమైయుండువారము.

—: వి జ్ఞా ప న ము :—

క్షత్రియసోదరులారా! ఆంధ్రమహాజనులారా!!

మేమీ గ్రంథమునందు బహువచనప్రయోగముచేసియుంటిమి.

వివిధగ్రంథసాహాయ్యముతో వ్రాయబడిన యిట్టి చరిత్రగ్రంథముల యందు బహువచనప్రయోగమావశ్యకమను నభిప్రాయులమైయిటుల నుపయోగించితిమని మా మొకటివిన్నపము.

రామవిలాసగ్రంథ కృత్యాదిలో వర్ణింపఁబడిన ఆయారాజుల వంశీయు లిప్పుడెచటెచటయున్నదియు వివరముగవ్రాయవలెనని మా యభిప్రాయమేయయినను మాకుసరియయిన యాధారములు నంతుష్టిగాదొరకనికతమున వివరింపలేకపోతిమి. అంతియగాక యీ గ్రంథమునందెన్నియో భ్రమప్రమాదజనితములైన దోషములుదొరలినటుల మాకనుమానముకలదు. వాటినన్నింటిని గ్రంథపాఠకులు సకారణముగఁదెలిపినయెడల ద్వితీయముద్రణమునందు దిద్దుకొననంతటి దురభిమానులముకామని ముందుగనేవిన్నవించుచున్నారము.

ఇంకొకటి! మా గ్రంథపాఠకులు గ్రంథమునంతనుచిత్తగించి ఇందుఁజేర్పవలసిన విశేషాంశములను మాకు వ్రాసిపంపినచో ద్వితీయముద్రణమునందు సందర్భానుసారముగఁజేర్చుటయేగాక ఆంధ్రమహాజనుల ప్రోత్సాహమునుబట్టి అనేకచిత్రపటములతో ద్వితీయముద్రణముజరుగునని విన్నవించుచు విరమించుచున్నారము.

౧-౩-౧౯౧౫<br>
రాజమహేంద్రవరము.

బుధజనవిధేయుఁడు<br>
గ్రంథకర్త.

# పెద్దాపురసంస్థానాధినాథులయొక్కయు గ్రంథకర్తయొక్కయు వంశవృక్షం.

౧ శ్రీ దుర్జయుఁడు
- ముప్పరాజుగారు
- గోంకదోరపరాజుగారు
- పోతరాజుగారు — రాజాంబిక.
- త్యాగరాజుగారు
- దోరపరాజుగారు — చిమ్మాంబిక


౨ శ్రీ చాగిపోతరాజుగారు — రాజాంబిక
- నృసింహరాజుగారు
- మాచరాజుగారు
- ఎరపోతరాజుగారు.

3 శ్రీ రామరాజుగారు
- తెలుఁగురాయఁడుగారు
- తిరుమలరాజుగారు
- నాగరాజుగారు
- తిరుపతిరాజుగారు — అమ్మప్ప, ఊమ్మమ్మ
  - లింగరాజుగారు
  - జగ్గరాజుగారు

- రంగరాజుగారు
  - కోదండరాజుగారు
    - రంగరాజుగారు
      - నృసింహరాజుగారు
        - రామభద్రరాజుగారు.
          - నరసరాజుగారు
            - జగ్గరాజుగారు
              - నరసరాజుగారు
                - వెంకటరాజుఖమందానుగారు
                  - ౫ శ్రీ వెంకటజగపతిరాజుగారు

- జగ్గరాజుగారు
  - వేరరాజుగారు
    - ౪ శ్రీ తిమ్మరాజుగారు
      - గాయపరాజుగారు
        - తిమ్మరాజుగారు
        - బలభద్రరాజుగారు
          - రాయపరాజుగారు
            - తిమ్మరాజుగారు
              - జగపతిరాజుగారు
                - తిమ్మజగపతిరాజుగారు
                  - రాయజగపతిరాజుగారు
                    - లక్ష్మీనరసయ్యగారు
                      - బుచ్చితిమ్మరాజుగారు
                      - ౬ తిమ్మజగపతిరాజుగారు
                    - బుచ్చిసీతయ్యగారు
                      - ౫ శ్రీ వెంకటజగపతిరాజుగారు
                    - బుచ్చిబంగారయ్యగారు

నోటు;— ౭వ బుచ్చిబంగారయ్యగారి యనంతరమునవే భీమవరపుకోట ౮వ వత్సవాయ సూరపరాజుగారు రాజ్యమునకువచ్చిరి.


౫ శ్రీ వెంకటజగపతిరాజుగారు
సీతారామజగపతిరాజుగారు
౬ శ్రీ రాయజగపతిరాజుగారు
శ్రీబుచ్చివెంకయ్యగారు
వెంకటజగపతిరాజుగారు
వెంకటసూర్యనారాయణజగపతిరాజుగారు
వెంకటజగన్నాథజగపతిరాజుగారు
వరాహనరసింహజగపతిరాజుగారు
లక్ష్మీనరసింహజగపతిరాజుగారు
అప్పలనృసింహజగపతిరాజుగారు
పెదసీతారామజగపతిరాజుగారు
నారాయణజగపతిరాజుగారు
చినరాయజగపతిరాజుగారు
సత్యనారాయణజగపతిరాజుగారు
సీతారామజగపతిరాజుగారు
వెంకటజగపతిరాజుగారు
వెంకటజగన్నాథజగపతిరాజుగారు
లక్ష్మీనరసింహజగపతిరాజుగారు
వెంకటరామజగపతిరాజుగారు
౭ శ్రీ పెదరాయజగపతిరాజుగారు.
వెంకటకృష్ణజగపతిరాజుగారు.

( త్రిప్పి చూడుడు )

౧ = మూలపురుషులు.

౨ = చాగివారికి మూలపురుషులు.

౩ = వత్సవాయవారికి మూలపురుషులు.

౪ = పెద్దాపురసంస్థానాధీశులలో మొదటివారు

౫ = బుచ్చిసీతయ్యగారి పెంపుడుకుమారుఁడు.

౬ = లక్ష్మీనరసయ్యగారి పెంపుడుకుమారుఁడు.

౭ = చరిత్రము నంకితమునొందినవారు.

౮ = గ్రంథకర్త.

శ్రీ

# వత్సవాయ సంస్థాన చరిత్రము.

## పూర్వ చరిత్రము.

ఉత్తరసర్కార్లనంబడియెడి యాంధ్రదేశ భాగములోని పెద్దాపుర సంస్థానమును మూఁడుశతాబ్దములు పరిపాలించిన శ్రీ వత్సవాయ రాజ వంశజులు సూర్యాన్వయసంభవులనియును, వీరికి మూలపురుషుఁడు సాగి పోతిరాజనియును, ఏనుఁగులక్ష్మణకవి తనరామవిలాసమను గ్రంథమున

" శ్రీవిష్ణునాభి రాజీవమధ్యంబునఁ
ప్రభవించె విశ్వనిర్మాతధాత;
యంభోజభవునకు సంభవించె మరీచి
యతనికిఁ గశ్యపుఁ డవతరించెఁ,
గశ్యపబ్రహ్మకుఁ గలిగె బ్రహ్మాండదీ
పకుఁడు త్రయీమూర్తి భాస్కరుండు.
వనజమిత్రునకు వైవస్వతుం డుదయించె
ఘనుఁడు వైవస్వత మనువుఁగాంచె
దక్షు నిక్ష్వాకునృపునిఁ దద్వంశమునను
దగఁ గకుత్స్థుండు రఘువును దశరథుండు
జననమొందిర యాదశస్యందనునకు
రాముఁడుజనించెఁ ద్రిభువన రక్షకుండు "

“ వ. ఏతాదృశ మహాపురుషభూషితంబైన సూర్యాన్వయంబు సాగి వంశంబనం గ్రమంబుగఁ బ్రసిద్ధంబయ్యె. అందు సంభవించి

తే. సహ్యజాతీరమునకు భూషణమనంగ
సికుల కిరవగు గుడిమెట్టపురము దనకు
రాజధానిగ సత్కళాభోగరాజు
సాగిపోతక్షమాభర్త జగతి నేలె.

అను పద్యములో నభివర్ణనపూర్వకముగ వక్కాణించియున్నాఁడు.

క్రీ. శ. 1178, 1182 సంవత్సరముల మధ్య జరిగిన పలనాటి వీర యుద్ధమున, నలగామరాజునకు సహాయముగా సాగిపోతరాజు వచ్చినట్లు చెన్నపట్టణమునందలి లిఖితపుస్తకభాండాగారములోని పలనాటివీర చరిత్రమను గ్రంథముయొక్క యొక ప్రతిలోఁ గానవచ్చుచున్నది. గాని యీతండెంత సైన్యముతో వచ్చి యెటులతోడ్పడెనో, యెట్టి పరాక్రమమును గన్పఱచెనో తెలియు వివరము లేమియుఁ గానరావాయెను.

ఈ సాగిపోతరాజుగారినిగూర్చియు, వీరివంశమునుగూర్చియు నాంధ్ర చరిత్రోద్ధారకులగు శ్రీ చిలుకూరి వీరభద్రరావు పంతులుగారు తమ యాంధ్రులచరిత్రములో ద్వితీయభాగమున ౨౫౩, ౨౫౪, ౨౫౫ పేజీలలో

“ చాగివారు కాకతీయచక్రవర్తులకాలమున గుడిమెట్టరాజధానిగ నందిగామసీమనుఁ బరిపాలనముచేసిన సామంతమండలేశ్వరులుగ నుండిరి. చాగివారిలో వేఱొక కుటుంబమువారు పల్నాడు పరిపాలించు చుండిరని పల్నాటి వీరచరిత్రమునఁ జదివియున్నాము. పల్నాటి చాగివారు హైహయవంశజులమైన క్షత్రియులమని చెప్పుకొనియుండుట మనమెఱుం

గునును. గుడిమెట్ట చాగివారు దుర్జయవంశజులమనియు, మనుకుల సంభవులమనియుఁ జెప్పుకొనియుండిరి.

గుడిమెట్ట చాగివారిలోఁ గొందఱు మనుకులసంభూతులమని చెప్పుకొనియుండుటచేత వారిసంతతివారు వారిది సూర్యవంశమనియు, వసిష్ఠ గోత్రమనియుఁ జెప్పుకొననారంభించిరి. కాకతిగణపతిదేవరాయలకాలమునం దుండిన చాగిపోతరాజు గోదావరి మండలములోని పెద్దాపుర సంస్థానాధీశ్వరులయిన వత్సవాయవారికి మూలపురుషుఁ డని యేనుఁగు లక్ష్మణకవి ప్రణీతమైన రామవిలాసమను ప్రబంధమున వర్ణింపఁబడియెను.

"గీ. సహ్యజాతీరమునకు భూషణమనంగ
సిరులకిరవగు గుడిమెట్టపురముఁ దనకు
రాజధానిగ సత్కళాభోజరాజు
సాగిపోతక్ష్మాభర్త జగతియేలె"

ఈ సాగివంశపురాజులయొక్క శాసనములు, కృష్ణామండలములో నందిగామసీమలో నున్న గుడిమెట్ట, ముక్త్యాల, అనుమంచిపల్లె, పెనుగంచిప్రోలు, నవాబుపేట, బెజవాడ మొదలగు ప్రదేశములోఁ గానంబడుచున్నవి. నందిగామ తాలూకాలోని ముక్త్యాల గ్రామములోనున్న చెన్నకేశవస్వామి దేవాలయముయొక్క తూర్పుప్రాకారమునకు సామీప్యమునఁ బాఁతియున్న "నాగులబండ" అను స్తంభముమీఁద వ్రాయఁబడిన శాసనములో విష్ణువు నాభినుండి బ్రహ్మ జనించెననియు, వానినుండి దుర్జయుఁడు పుట్టెననియు, అతని వంశమున ముప్పరాజు జనించెననియు, అతనివంశమున గోంకగోరప రాజును, అతనికి పోతరాజును, ఆ పోతరాజునకు రాజాంబికయందు త్యాగరాజును (చాగిరాజు,) అతనికి గోరపరాజును, అతనికిఁజాగిపోతరాజును జనించిరని చెప్పఁబడినది.

గుడిమెట్టలోని యొక శాసనములో చాగిదోరపరాజునకు చిమ్మాంబిక యందు పోతరాజు జనించెననియు, అతనికి రాజాంబికయను పతివ్రత యైన భార్యకలదనియు వ్రాయఁబడియున్నది. ఏనుఁగులక్ష్మణకవి ప్రణీత మైన రామవిలాసములో సూర్యాన్వయమున సాగిపోతిరాజు జనించె ననియు, అతనికి నరసింహరాజును, అతనికి పోతరాజును, మాచరాజును, వారిలో మాచనృపతికి ఎఱ్ఱపోతరాజును, అతనికి తెలుఁగురాజు, రామ రాజు ననువారును పుట్టిరనియుఁ జెప్పఁబడియున్నది. పైనఁజెప్పినవారిలో నరసింహభూపతి కుమారుఁడైన పోతిరాజును లక్ష్మణకవి తన గ్రంథమునం దీవిధముగా నభివర్ణించియున్నాఁడు.

"మ. స్థిరభక్తిన్ గుడిమెట్టలోపలఁ బ్రతిష్ఠించెన్ గృపాసింధుబం
ధురసౌధంబున విశ్వనాథుఁ బరమాత్మున్ రాజనారాయణున్
సురవంద్యున్ బెజవాడయందునిలిపెన్ సుశ్లోకధర్మైకత
త్పరశీలుండగు మన్మపోతనృపుఁడే తన్మాత్రుఁడే యెన్నఁగన్. "

గుడిమెట్ట శాసనములో దోరపరాజునకు చిమ్మాంబికయందు జనిం చిన పోతరాజు పరిపాలనమును వర్ణించుచో

" శ్రీకృష్ణవేణ్యాస్తటభూమిభాగే
శ్రీపోతభూపో గుడిమెట్ట నామ్ని
విశ్వేశ్వరాఖ్యం శివ మాదిదేవం
సంస్థాపయామాస పురే స్వకీయే॥ "

అని గుడిమెట్టలో విశ్వేశ్వరస్వామిని ప్రతిష్ఠాపనముఁ జేసెనని చెప్పఁబడియుండుటచేత రామవిలాసములోని నరసింహుని పోతరాజును, ఈ దోరపరాజు పోతరాజును నొక్కఁడే యనిచెప్పఁదగును.

అట్లయినయెడల దోరపరాజునకు నరసింహరాజను నామాంతరము గలదని యూహింపవలయును. ఇంతియేగాక బెజవాడ కనకదుర్గాంబ యొక్క యాలయములో శ్రీ నరసింహవర్ధనచాగిపోతరాజు పేరిట శాసన మొకటిగలదు. అయ్యది నరసింహుని కుమారుఁడైన చాగిపోతరాజు శాసనమని తెలుపుచున్నది. కాఁబట్టి యిప్పుడు దోరపరాజునకు నరసింహరాజను నామాంతరముగలదని విశ్వసించెదము. ఈ పోతరాజు త్రిపురాంతక కాశ్మీర మల్లేశ్వర విశ్వనాథ చోడ నారాయణస్థానంబులఁ గనక కలశంబులను బెట్టించి, సింహగిరియందు నరసింహునకు నాగిపోతసముద్రంబను చెఱువుగట్టించి శ్రీపర్వతంబున (శ్రీశైలమున) మల్లికార్జునదేవుని ముందట నందికేశ్వరుని బ్రతిష్ఠించి, దేవభోగంబులకై కంభముపాడు, ముచ్చింతలు, బూదవాడ మొదలగు గ్రామములనిచ్చి బ్రాహ్మణభోగంబులుగా ననేకాగ్రహారంబులొసంగెనని బెజవాడ శాసనమునఁ జెప్పఁబడియున్నది. ఈశాసనము కాకతిగణపతిదేవచక్రవర్తి సింహాసనమధిష్ఠించిన శ్రీ శ. ౧౧౨౨ వ సంవత్సరమున వ్రాయఁబడినది. ఈకుటుంబములోనివారగు చాగిమనుమగణపతిదేవుని శాసనములుకూడ పెక్కులు నందిగామసీమలోఁ గానవచ్చుచున్నవి. అతఁడును, చాగిరాజును కాకతిగణపతిదేవుని సమకాలికులు. వీరు నతవాటిసీమలో నధికారమును వహించియుండిరి.

ఈ సాగివంశపురాజులచరిత్రమును సంపూర్ణముగాఁ దెలిసికొనుటకు మఱికొంతకాలముపట్టును. ఇప్పటికిదొరకినసాధనము లసమగ్రములుగ నున్నవి ” అని వ్రాయించియున్నారు.

ముక్త్యాలశాసనమును బట్టి పంతులవారుగ్రహించిన వంశానుక్రమణిక కొంచముతేడాగా గాన్పించుచున్నది. ముప్పరాజునకు త్యాగిదోర

పరాజను పుత్త్రుఁడుగలఁడని వ్రాయఁబడియుండెనే గాని గోంకనోంప రాజని కాదు. అదియుఁగాక యీ త్యాగిదోరపరాజుపుత్త్రుఁడయిన పోత రాజునకు త్యాగరాజు లేక చాగిరాజను పుత్త్రుఁడుగలఁడని పంతుల వారు వ్రాయించియున్నారు కాని ఆ శాసనమువలననే పోతరాజునకు దోరపరాజే పుత్త్రుఁడయినటుల గాన్పించుచున్నది. ఆశ్లోకముల నిట నుదహరించుచున్నాఁడను.

“ తస్మాన్మన్నృపధరాధిపోద్వభురభూ త్త్యాగాంకదోరాధిపః ”
తద్దోరక్షితివల్లభా ద్గుణనిధిః పోతక్ష్మాధీశ్వరః
శ్రీమత్పోతనరేశ్వరా న్మునినిభా ద్రాజాంబికాయామభూ
త్సానుర్దాననవీనభానుతనయ స్త్యాగిక్ష్మాధీశ్వరః
తస్య త్యాగగుణాంకస్య దోరభూపస్య నందనః
త్యాగిపోతధరాధీశో రాజతే రాజమండలే ”

విశేషచరిత్రాంశములను బరిశీలించుటలో పంతులుగారు తమ ఆంధ్రుల చరిత్రలో నట్లు ప్రమాదవశమున వ్రాసియుండవచ్చును.

—: సాగివారు నత్సవాయవారగుట :—

కాకతిగణపతిదేవ చక్రవర్త్తికాలమున సామంతమండలేశ్వరుఁడుగా నుండి, నందిగామసీమలో గుడిమెట్ట దుర్గమున కధీశ్వరుఁడుగానుండి, యధికారము నెఱపుచు, త్రిపురాంతక కాశ్మీర మల్లేశ్వర విశ్వనాథ చోడ నారాయణ స్థానంబులఁ గనకకలశంబులను బెట్టించి సింహగిరి యందు నరసింహునకు సాగిపోతసముద్రం బను చెఱువుఁ ద్రవ్వించి శ్రీశైలమున మల్లికార్జునదేవునిముందట నందికేశ్వరునిం బ్రతిష్ఠించి దేవభోగంబులకై కంభముపాడు, ముచ్చింతలు, బూదవాడ మొదలగు

గ్రామంబులనిచ్చి బ్రాహ్మణోపభోగంబులుగా ననేకాగ్రహారంబు లొసంగి ప్రఖ్యాతిగాంచిన పైసాగిపోతరాజునకు మాచరాజను సోదరుఁడుగలఁడు. ఆ మాచనృపతికి నెఱిపోతరాజు జనించెను. ఆయనకు తెలుఁగురాజు, రామరాజను నిరువురు పుత్త్రులుద్భవించిరి. ఎఱిపోతరాజు కాకతిరుద్రమదేవి మనుమఁడైన ప్రతాపరుద్రచక్రవర్తి సేనాపతులలో నొకఁడుగానుండి, మహమ్మదీయులతో జరిగినయుద్ధములలో నవక్రపరాక్రమమును నెఱపి వీరస్వర్గమునుజూఱఁగొన్న మహాశూరుఁడు. ప్రతాపరుద్రుఁడు మహమ్మదీయులతో జరిగిన యుద్ధమునందోడిపోయి, ఏకశిలానగరమను నామాంతరముగల యంధ్రనగరము తురుష్కులవశమైనతరువాత ఎఱిపోతరాజుపుత్త్రులగు తెలుఁగురాజు రేకపల్లిదుర్గమునకును, రామరాజు . వత్సవాయదుర్గమునకు నధిపతులుగానుండి, మహమ్మదీయపాలనమునకులోఁబడి కొంతకాలము రాచకొండదుర్గాధీశ్వరుండైన రేచర్లసింగమనాయునితోడను, కొంతకాలమువేమారెడ్డిమొదలగు రెడ్డినాయకులతోడను బోరాడుచువచ్చిరి. వీరిలో రామరాజుగారు వత్సవాయదుర్గాధీశులై పరిపాలించుటచేత తత్సంతతివారికి వత్సవాయవారను నామప్రసిద్ధిగలిగెనని రామవిలాసములోని

సీ. ఆ రామరాజేంద్రుఁ డాజిరంగంబున
వైరిరాజులఁగెల్చి వారిచేత
మదగజకంఖాణమాణిక్యగాణిక్య
కనకాంబరము లుపాయనములందె
యాచకశ్రేణుల కభిమతార్థములిచ్చెఁ
బ్రజలసంరక్షించె భరతునట్లు
తగవత్సవాయాఖ్యనగరంబు నిజనివా

నము( జేసె నదికారణముగ సాగి
వంశమునకు వత్సవాయనామము లోక
సుప్రసిద్ధమగుచు సొంపుగాంచె. ''

అను సీసపద్యమువలన విస్పష్టముగా బోధపడుచున్నది. కాఁబట్టి వత్సవాయరాజవంశజులకు మూలపురుషు లీరామరాజుగారని నిస్సంశయముగా నుడువవచ్చును. ఈయనకు రామరాజు, తెలుఁగురాజు, అనంతరాజు, గోపరాజు నను నల్వురు కుమారులుదయించిరి. వారిలోఁ దెలుఁగురాజు రేకపల్లి సంస్థానాధ్యక్షుఁడుగానుండి, శత్రునృపులకజేయుఁడై యుండి విక్రమార్కచరిత్రంబను నొకయుత్తమకావ్యమునకు నాయకుఁడయ్యెనని పై రామవిలాసములోని

మ. అచలాధీశ్వరసన్నుతుఁడు రేకపల్లి సంస్థానాధ్యక్షుఁడు విద్వేషిరా
ట్ప్రచయోద్వేలబలావలేపహరణప్రఖ్యాతునిన్ విక్రమా
ర్కచరిత్రోత్తమకావ్యనాయకుని వేడ్కన్ బ్రస్తుతింపంగఁ దగున్
సుచరిత్రాఢ్యుని వత్సవాయ తెలుఁగుక్షోణీశచూడామణిన్ ''

అనుపద్యమువలనఁ దెలియుచున్నది గాని విక్రమార్కచరిత్రమును నాయుత్తమకావ్యమునకుఁ గర్తయైన కవివరేణ్యుఁ డెవఁడో తెలియరాదయ్యెను.

—: రామరాజుసంతతి; దేశస్థితి :—

రామరాజునకుఁ బిమ్మట తత్సంతతివారియొక్క చరిత్రము వివరముగాఁ దెలియనట్టి యాధారము లిన్నూరు సంవత్సరములవఱకుఁ గానరావు. సాగివంశపురాజులాయాకాలములయందు తామునివసించుప్రదేశములను గట్టియు, ప్రసిద్ధులైన ప్రధాననాయకుల నామములను

బట్టియు వేర్వేఱు వంశనామములనువహించి దేశముయొక్క నానాభాగములకుఁ బోయి పౌరుషవిక్రమాదులను నెఱపుచు ప్రఖ్యాతి గాంచుచుండిరి అట్లే సాగివంశములో నంతర్భాగమైన వత్సవాయువంశములోనివారుకూడ కొంతకాలము స్వాతంత్రముగను, కొంతకాలము మహమ్మదీయుల పక్షముననను, మఱికొంత కాలము గజపతుల పక్షముననుండి ప్రతిపక్షనాయకులతోడఁ బోరాడుచు, నందందు గిరిదుర్గముల నాక్రమించుకొనుచుఁ బహునాఱవ శతాబ్దములో నీపెద్దాపుర సంస్థానమునుసంపాదించి, యించుమించుగా మూఁడుశతాబ్దములు పరిపాలనముచేసి గడుఁబ్రఖ్యాతివహించిరి. క్రీ. శ. ౧౩౨౩వ సంవత్సరములో నోరుగల్లనియెడు నంధ్రనగరము మహమ్మదీయుల వశమైన తరువాత, కాకతీయ ప్రభుత్వమున సర్వాధికారులుగానుండి ప్రఖ్యాతి వహించినరాచవారనేకులు కృష్ణాగోదావరుల నడుమ ననఁగా నోరుగల్లు మొదలుకొని రాజమహేంద్రవరము పర్యంతముగల భూభాగము నందుఁగల గిరిదుర్గప్రదేశముల కధీశులై ప్రతిపక్షనాయకులతోడఁ బోరాడుచుండిరి. కృష్ణకుదిగువభాగముననున్న దేశమంతయు రెడ్లకు వశమయ్యెను. ఓరుగంటికి దక్షిణభాగమంతయు పద్మనాయకుల వశమయ్యెను. క్రీ. శ. ౧౩౨౬వసంవత్సర ప్రాంతమున మంచికొండ కూనారెడ్డి యను వీరుఁడు రాజమహేంద్రవరమునుండి తురుష్కులను తఱిమి కొరుకొండకోటనుగట్టి కృష్ణాగోదావరిమండలములలోనియుత్తర భాగమునుజయించి కొరుకొండ రాజధానిగఁ బరిపాలింపనారంభించెను. దీనికి రెడ్డిసీమ యనువాడుక నిప్పటికిగలదు. వీరు క్రీ. శ. ౧౩౮౦ వసంవత్సరమువఱకుఁ బరిపాలించిరి. తరువాతకొండవీటిరెడ్ల బంధువుల పరిపాలనము క్రిందికివచ్చెను. ఈకొండవీడు, కొరుకొండ రెడ్లసంబంధ

బాంధవ్యములచేత నొక్కటియై. కృష్ణాగోదావరీమండలములలోనుండు రాచవారిప్రదేశముల నాక్రమించుటచేత రాచవారనేకులు బహమనీ రాజుల సహాయమునుబొంది, పద్మనాయకులకు రెడ్లకు నొత్తిడికలుగఁ జేయుచువచ్చిరి. మహమ్మదీయులతోడ్పాటుతో రాచవారు పద్మనాయకులను, రెడ్డినాయకులను జయించుటదుస్తరమగుటచేతనో, మతాంతరులైన తురుష్కుల సాహాయ్య మపేక్షించుట దేశద్రోహమగునన్న తలంపుచేతనో గాని కళింగోత్కల దేశాధీశ్వరులగు గజపతుల సహాయమునుబొంది, కపిలేశ్వర గజపతిరాయలకాలమునఁ బశ్చిమమున నోరుగల్లువఱకును, దక్షిణమునఁ గాంచీపురమువఱకును జయించిరి. వత్సవాయవారు, సాగివారు, పూసపాటివారు, మంగపాటివారు, దంతులూరువారు, గణపతిరాజువారు మొదలుగాఁగల సుప్రసిద్ధులగు రాచవారనేకులు గజపతులక్రింద సర్వాధికారములనువహించి ప్రబలులైరి. రెడ్లపరిపాలన మడుగంటెను. రెడ్డినాయకులు, కమ్మనాయకులు, పద్మనాయకులు కొందఱు నరపతులక్రిందను, మఱికొందఱు గజపతుల క్రిందను నధికారపదవులనువహించి మహమ్మదీయులతోడఁ బోరాడుచుండిరి.

క్రీ. శ. ౧౪౨౧వసంవత్సరములో బహమనీ రాజైన అహమ్మదుషా త్రిలింగదేశపురాజులను జయించి ఓరుగల్లుపట్టణమును వశపఱచుకొనియెను. కాని ౧౪౬౦వసంవత్సరములో కళింగదేశపురాజును, కపిలేంద్రగజపతిమహారాయల కుమారుఁడునునగు ఉర్బరదేవకుమారమహాపాత్రుఁడును, రఘువంశసంజాతుఁడును, పరశురామతనయుండును నగు వీరభద్రరాజునుఁగలిసి ఏకశిలానగరముపై దండెత్తివచ్చి, మహమ్మదీయుల నచ్చటినుండి పాఱఁద్రోలి, ఓరుగల్లును మఱల స్వాధీనము

చేసికొన్నట్లు, అచ్చటివారిశాసనములవలన బోధపడుచున్నది. అయినను ౧౪౬౩వ సంవత్సరములో రెండవ మహమ్మదు సింహాసనమునకు వచ్చి, ౧౪౭౧వ సంవత్సరములో గజపతులకు సామంతులుగానున్న మండలేశ్వరులన్యోన్యవైషమ్యములను బెంచికొని, తమలోఁదాముపోరాడుచుంటనుజూచి, కొండపల్లి రాజమహేంద్రవరదుర్గములను, తత్ప్రాంత ప్రదేశములను తనరాజ్యములోఁ జేర్చికొనుటకై సంకల్పించి, విఫలమనోరథుఁడయ్యెను. తరువాత కపిలేంద్రగజపతి మరణమునొందఁగా పురుషోత్తమగజపతిమహారాయలు సింహాసనమునకువచ్చెను. అందును గూర్చి యతనికిని, నతనిదాయాదికిని వివాదముపొసఁగి, యాదాయాది మహమ్మదీయుల సాహాయ్యమునుగోరెను. అప్పుడు బహమనీరాజైన రెండవమహమ్మదుషా యదివఱకే గజపతులరాజ్యము నపహరింపవలెనను పేరాసతో నున్నవాఁడగుటచేత మిక్కిలిసంతోషించి, యీపని నిర్వహించుటకై, మల్లిక్ హుస్సేన్ బహిరీ యనువానినినియమించి, వానికి సర్వసేనాధిపత్యముకొసఁగి, నిజామ్-ఉల్-ముల్క్ అను బిరుదము నొసంగెను. ఈ బిరుదమే తరువాత మహమ్మదీయుల బిరుదములలో మిక్కిలి ప్రఖ్యాతివహించినదయ్యెను. ఈనిజామ్-ఉల్-ముల్క్ మొదట నాంధ్రుఁడుగానుండి, బాల్యములో మహమ్మదీయులచేఁ జెఱఁగొనిపోఁబడి యంతఃపురమున రాజునకు సహవాసిగా నియమింపఁబడి, మహమ్మదీయమతావలంబకుఁడై, బహమనీరాజుయొక్క దయకుఁ బాత్రుఁడై, యభివృద్ధిఁగాంచి, ప్రఖ్యాతికెక్కినవాఁడుగానుండెను. తరువాత నీతఁడు గజపతులరాజ్యముపైకి దండెత్తిపోయి, కొండపల్లి రాజమహేంద్రవర దుర్గములనుజయించి, యాదేశములను దనప్రభువురాజ్యములోఁ జేర్పించెను గాని తరువాత నయ్యవి యొకసంవత్సరముకాలములోనే గజప

తులకు సామంతులుగానున్న మండలేశ్వరుల వశమయ్యెను. అంతట రెండుసంవత్సరములు దేశములో క్షామోపద్రవముసంభవించి, వర్షములులేక, పంటలుపండక, బావులింకిపోయి, ప్రజలువలసపోవుట తటస్థించెను. ఈ రెండుసంవత్సరములలోను త్రిలింగదేశమును, బహమనీరాజ్యమునుగూడ వేడిమంగలమువలె వేగుచుండుటచేత విత్తనముల చల్లికయేలేకపోయెను. కాని కొంతకాలమునకు భగవదనుగ్రహమువలన వర్షముకురిసి భూమివ్యవసాయమున కనుకూలముగనున్నను, వ్యవసాయముచేయు జనులసంఖ్య మిక్కిలి తక్కువైయుండెను. ఇట్లుండఁ గొండపల్లి దుర్గములోనున్న తెనుఁగుసైన్యము తిరుగఁబడి, దుర్గాధ్యక్షుఁడను మహమ్మదీయప్రభువును సంహరించిరనియు, ఏతద్దుర్గమును వశపఱచుకొన్న భీమరాజు దేశమంతయు క్షామభూయిష్ఠమై యుండుటచేత బహమనీరాజుల ప్రాభవమంతయు సైన్యముల వ్యయముక్రింగ తరిగిపోయి, సైన్యములసంఖ్యగూడ తగ్గియున్నదనియు, పూర్వార్జితమైనదేశమునంతయు స్వాధీనముఁజేసికొనుట కిదియే తరుణము గావున దండెత్తిరావలసినదనియు, తనకుఁజేతనైన సహాయముఁ జేయుటకుసిద్ధముగానున్నాననియు, గజపతిరాజులకడకు రాయబారినొకనిఁ బంపెననియు, గజపతి పదివేల గుఱ్ఱపుదళముతోడను, ఎనిమిదివేల పదాతివర్గముతోడను దండయాత్రబయలుదేఱి వచ్చుచుండుటనువిని, రాజమహేంద్రవరము కొండపల్లి ప్రాంతదేశములకు గవర్నరుగానున్న నిజామ్-ఉల్-ముల్క్ శత్రువు నెదుర్కొనఁజాలక, రాజమహేంద్రవరదుర్గములోఁ బ్రవేశించి, దుర్గద్వారమును మూయించి, సహాయమునకై నిరీక్షించియున్నాఁడనియు, నిజామ్-ఉల్-ముల్క్ వలనఁ బంపఁబడిన చారులువచ్చి కొల్వుకూటమున మహమ్మదుషాకు నివేదించిరి.

అప్పుడు మహమ్మదుషాయుగ్రుఁడై, తానుస్వయముగానే శత్రువుల పైకి దండయాత్ర వెడలుటకు నిశ్చయించుకొని, తనసైన్యమునకంతకును నొకసంవత్సరమునకయ్యెడు జీతబత్తెములను ముందుగనేయొసంగి, గొప్పసైన్యముతో బయలుదేఱి కొన్నిదినములకు రాజమహేంద్రవరము వచ్చిచేరెను. ఈవార్తవిని, శత్రువులను వంచించి, వారిని మార్కొనకయే, భీమరాజు మరలిపోయి, కొండపల్లిదుర్గమునుజేరెను. ఇంతసైన్యమును బహిరంగప్రదేశమున నెదుర్కొనుటకు సాహసింపఁజాలక, గజపతి పలాయనుఁడయ్యెను. ఇటువంటి యవస్థను భరింపఁజాలక, కోపోద్రేకమనస్కుఁడై, తనకువరాసుఁడైన మహమ్మదుఖానును, విశ్వాసపాత్రుఁడైన ప్రధానమంత్రియగు ఖ్వాజామహమ్మదుగవానును రాజమహేంద్రవరమునఁబిలిపి, ఉత్కలదేశముపై దండెత్తిపోయి, దేశమునుపాడుచేసియు, ప్రజలను చూఱఁగొనియుఁ, దృప్తిఁగనఁజాలక, గజపతిని సింహాసనభ్రష్టునిఁగావించి. గజపతిరాష్ట్రమునంతయు శాశ్వతముగఁ దనరాష్ట్రములోఁ జేర్పవలయునని నిశ్చయించి, తనకొమరుని, మంత్రిని రాజమహేంద్రవరమునుండి రప్పించెను. కాని బుద్ధిశాలియగు గజపతి సమర్థులచే రాయభారమునడిపించి, కొంతధనమాతనికి సమర్పించి, తురుష్కులు మరలిపోవునట్లు చేసెను. ఆ ధనముతో మహమ్మదుషా తృప్తిఁబొందనందున, ప్రాణసమానముగాఁ జూచుకొనుచున్న యిరువదియైదు యుద్ధగజములనుగూడసమర్పించెను. అంతట మహమ్మదుషా మరలి కొండపల్లి వఱకువచ్చి, రోషావేశపరవశుఁడై కొండపల్లిదుర్గమును ముట్టడించెను. కాని యాఱుమాసములవఱకా దుర్గము స్వాధీనముకాకపోయెను. ఆహారపదార్థములు తక్కువగుటచేత భీమరాజు దుర్గములో నిలువఁజాలకలోఁబడి, దుర్గమును తురు

తురుష్కులవశముచేసెను. మహమ్మదుషా తనకింతకాలముపట్టు దుర్గము వశముకానందుకు మండిపడుచు, మతాభినివేశపరవశుఁడై, యచటి దేవాలయములలో నొకదానిం బ్రవేశించి, తనచేతిఖడ్గముతో బ్రాహ్మణ పూజారులను గొందఱినరికి, లింగమును పగులఁగొట్టి యా ప్రదేశమున నొకమసీదుకట్టించి, దానధర్మములను విరివిగాఁగావించి, యందు ప్రార్థనలనుజరిపి, దివానుయొక్క ప్రోత్సాహముచేత ఘాజీయను బిరుదమునువహించెను. ఇంతచేసినను దేశమువీరికి స్థిరపడక, పురుషోత్తమగజపతిమహారాయలచే మఱలజయింపఁబడి, గజపతుల పరిపాలనమునందేయుండెను. అటుతరువాతఁ బదునాఱవశతాబ్దము ప్రారంభమున విద్యానగరాధీశ్వరుండగు కృష్ణదేవరాయచక్రవర్తి యసంఖ్యాకములగు సైన్యములతో పూర్వదిగ్విజయయాత్ర వెడలివచ్చి ఉదయగిరి, కనకగిరి, వినుకొండ, కొండవీడు, బెల్లముకొండ, నాగార్జునకొండ, కొండపల్లి, రాజమహేంద్రవరము, సింహాద్రి, ఒడ్డాదిమొదలగు దుర్గములనాక్రమించి, గజపతి సైన్యములఁబాఱఁద్రోలి, తుదకు ప్రతాపరుద్రగజపతితో సంధిచేసికొన నంగీకరించి, యాతని కొమార్తెను వివాహముచేసికొని, గోదావరి పర్యంతముగల భూభాగమును మరల గజపతులకిచ్చివేసెను. మహమ్మదుషా మరణానంతరము నాయూపరగణాలకుఁ బరిపాలకులుగానున్నవారు రాజద్రోహులై, బహమనీరాజ్యమునుండివిడిపోయి తమపాలనమునున్న పరగణాలకు తామే రాజులమని ప్రకటించి స్వతంత్రపరిపాలనము చేయనారంభించిరి. అట్టివారిలో సుల్తానుకూలీకుతుబ్ ఉల్ ముల్కు గోలకొండరాజధానిగఁ జేసికొని తెలింగానా ( తెలుఁగు ) దేశమును బరిపాలింపనారంభించెను. ఇతఁడు తురుష్కదేశమునుండివచ్చిన యొకయుద్ధవీరుఁడు. ఇతఁడు బహ

మనీ రాజ్యమునుండి కొంత ప్రదేశము నాక్రమించుకొనుటతోమాత్రము తృప్తిఁగొనక, మహమ్మదీయమతమునకు శత్రువులుగానున్న యాంధ్ర రాజులను జయింపఁగోరి విజృంభించెను. సీతాపతినోడించి, కంభము మెట్టవఱకుఁగల తెలుఁగుదేశము నాక్రమించెను. అద్దంకి గంగాధర కవి వీనివిజయములను దనతపతీసంవరణోపాఖ్యానములో

"సీ. పడమటనుసవాయి బసవనిఁగాఁ జేసి
యచట గోల్యాలకొండ నావరించె,
తమది మల్లాఖాను దక్షిణంబునఁగొట్టి
హరియించెఁ బానుగల్లాదిగిరులు
నుత్తరంబున బరీదాడిపాఱఁగఁ దోలి
మెతుకుదుర్గం బాక్రమించిమించెఁ
బ్రథమదిక్కునవొడ్డె పాత్రసామంతుల
ధట్టించికంభముమెట్టఁగొనియె
నతనిఁ బొగడంగఁదగదె యాచతురసీతి
రూఢి గిరిదుర్గలుంఠన ప్రౌఢతేజు
వాహశిఖరాధిరోహరేవంతమూర్తి
కుతుబశాహిఇబ్రాహిము గుణవిశాలు"

అనిపద్యమునందభివర్ణించెను. ఇతఁడు ౧౫౩౮వసంవత్సరములోఁ గన్నుపోఁగొట్టుకొనియెను. ఇతఁడాంధ్రదేశముపై దండెత్తివచ్చి వరుసగా కంభముమెట్ట, కొండపల్లి, ఏలూరు, రాజమహేంద్రవరము, శ్రీకాకుళము మొదలగు దుర్గములను ముట్టడింపఁగా విశ్వనాథదేవ గజపతి సుల్తానుకూలీ, కుతుబ్షాతో సంధిచేసికొని, యుభయరాజ్య

ములకు గోదావరినది సరిహద్దుగా నిర్ణయించుకొనిరి. అంతట సుల్తాను
కూలీకుతుబ్‌షా తన ముఖ్యనగరమైన గోలకొండకు మరలిపోయెను.
ఇతఁడు ౧౫౪౩వ సంవత్సరములోఁ దొంబదవయేటఁ దనరెండవకుమా
రుఁడైన జమ్షీదుచేఁ జంపఁబడియెను. తరువాత ౧౫౫౦వ సంవత్స
రమునఁ బ్రసిద్ధివహించిన ఇబ్రహీమ్‌కూలీకుతుబ్‌షాహా తెలింగనా
దేశము నాక్రమించుకొనియెను. ఇతఁడు సుల్తానుకూలీకుతుబ్‌షాహా
యొక్క నాలుగవ కొమరుఁడు. ఇతనికి జగదేవరావను నాంధ్రుఁడు
మంత్రిగానుండెను. ఇతని సైన్యములో రెండువంతు లాంధ్రులుగా
నుండిరి. అయినను మతభేదముచేత విశ్వాసపాత్రుఁడయ్యెను, జగ
దేవరావు తనమంత్రిత్వమును నిర్వహింపలేక, ఇబ్రహీముతో సరిప
డక, విజయనగరసామ్రాజ్యమునకభిషిక్తుఁడైన సదాశివరాయని మంత్రి
యగు రామరాజుతోఁ జేరుకొని, కుతుబ్‌షాసైన్యములతోఁ బోరాడు
చుండెను. అంతట హిందూమహమ్మదీయప్రభువు లనేకులేకమై, గోల
కొండ దుర్గమును ముట్టడించిరి. కొండవీటిదుర్గమున కధిపతిగానున్న
రామరాజుమేనల్లుఁడు తిమ్మరాజు కొండపల్లిదుర్గమును బట్టుకొనియెను.
గజపతులపక్షమున సీతాపతి, విడియాద్రి, ఆతనిమంత్రి వత్సవాయ
ముసలితిమ్మరాజు దండెత్తివచ్చి, ఏలూరు దుర్గమును ముట్టడించిరి.
ఏలూరు సర్కారునకు డిలావర్‌ఖానుఁడు గవర్నరుగానుండి, కోటలో
నుండి యధికపౌరుషముతోఁ బోరాడెను గాని నిష్ప్రయోజనమై,
మిక్కిలిదురవస్థలోనుండి, గోలకొండ కనేకచారులనుబంపించి, సహా
యమునకై నిరీక్షించియుండెను. అంతట ఇబ్రహీము తన్ను ముట్ట
డించియున్న శత్రువులతో సంధిచేసికొని కొంతసైన్యమును డిలావర్
ఖానునకుఁ దోడ్పడుటకై ఏలూరునకుఁ బంపించెను. డిలావర్‌ఖాను

డీసైన్యముయొక్క తోడ్పాటుచే శత్రువులను జయించి, కుతుబ్‌షాహయొక్క యుత్తరువును శిరసావహించి, శత్రువులు సరిహద్దును దాటి రాకుండ, నిడుగవోలులో నొకకోటఁగట్టించెను. ఈకోటనుగట్టి డిలావరుఖాను రాజమహేంద్రవరదుర్గమును ముట్టడించి స్వాధీనము చేసికొనుట యుక్తమని బోధించెను.

## —: రఫత్‌ఖానుని దండయాత్ర. :—

అప్పుడు హరిచందనదేవుఁడు లేక విష్ణుదేవుఁడను నాంధ్రుఁడు గజపతులరాజ్యము నాక్రమించుకొని, బంగాళాదేశము మొదలుకొని గోదావరిపర్యంతముఁగల తూర్పుతీరమును బరిపాలించుచుండెను. రాజమహేంద్రవర దుర్గ మాతని రాజ్యములో నిదిగానుండి, తత్ప్రాంత ప్రదేశమునకుఁ బరిపాలకుఁడుగానున్న విడియాద్రిచే (రెడ్డికాఁబోలు) సాగింపఁబడుచు, ఆంధ్రమహమ్మదీయులకు దుస్సాధ్యముగనుండెను. ఈదుస్సాధ్యుఁడైన విడియాద్రి కొంచెమించుమించుగా స్వతంత్రుఁడై వ్యవహరించుచుండెను. రెడ్డిసంస్థానమునకుఁ బరిపాలకుఁడై, విడియాద్రికి మంత్రిగానున్న వత్సవాయపేర్రాజుగారి పుత్రుఁడగు ముసలియను నామాంతరముగల తిమ్మరాజుగారు రెండువేల సైన్యమున కధీశ్వరుఁడైన సరదారుగానుండి, మహమ్మదీయులతోఁ గుట్రచేయనారంభించెను. మహమ్మదీయులకుఁ దోడ్పడుటకును, అందునకుఁ బ్రతిఫలముగ కిమ్మూరుసీమను దనకిచ్చునట్లును నొడంబడిక చేసికొనియెను. ఇంతియగాక కళింగదేశమున మాండలికరాజు లన్యోన్యమువంచకులై, యొండొరులతోఁ బోరాడుచుండిరి. బంగాళాదేశ ప్రాంతమునుండి శత్రువులు దండెత్తివచ్చుటచేత హరిచందనుఁ డుత్తరభాగమున యుద్ధ

ములుచేయుచుండెను. ఈ కారణములచేత ఇబ్రహీము ఉత్సాహవంతుఁడై, డిలావరుఖానుని కోరికననుమన్నించెను. అప్పుడు ప్రసిద్ధికెక్కిన సేనానియగు రఫత్ ఖానులారీ యను నాతనికి మల్లిక్ నాయబ్ అను బిరుదమునొసంగి, సైన్యాధ్యక్షునిఁ గావించి, తక్షణముపోయి నిడుదవోలుమార్గమునఁ బ్రవేశించి, రాజమహేంద్రవరము వెళ్లుటకు సంసిద్ధుఁడవుగానుండవలసినదని యాజ్ఞాపించిపంపెను. రఫత్ ఖానులారీ పదివేలగుఱ్ఱపుబలముతో బయలుదేఱివెళ్లెను. ఇతనిరాకకు భయము చెంది, విడియాద్రి లేక వేదాద్రి, సీతాపతి మొదలగు గజపతుల సేనాపతులు తమ పొరుగుననున్న మాండలికులను హెచ్చరించి, రాజమహేంద్రవరమున సైన్యముల నమకూర్చుచుండిరి. మహమ్మదీయ చరిత్రకారులు తెల్పినది సత్యమగునేని వీరి సైన్యము లక్ష కాల్బలమును, రెండువేలగుఱ్ఱపుదళమును. రెండువేల తుపాకువాండ్లను గలిగియుండెను. ఆంధ్రులే గోదావరినిదాటి, మహమ్మదీయులను మార్కొనిరట! అప్పుడు ఘోరమైన యుద్ధము జరిగెననియు, ఆ యుద్ధములో హిందువులు నిలువఁజాలకమరలివచ్చి, రాజమహేంద్రవరముఁ బ్రవేశించిరనియుఁ నొక చరిత్రకారుఁడు వ్రాయుచున్నాఁడు. మహమ్మదీయులకు జయములభ్యమైనను, తమ శత్రువులను వెంబడింపక పోవుటకుఁగారణము కాన్పింపదు. అంతియుఁగాక మహమ్మదీయులు తరువాత నెమ్మదిగాఁబోయి ధవలేశ్వరముకడ గోదావరినిదాటి దాని వశపఱచుకొని, దండునిలుచుతావుగఁ జేసికొనుటకుఁగూడ కారణముకాన్పింపదు. కావునహిందువులు గోదావరినిదాటి మహమ్మదీయులపైకి ముందుగాఁ బోయియుందురని తలంపరాదు. ఇట్లురఫత్ ఖాను ధవళగిరిప్రవేశించి, తనసామాగ్రిని, కొంతసైన్యము నచ్చటనిలిపి, కొంత సైన్యముతోఁ

బోయి, తాటిపాకదుర్గమును బట్టుకొనఁ బ్రయత్నించెను. నరసింగరావను వీరుఁడు దానినిసంరక్షించుచుండెను. వర్షకాలముకూడ తటస్థమయ్యెను. మహమ్మదీయు లోడిపోయినందున వర్షకాలము వెళ్లినతరువాత మఱల వచ్చి ముట్టడింపఁదగునని నిశ్చయించి, తురుష్క సేనాపతి తనసైన్యములను మరలించుకొనిపోయెను. వర్షకాలము వెళ్లినతరువాత మహమ్మదీయులు తాటిపాకదుర్గమును వశముచేసికొనఁబోయి కృతార్థులైరి. తాటిపాకసీమయంతయు వశమయ్యెను. ఆసైన్యము తిరిగివచ్చినతరువాత తిన్నఁగాఁబోయి రాజమహేంద్రవరమును ముట్టడింపఁ దలంచిరి గాని విజయనగరాధీశ్వరుండైన రామరాయలకును, దక్కనుసుల్తానులకును తల్లికోటకడ ఘోరమైన మహాయుద్ధముజరుగనున్నందున రఫత్ ఖానులారీ కుతుబ్‌షాహా యాజ్ఞను శిరసావహించి, తురుష్క సైన్యములనన్నింటిని మరలించుకొని, మూలబలమును జేరుకొన గోలకొండకుఁ బోయెను. క్రీ. శ. ౧౫౬౫ వ సంవత్సరములో నాంధ్రకర్ణాటులకు మహమ్మదీయులకు తల్లికోటకడ ఘోరయుద్ధము జరుగుటయు, మహమ్మదీయులకు విజయముకలుగుటయు, రామరాజు, వేంకటాద్రి కదనభూమినిఁబడుటయు, తిరుమలరాజు పెనుగొండకుఁ బాఱిపోవుటయు, విజయనగరము చూఱఁగొనఁబడి విసర్జింపఁబడుటయు మొదలగునవి సుప్రసిద్ధములైన చరిత్రాంశములు. పండ్రెండుమాసములు గడచినవెనుక రఫత్‌ఖానులారీ పదివేల గుఱ్ఱపుదళముతో మరల రాజమహేంద్రవరముపై దండెత్తివచ్చెను. అతఁడు ధవళేశ్వరము చేరునప్పటికి సీతాపతి పెద్దాపురము రాజానగరములనుండి సేనలను రాజమహేంద్రవరమునకుఁ జేర్చునట్లుగా సమాచారము తెలియవచ్చెను. అతఁడు తక్షణమేపోయి పెద్దాపురమును ముట్టడించి, సేనలు రాజమహేంద్రవ

రమునకు తాకండ నడ్డుపెట్టవలయునని నిశ్చయించుకొని బయలుదే అఁగా, దారిలో సీతాపతికిని రఫత్ ఖానునకును గొప్పయుద్ధము జరి గెను. అప్పుడు సీతాపతియోడిపోయి పెద్దాపురము కోటలో దాఁగొ నియెను. రఫత్ ఖాను పెద్దాపురమును ముట్టడించెను. సీతాపతి తనకుటుంబముతోఁ దప్పించుకొని రాజానగరదుర్గమునకుఁ బోయిచేరెను. పెద్దాపురదుర్గము సులభముగా శత్రువుల వశమయ్యెను. ఆ మఱు నాఁడు రఫత్ ఖాను రాజానగరముపై దాడివెడలెను. అడవులుదట్ట ముగానుండి దారులిఱుకై నవియగుటచేత దినమునకు రెండు మైళ్లకంటె నెక్కువగా మహమ్మదీయ సైన్యములు ప్రయాణము చేయఁజాలక పోయెను. మార్గమధ్యమున శత్రువులందంద మాఱుకొనుటవలన మూఁడువందల సైనికులకంటె నధికముగా మరణముఁ బొందిరి. ఎట్ల యినను మార్గముచేసికొని మహమ్మదీయులు రాజానగరమును ముట్ట డించునప్పటికి సీతాపతి తన సైన్యముతోఁ దప్పించుకొని రాజమహేం ద్రవరమునకుఁబోయి, విడియాద్రితోఁ జేరికొనియెను. అంతట మహ మ్మదీయ సైన్యాధిపతి రాజమహేంద్రవరముపైకి దాడి వెడలెను.

## —: రాజమహేంద్రవరము యుద్ధము :—

అప్పుడు రాజమహేంద్రవరము కోటసమీపమున మున్నెన్నఁ డును జరిగియుండని యొక మహాయుద్ధ మిరుపక్షములవారికిని జరిగి, రక్తనదులు ప్రవహించెను. హిందువులు కుడిప్రక్కనున్న మహ మ్మదీయ సైన్యభాగమునోడించి తఱిమిరిగాని వారికిఁ దరువాత ధవళే శ్వరమున నిలువయున్న మూలబలమువచ్చి తోడ్పడుటచేత హిందు వులు బహిరంగప్రదేశమున నిలువంజాలకఁ దుర్గములోఁ బ్రవేశిం చిరి. రఫత్ ఖానుడు నాలుగు మాసములవఱకు కోటను ముట్టడించి

యుండెను. అప్పటికి హిందూసైనికులకు కోటలోనిల్చుట దుర్భరమై యుండెను. అప్పుడు వేదాద్రి సంధికై తగుమనుష్యులను రఫత్ ఖానునికడకంపెను. రఫత్ ఖానుడు తనకడ లేఖరిగానున్న నియోగి యగు ఎల్లుపంతులుని బంపించెను. వేదాద్రిని, సీతాపతిని వారి కుటుంబములతో విడిచిపెట్టుటకు నొప్పుకొన్న యెడల కోట వశముచేసె దమని వర్తమానమంపిరి. అందునకు యుద్ధమున విసిగికొనియున్న రఫత్ ఖాను డంగీకరించెను. వేదాద్రి ఖాసింకోటకును, సీతాపతి విజయనగరమునకును స్వకుటుంబములతో వెడలిపోయిరి. రాజమహేంద్రవరము క్రీ. శ. ౧౭౭౧-౭౨ సంవత్సరములలో మహమ్మదీయులవశమయ్యెను. నాటినుండి మఱియెన్నడును హిందువుల వశమున నుండలేదు. ఈ యుద్ధమువలన లాభముపొందిన సర్దారుడు వత్సవాయ ముసలితిమ్మరాజుగారు మాత్రమేయైయున్నాడు. తరువాత రఫత్ ఖానులారీ కుతుబ్ షాహా యాజ్ఞప్రకారము ఖాశింకోట మొదలగు దుర్గములపైకిగూడ దండెత్తిపోయి ఖాశింకోటసమీపమున హిందూసైన్యాధిపతియగు వేంకటరాజునోడించి బందరు మొదలుకొని కటకమువఱకుగల దేశమునంతయు జయించి రాజమహేంద్రవరమునకు మరలివచ్చెను. దేశములోని వివిధప్రదేశము లాంధ్రరాజులచే బరిపాలింపబడుచున్నను నాగెల్లరును మహమ్మదీయులకు లోబడినవారై కప్పములుచెల్లించువారుగానుండిరి. అట్టివారిలో వత్సవాయ ముసలితిమ్మరాజుగారు మిక్కిలి ప్రముఖులుగానుండిరి.

### —: వత్సవాయ ముసలితిమ్మజగపతిరాజుగారు :—

( వీరు వేదాద్రికి మంత్రిగానుండుటకు బూర్వము పెద్దాపుర

దుర్గమున కధీశ్వరులుగానున్నట్లు తెలియుచున్నది. వారుసంస్థానమును సంపాదించినవిధము స్థానికచరిత్రమునం దిట్లుచెప్పఁబడుచున్నది. పెద్దాపురము చుట్టునుండుప్రదేశము పూర్వకాలమున కిమ్మూరుఁడను రాక్షసునిచేఁ బరిపాలింపఁబడినదనియు, వానిపేరిటనే కిమ్మూరున దుర్గము నిర్మింపఁబడినదనియు, ఆకారణమున నీప్రదేశము కిమ్మూరుసీమ యని వ్యవహరింపఁబడుచుండెననియుఁ దెలియుచున్నది. ఇయ్యది మొదట రెడ్లపరిపాలనము క్రిందనుండి దేశముగజపతుల యధీనమైనతరువాతను వత్సవాయముసలితిమ్మజగపతిరాజుగారిచే సంపాదింపఁబడినది. అల్లాడ వేమారెడ్డి సంతతివాఁడైన రెడ్డివేంకటప్ప యనునాతఁడు కిమ్మూరు, ప్రోలునాడుసీమలను బరిపాలించుచున్నప్పుడు వాని సరదారుఁడైన యినుకపల్లి పెద్దాపాత్రుఁడనునాతఁడు కిమ్మూరుసీమకు పాలకుఁడుగా నుండి యతనిసిబ్బందికైన వ్యయముపోఁగా మిగిలిన యాదాయమును నగరునకుఁజేర్పవలసినదని యాజ్ఞాపింపఁబడియెను. ఈపెద్దాపాత్రుఁడు కిమ్మూరుసీమలోఁ జేరిన తిమిరె యను గ్రామమునకు నుత్తరభాగమున రెండుగుట్టలుండఁగా వానినిలోపుచేసికొని కోటనుగట్టించి, మన్నుగోడ పెట్టించి, వానిపైఁ జుట్టును బురుజులుతీర్పించి దానికి దక్షిణమున పెద్దాపురమను పేటనుగట్టించి ప్రభుత్వముచేసెను. తరువాత విస్సమ్మ యను రెడ్డివనిత యీ సీమలను బరిపాలించుచు రెడ్లకడ రెండు వేల ఫౌఁజుకు సరదారుగానున్న వత్సవాయ ముసలితిమ్మజగపతిరాజుగారికిఁ గుదువ ( తాకట్టుఁ ) బెట్టెనట! ఆమెయనంతరము ముసలితిమ్మజగపతిరాజుగారు బలవంతులై పెద్దాపురముకోటను స్వాధీనపఱచుకొని వేదాద్రికి మంత్రియైయుండి యతనిని స్వాధీనముచేసుకొని మహమ్మదీయులకు రాజమహేంద్రవరదుర్గమును వశపఱపించి, తాను వారికి

మిత్రుఁడై పెద్దాపుర ప్రాంతదేశమును మహమ్మదీయులు జయించినను తానేస్వాతంత్ర్యపరిపాలనము చేయనారంభించెను. వీరి పౌరుష పరాక్రమాది విశేషములు రామవిలాసములో

"సీ॥ రణమున గుణ్ణంపురాతులఁబరిమార్చి
వాసిగా నలజెర్లవాకలోనఁ
పెద్దాపురంబున బిరుదాంకపురిలోన
యవనవీరులఁ బరాహతులఁ జేసెఁ
బ్రతిఘటించిన రేచంద్రసుతునిదర్పమడంచెఁ
దిరుపతిచెంతభూవరులు మెచ్చఁ
దూరుపునాట శత్రుక్షత్రనక్షత్ర
సుచిహ్నపుమాపె సూర్యుఁడనంగ
వంగవంగకళింగచోళాది దేశ
వసుమతీనాథ సభలలో వార్తకెక్క
వత్సవయపేరధారుణీశ్వరునిసుతుఁడు
రమ్యగుణశాలి శ్రీ తిమ్మరాజుమౌళి"

అను సీసపద్యములో నభివర్ణింపఁబడియెను. ఈయన శ్రీకాకుళ నవాబగు షేరుమహమ్మదుఖానునిచే నొకఖడ్గమును బహుమానముపొందినట్లుగా పైగ్రంథములోని

"ఉ॥ షేరుమహమ్మదుక్షితిపశేఖరుఁ డద్భుతశౌర్యధైర్యదు
ర్వారుఁడు మెచ్చి పైడియొరవాల్దనకేల నొసంగు వేళ దై
త్యారిసమానమూర్తి తనహస్తముమీఁదుగనుండె వారిగం
భీరుఁడు వత్సవాయకుల పేరయతిమ్మనృపాలుఁడున్నతిన్"

అను పద్యమునఁ జెప్పఁబడియుండెనుగా పేరుమహమ్మదుగాఁ ౧౬౯౭ వ సంవత్సరప్రాంతమునందుంటచే నియ్యదియంతగా విశ్వసింపఁదగినదిగాఁ గనుపట్టదు.

వీరువత్సవాయరామరాజుగారికి నెనిమిదవతరమువారుగానుండిరి. వత్సవాయరామరాజుగారికి తెలుఁగురాజుగారును, వారికి తిరుమలరాజుగారును, వారికి నాగరాజుగారును, వారికి తిరుపతిరాజుగారును, వారికి సింగరాజు జగ్గరాజు అనువారును, వీరిలో జగ్గరాజుగారికి పేరరాజుగారును వారికి పై ముసలిసమ్మరాజుగారును జగ్గరాజుగారును జనించినట్లుగా రామవిలాసములోని వంశావళింబట్టి తెలియుచున్నది. వీరితల్లిగారు గొట్టుముక్కల నరసరాజుగారి పుత్రికారత్నమైన నారమాంబగారని శేషధర్మములనెడి ప్రబంధములోని

"సీ॥ గంధువాంచుతాలిమి భూమిదేవికిసాటి
సత్పుత్రమహిమఁ గౌసల్యసాటి
అతిథిపోషణమున నన్నపూర్ణకుసాటి
పలుకునేర్పున బ్రహ్మపొలతిసాటి
తగునెనరున సుమిత్రాదేవికినిసాటి
నైర్మల్యమున సురనదకిసాటి
యనుచుబంధుజనంబులు వినుతిసేయ
నలరె శ్రీ గొట్టుముక్కల కులపయోధి
చంద్రుఁడైనట్టి నరసభూమీంద్రుపట్టి
చారుసద్గుణనికురంబ నారమాంబ"

అను పద్యమువలన వేద్యమగుచున్నది. (ఈయన క్రీ. శ. ౧౭౯౪ వ సంవత్సరమునకు సరియైన యానందసంవత్సర భాద్రపద

బహుళ సప్తమికి సరియైన ౧౬౩౫వ ఫసలీ మొదలుకొని క్రీ. శ. ౧౬౦౭వ సంవత్సరమునకు సరియైన పరాభవ సంవత్సర మార్గశిర బహుళ ద్వితీయవఱకు డెబ్బదిరెండు సంవత్సరముల రెండు మాసముల యిరువదియైదు దినములు ప్రభుత్వముచేసి ౭౬ సంవత్సరములు జీవించి విగతదేహులైరని స్థానికచరిత్రమునఁ దెలుపఁబడుచున్నది గాని యీ తేదీలు సరియైనవిగాఁగనుపట్టవు.) ఈయన శేషధర్మములను ప్రబంధము నంకితమునొంది యనేకధర్మకార్యము లాచరించినట్లుగా రామవిలాసములోని

"సీ॥బిరుదాంకపురిని సుస్థిరముగానిర్మించెఁ
బాలమున్నీటినిఁబోలు చెఱువు
తిరుపతివల్మీకగిరిఁ బూలపల్లెను
ఫలవృక్షవనముల నిలిపెఁజాల
నృహరిగేహతటాక నిక్షేపవనములు
కొమరుగాఁ బెద్దాపురముననునిచె
విశ్వనాథకవీంద్ర విరచితశేషధ
ర్మప్రబంధము సాదరముగనందె
విప్రవంశప్రతిష్ఠలు వెలయఁజేసెఁ
బుత్త్రులనుగాంచె నీతినిఁబుడమినేలె
వత్సవాయాన్వయమునకు వన్నెఁదెచ్చె
హెచ్చిపేరయతిమ్మధాత్రీశ్వరుండు"

అను పద్యమువలనఁ దెల్లమగుటయకాక యీయన మిక్కిలి ధర్మాత్ముఁడని తేటపడుచున్నది. బిరుదాంకపురమనఁగా బిక్కవోలు. బిక్కవోలు చెఱువు నేఁడంతగా నుపయోగకారి కాకున్నను కాలువలు

త్రవ్వించుటకుఁబూర్వ మా ప్రాంతమున మిక్కిలి యుపయోగకరమై యుండుటచేతనే కవి దానిని క్షీరసాగర తుల్యమని యభివర్ణించియు న్నాఁడు. మఱియు వీరు కోటబురుజులలో నొక్కటియైన తాళ్లబురుజు మీఁద నృసింహస్వామిని బ్రతిష్ఠించిరి. ఇది యిప్పటికిని శిథిలమై యున్నది. పై రామవిలాసములో లక్ష్మణకవి వర్ణించినట్లుగానే విశ్వ నాథకవి తానంకితముచేసిన శేషధర్మములయందు,

"సీ॥ కట్టించెగుడి జగత్కర్తజనార్దన
స్వామికినవనిపై శాశ్వతముగ
పెట్టించెనన్నంబుఁ బెన్మిటోనే ప్రొద్దు
ననివారితముగ నభ్యాగతులకు
నలరించెఁ బ్రచురతోయ ప్రపూరితతటా
కము సర్వజంతూపకారకముగఁ
గావించె సకలవృక్షశ్రేణిశోభితం
బగుచు నెప్పుడు నందమైనతోటఁ
జేసెఁ బ్రతిష్ఠ లక్ష్మీనృసింహపాద
భక్తినిసిరులచేఁ బ్రబలుధన్యుఁ డౌర
......వత్సవాయాన్వయమున
తిమ్మభూపాలమౌళి సత్కీర్తిశాలి"

అను పద్యములో వర్ణించియున్నాఁడు. ఈ తిమ్మజగపతిరాజు గారికి జగ్గరాజను సోదరుఁడు కలఁడనియు, అతఁడు పరాక్రమవంతుఁ డనియు, రాముసకు లక్ష్మణునివలె సమస్తకార్యములం దోడ్పడుచు ననువర్తించుచుండెననియు విశ్వనాథకవి యాక్రిందిపద్యములోఁ జెప్పి యున్నాఁడు.

"చ॥ అతనిసహోదరుండు కుసుమాయుధమూర్తి దిగంతరాళవి
శ్రుతసితకీర్తి దానరవిసూనుఁడు వైభవభాసమానుఁడు
ద్ధత రిపురాజసంహరుఁడు ధర్మపరుండు సమస్తసత్కళా
చతురుఁడు వత్సవాయ చినజగ్గనృపాలుఁడు ధన్యుఁడెంచఁగన్"

* * * * * *

మ॥ మనుజస్తుత్యుఁడు జగ్గభూవిభుఁడు రామక్ష్మావిభుంలక్ష్మణుం
డనువర్తించువిధంబునందను మహాహర్షంబునన్ సర్వదా
యనువర్తింపఁగ ధర్మమార్గమున హెచ్చెన్ పేరభూపాలనం
దనుఁడౌ తిమ్మనృపాలమౌళి సిరులన్ ధాత్రీస్థలిన్ వర్ధిలన్"

ఏనుఁగుగుర్వామంత్రియు, పోలప్రెగడసూరమంత్రియు, రెండు భుజములై యుండగానుండ సీతిమ్మజగపతిమహారాజుగారు చతుర్భుజుని వలె వర్ధిల్లెనని

" గుణవిభూషణుఁ డేనుఁగుగుర్వమంత్రి
ధీరుఁడగు పోలప్రెగ్గడ సూరమంత్రి
కడమ రెండుభుజంబులుగాఁగఁ బ్రబలె
మహిఁజతుర్భుజుండనఁగఁ దిమ్మప్రభుండు "

అను గీతమున నుడివియున్నాఁడు. ఈ తిమ్మజగపతి వైష్ణవ మతావలంబకుఁడై శ్రీమాన్ నల్లానుచక్రవర్తుల అల్లాడాచార్యుని పుత్త్రుఁడగు తిరుమలాచార్యునకు శిష్యుఁడై యుండినటుల పై శేషధర్మములలో నుదహరింపఁబడియుండెను. తిమ్మభూపాలుండు బ్రాహ్మణాశీర్వచన ప్రభావసంవర్ధిత రాజమహావైభవంబుగాంచి, సమానుల లోపల నుత్తమశ్లోకుండై తేజరిల్లుచు నొక్కనాఁడు శ్రీభీమేశ్వరస్వామి

మహామహిమాభిరామంబైన దక్షారామంబునకు విజయంచేసి విశ్వనాథకవికృతినిర్మాణంబునకుఁ గడంగుట తన యనుంగుమంత్రి యగు నేనుఁగుగుర్వామాత్యుఁడు విన్నవించిన వినిసంతోషించి, సకలశాస్త్రప్రశంసులగు విద్వాంసులును, ఉభయభాషాకవిత్వ నిర్మాణసామర్థ్యసాంద్రులగు కవీంద్రులును, చతురోపాయనిపుణతాపరిచితపరమంత్రభేదనప్రభావకవితావధానులగు ప్రధానులును, సక్రోధరిపుచక్రవిదళనక్రియావక్రవిక్రమార్కపరాక్రమోదారులగు రాజకుమారులును, ఆయోధనవసుధానిర్విరోధనిర్భయధాటీసముద్భటులగు వీరభటులును, సమయోచితజ్ఞతావిలసితహితవ్యవహారులగు రాయబారులును, బహుప్రబంధగద్యపద్యోదాహరణాదిపఠనాయందానందులగువందులును, గానచాతురీవినిర్జితగంధర్వనాయకులగు గాయకులును, మఱియునుం దగువారు తత్తదుచితప్రకారంబులఁబరివేష్టింప సుఖాసీనుండై ధర్మాభిరామంబైన కొలువుకూటంబునఁ బేరోలగంబుండి భగవద్భాగవతధర్మనిర్మలకథాప్రసంగ కౌతూహలాయత్తచిత్తుండై, ఆపస్తంభసూత్రుండును, కాస్యపసగోత్రుండును, వెలుతురుబల్లి రామమంత్రీశ్వరుని పౌత్రుండును, మల్లవరపుబాలసుకవి దౌహిత్రుండును, దిట్టకవిబిరుదాంకితుండగు వేంకటామాత్యునకును సర్వమాంబకును జనించిన కూర్మిపుత్త్రుండును, విశ్వేశ్వరప్రసాదకృపాలబ్ధసత్కవితావిలాససంపన్నుఁడగు విశ్వనాథకవిని వీక్షించియిట్లనియెనట! „ ఓవిశ్వనాథసుకవీ! నీవుబాల్యంబుననె శ్రీరామవిజయంబను యక్షగానకృతినినిర్మించి ప్రఖ్యాతినిఁగాంచితివి. గౌరీవివాహమును ద్విపదప్రబంధముగా రచించినాఁడవు. హరిశ్చంద్రచరిత్రమును నిరోష్ఠ్యప్రబంధముగా రచియించివన్నెకెక్కినాఁడవు. సంస్కృతంబునఁ బారిజాతాపహరణమునురచించి వాసిఁ

గాంచినాఁడవు. నీవు చెప్పఁబూనిన శేషధర్మ కావ్యమును మా పేర నంకితముచేసి మాకీర్తిని ఆచంద్రతారకముగ ధారుణీస్థలినిలుపుమని కోరి సబహుమానంబుగఁ గర్పూరతాంబూలచీనాంబరజాంబూనదరుచిరమణిభూషణంబులు సమర్పించినఁ గైకొని సంతోషించి విశ్వనాథకవి శేషధర్మము నాయన కంకితముఁగావించెను.

ఈ శేషధర్మముయొక్క కృత్యాదియే యీ చరిత్రతోపాటు ప్రకటింపఁబడినది.

## — శ్రీ వత్సవాయ రాయపరాజుగారు :—

## ( క్రీ. శ. ౧౬౦౭-౧౬౪౯ )

పెద్దాపురసంస్థానమున సంపాదించి మన్నెము తోటపల్లి, జడ్డంగి సహితముగా ముల్లేరు చాగలనాడు కిమ్మూరుపరగణాలను ఏఁబదిరెండు సంవత్సరములు పరిపాలించిన శ్రీ వత్సవాయ ముసలితిమ్మజగపతిరాజుగారు, ఆయనయొక్క డెబ్బదియారవయేట ననఁగా క్రీ. శ. ౧౬౧౭ వ సంవత్సరమునఁ గాలధర్మము నొందిరి. ఆయనకు రాయపరాజు, గోపాలరాజు, రామచంద్రరాజు, అను ముగ్గురు కుమారులుకలరు. శ్రీ తిమ్మజగపతిరాజుగారి యనంతరమున ఆయనకుమారులలో జ్యేష్ఠుఁడైన శ్రీరాయపరాజుగారు సింహాసనము నధిష్ఠించిరి. ఈయనకు జగదేకవీర రాజాధిరాజరాయవేశ్యాభుజంగాది బిరుద నామములు కలవు. ఈయన యమితశౌర్యపరాక్రమోపేతులై దుర్మదాంధులగు ధారుణీధవులను వైరివీరులను ఖండించి, రాజ్యమును విస్తరింపఁజేసి కిమ్మూరు, బిక్కవోలు, తుని, కోటాము, ముల్లేరు, పిఠాపురములను ధర్మపరులై పరిపాలించిరని ఒత్మణాకవిక్రుతమగు రామవిలాసములోని యీ క్రింది

పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది.

“మ॥ ఘనశౌర్యంబున దుర్మదాంధనృపులన్ ఖండించి సత్కీర్తిచే
గొని కిమ్మూరు, బిక్కవోలు, తునియున్, గోర్థాము, ముల్లేరుసా
మెనయున్ బీరపురంబు ధర్మపరుఁడై యేలెన్ సమస్తార్థులన్
మనిచెన్ దిమ్మనృపాలు రాయపమహీనాథుండు భాగ్యోన్నతిన్”

ఈయన దైవభక్తియు, ప్రజానురక్తియు, సత్కార్యాసక్తియుం గలిగి ప్రజాపరిపాలన మొనర్చిరి. ఈయన జేసిన సత్కార్యములను గుఱించి లక్ష్మణకవి తన గ్రామవిలాసములో

“సీ॥ శ్రీగ్రామునకుఁ గట్టమూరనుగట్టించె
గుళ్లుగుంటపములు గోపురములు,
గంభీరజలతటాకంబు త్రవ్వించెగృహా
స్త్రపురంబున సుస్థిరముగఁ
గొలుపుగా వాల్మీకిపురి కాంద్రకోటను
ఫలభూజవాటికల్ పదిలపఱచె”

అని యిట్లు వర్ణించియున్నాఁడు.

ఈ రాజశేఖరుఁడు తనతండ్రిగారయిన శ్రీ తిమ్మజగపతిరాజు గారివలెనే కవిజనాశ్రయుఁడై, కవులనాదరించి పోషించి, వారిచేఁ గృతులందినవారు. ఈయన హరిభక్తిసుధోదయంబను నొకప్రబంధమునకుఁ గృతిభర్తయైనట్లు పైనుదాహరింపఁబడిన పద్యములోని దేయగు

“ప్రస్తవ్యానుగు హరిభక్తిసుధోదయం
బనుమహాకృతిరత్నమందుకొనియె”

అనుపాదముచే దెలియవచ్చుచున్నది. ఈహరిభక్తిసుధోదయ మిప్పుడెచ్చటను గానరాకున్నది. అంతియగాక దాని కృతికర్తయగు కవిపుంగవుని పేరైనం దెలియవచ్చుటలేదు. ఈవత్సవాయువారు మొదట నుండియు నాంధ్రభాషాభిమానులై యాంధ్రకవితావధూటికిం బ్రోపకులై యనేకములగు కృతిరత్నములనందినను, ఏకారణమునవో గాని వానిలో రెండుమూడు తక్క మిగిలినవెల్ల నామమాత్రావశేషములై యున్నవి. వీరందిన యన్నికృతులునుగూడ నుండియున్నచో మాకీ చరిత్రము వ్రాయుటయందమితసహాయకారులగుటయేగాక భాషాభి మానులకుంగూడ నెక్కుడు నుపయోగకారులై యుండునని మామతము. గొప్పపరాక్రమవంతులు. వీరియొక్క శౌర్యపరాక్రమకార్యములను గుఱించి రామవిలాసములో

"సీ॥ దర్పాంధయవనమస్తకములబురుజులుఁ
గట్టించెనమ్మయ్యగట్టుకొంత
లొంపకలోవలో గుంపులుగొనిపోర
వచ్చినదొరల గర్వంబడంచెఁ
జెలఁగిపోట్రాజును జేపట్టి రాఘువ
రాజు దేశమునకు రాజుఁజేసె
శరభరాజును గృహాంతరవాసుఁగావించి
యతనిగూడెంబువీరన్నకిచ్చె
గడుసుమన్నీలభృత్యులుగానొనర్చె
నిగ్రహానుగ్రహంబులు నెగడఁజేసె
వత్సవయతిమ్మధారుణీశ్వరుని సుతుఁడు
రాజమాత్రుఁడె రాయపరాజశౌరి"

అనియు

" పేరుగలుగు మహమ్మదు బేగునదిమి
మెచ్చఁదగిన ఘమాఖీలు తెచ్చుకొనియె "

అనియు వర్ణింపఁబడియున్నది. ఈ పై పద్యమువలన ఈయన విశేషముగ మన్నెరాజులతో యుద్ధముచేయుచు వారిని జయించుచు వచ్చినటుల తేటపడఁగలదు. కాని యీపైపద్యమున నుదాహరింపఁబడిన మన్నెదొరలేయేగూడెములకుగాని, ఏయేప్రదేశములకు గాని యధిపతులో, వారలీరాయపరాజుగారి పరిపాలనకుఁ బూర్వ మెవరికి సామంతులుగనుండిరో వారియుదంత మించుకమాత్రమును దెలియరాకున్నది. గొప్పగొప్ప పరగణాలను గొన్నింటినిం బరిపాలించి, తమ యనుపమానశౌర్యపరాక్రమములనుజూపి పగతురను పాదాక్రాంతులుగఁజేసి, యాకాలమునందలి సాటిరాజులలో మేటులని పేరువడసిన వత్సవాయ వసుమతీవరులచరిత్రములే మనకుఁదిన్నగఁదెలియరానప్పుడు, ఎచ్చటనో కొలదిప్రదేశముల నేలిన యీమన్నెరాజుల వృత్తాంతములు తెలియకపోవుట యొకవింతలోనిదికాదు! శరభరాజు మొదలగు రాజులను జయించుటయేకాక, ఈ రాయపరాజుగారు తండ్రిగారివలెనే తాముకూడ మహమ్మదీయులకు మిత్రులై, తమ యవక్రవిక్రమాధిక్యతచే నబాబులుకూడ సాధింపలేని దుర్గములనుసాధించి యాకాలమున గోలకొండనబాబుగానున్న అబ్దుల్‌హసేన్ కుతుబ్‌షావారిచేతను, మాదన్నపంతులుగారిచేతను బహుసత్కారములందిరి.

ఈపైనిజెప్పఁబడిన అబ్దుల్‌హసేన్ కుతుబ్‌షా క్రీ. శ. ౧౬౧౧ మొదలు ౧౬౭౨వఱకు† పరిపాలించినట్లు కనఁబడుచున్నది. కాని

† Robert Sewell's lists of antiquities, Madras, PART II, Page 167.

శ్రీయుత కొమఱ్ఱాజు లక్ష్మణరావుపంతులుగారు ఈ నబాబు క్రీ. శ. ౧౬౭౨-౧౬౮౭ వఱకు ‡ మాత్రమే పరిపాలించినట్లు వ్రాసియున్నారు. ఈ తేదీలలో నేఁటినిజమైనను మనరాయపరాజుగారు వారితో సమకాలికులైనట్లు తెలియఁగలదు. ఇంతవఱకు స్వతంత్రులుగఁ బరిపాలన మొనరించుచున్న గోలకొండ నబాబులు, ఈ అబ్దుల్‌హాసేన్ కుతుబ్‌షావారి నాఁటినుండియే ఢిల్లీపాదుషాహాలకు సామంతులై వారికి కప్పములు చెల్లించవలసివచ్చినది. ఇంక మాదన్నపంతులుగారినిగూర్చి మాచదువరులకుఁ గొంతచెప్పవలసియున్నది. వీరినిగుఱించి శ్రీయుత లక్ష్మణరావుపంతులుగారు తమమహమ్మదీయమహాయుగములో నీక్రిందిరీతిని వ్రాసియున్నారు.

## —: అక్కన్న మాదన్న గార్లు. :—

" ఈ యన్నదమ్ముల ( అక్కన్న మాదన్నగార్ల ) పేళ్లు మన తెలుఁగువారు రెండువందల సంవత్సరములనుండి గౌరవపూర్వకముగా స్మరించుచున్నారు......వీరియింటిపేరు పింగళివారు. ఈపింగళివారిది భారద్వాజగోత్రము. కావున వీరికిని గౌతమగోత్రుఁడగు పింగళియొక్క వంశమునకును నేమియుసంబంధములేదు. అక్కన్న సూరన్న మాదన్నగారి వంశజులమని చెప్పుకొను పింగళివారిప్పుడు నైజాము రాజ్యములోని యోరుగంటిలో నున్నారు. వీరిద్దఱును మహారాష్ట్రులనియు అక్కన్నగారికి 'ఏకనాదిపంతే' అనియు మాదన్న పంతులుగారికి 'మదనపంత్' అనియుఁ బేళ్లుండెనని కొందఱుమహారాష్ట్ర లిటీవలివారు వ్రాసియున్నారు. కానివారేమియు నాధారముచూపినవారుకారు.

‡ మహమ్మదీయమహాయుగము, పుట 218.

నేనుచూచినంతవఱకు పూర్వమహారాష్ట్రతురుష్కాంగ్ల గ్రంథములలో ‘అక్కన్న’ ‘మాదన్న’ నామములే వాడఁబడియున్నవి. ఇదియుఁగాక ప్రస్తుతము మాదన్నగారి వంశజులమని చెప్పెడువారు తెలుఁగు వారు కావున వీరు తెనుఁగువారనియే మనము నిశ్చయింపవచ్చును.”

వీరి సంబంధముననే చెప్పఁబడు నొకచిన్నకథకలదు. శ్రీయుత లక్ష్మణరావుపంతులుగారనినట్లు దాని సత్యాసత్యములు నిర్ణయించుటకు వీలులేకపోయినను, వినుటకు నిది యింపుగానుండునని తలఁచి దానినిఁగూడ వారిగ్రంథమునుండియేతీసి యీక్రిందపొందుపఱచుచున్నారము.

—:అక్కన మాదన్నగార్ల భ్రాతృత్వమును గుఱించినకథ:—

“అక్కన్నగారొక బీదవాఁడగు బ్రాహ్మణుఁడఁట. మాదన్నగారు మంత్రిత్వము చేయుచుండఁగా అక్కన్నగారాతనియింటికివచ్చి ప్రవేశించెనఁట. తన భార్య బంధువుఁడనితలఁచి మాదన్నగారును, భర్త బంధువుఁడనితలఁచి యాతని భార్యయు అక్కన్నగారిని మిక్కిలి మర్యాదచేయుచుండిరి. అక్కన్నగారు వయస్సులోఁ బెద్దవాఁడగుటచే మాదన్నగారాతనిని అన్నగారని పిలుచుచుండిరి. లోకులునుఅట్లే తలఁచుచుండిరి. ఇట్లు కొన్నిదినములు గడచిన తరువాత నొకనాఁడు మాదన్నగారు భార్యతో అక్కన్నగారిని గుఱించి ముచ్చటింపఁగా, నాతఁడామెకు బంధువుఁడు కాడని తెలిసెను. అందుపై నతఁడక్కన్నగారిని మనకుఁగల బంధుత్వముఁదెలుపుమనగా “నాయనా! వినుము. నేను పెద్దమ్మకొమారుఁడను. నీవు చిన్నమ్మకొమారుఁడవు. ఇట్లు మన మక్కచెల్లెండ్రబిడ్డలము గాన నన్నదమ్ములముసుమా! ఈరహస్యము నీమనస్సులోనుంచుకొనుము. మనమెప్పటియట్ల యన్నదమ్ముల

వలెఁ బ్రవర్తించెదము" అని యనెనఁట! అక్కన్నగారి బుద్ధిచాతుర్యమునకు మెచ్చి మాదన్నగారాతనిని అటుతరువాత అన్నగానే చూచుచుండిరఁట"

ఈ మాదన్నగారు, అబ్దుల్ హసేన్ కుతుబ్ షావారి వెనుక రాజ్యపాలనమును వహించిన అబూహసేన్ కుతుబ్ షావారివద్ద మంత్రిత్వపదవి నందుండిరి. అక్కన్నగారు "సాహలష్కర్" (అనగా సైన్యాధిపతి) అధికారమును బొందియుండిరి. వీరినిగురించిన విశేషాంశములు వీరితో సమకాలికులగు తిమ్మరాజుగారి పరిపాలనమునుగూర్చి వ్రాయునప్పుడు తెలుపఁగలము.

—:దక్షిణహిందూదేశమున ఇంగ్లీషువారి ప్రాథమికవర్తకస్థానములు:—

ఈ రాయపరాజుగారి కాలముననే ౧౬౧౧వ సంవత్సరమున దక్షిణహిందూదేశమునందు క్రీ. శ. ౧౬౦౦ సంవత్సరమున నేర్పడిన ఇంగ్లీషుఈస్టు ఇండియాకంపెనీవారు (హిందూదేశములో వర్తకముచేసికొనుట కేర్పడిన ఆంగ్లేయసంఘము) మొదటిగిడ్డంగి (Factory) ని మచిలీపట్టణమువద్ద స్థాపించిరి. ఈ మచిలీపట్టణమే దక్షిణహిందూస్థానమున ఇంగ్లీషువారు సంపాదించిన వర్తకస్థానములలో మొట్టమొదటిది. హిందూదేశముయొక్క పశ్చిమతీరమున సంపాదించిన వర్తకస్థానములలో మొదటిదిసూరతుపట్టణము. క్రీ. శ. ౧౬౧౨వ సంవత్సరములో దానిని సంపాదించుకొని, అచ్చటొకగిడ్డంగినికట్టిరి. పదునేడవశతాబ్ద ప్రారంభమున సూరతు ఒకగొప్ప రేవుపట్టణముగానుండెను ఈ ఇంగ్లీషువారిచ్చటకు రాకమునుపే పోర్చుగీసువారువచ్చి వర్తకము చేసికొనుచుండిరి తాము వర్తకము చేసికొనుచుండ నాంగ్లేయులుకూడవచ్చి వర్తకము సాగించుట వారికిఁగిట్టకయ్యెను. అందుమీఁద నాంగ్లేయులపై నసూ

యతపెరిగి వారివర్తకమును జెడఁగొట్ట నఖండప్రయత్నములుచేసిరి. అందువలన పోర్చుగీసువారికిని, ఆంగ్లేయులకును క్రీ. శ. ౧౬౧౨వ సంవత్సరమునఁ బశ్చిమతీరమునఁ దపతీనదీముఖద్వారమునకొక కొంత దూరమున నొకగొప్పయుద్ధము జరిగెను. క్రీ. శ. ౧౬౩౯వ సంవత్సరమున ప్రస్తుతము చెన్నపట్టణమునందున్న సెంటుజార్జికోట కట్టఁబడెను. బంగాళమునందలి హుగ్లీనదిమీఁదఁ గొంతనేలనుసంపాదించి యచ్చట౧౬౮౦వసంవత్సరమున నొకగిడ్డంగినిఁగట్టిరి. దక్షిణహిందూస్థానమున నాంగ్లేయుల ప్రాథమికవర్తకస్థానములన్నియు సీ రాయపరాజుగారి కాలముననే యేర్పడుటచే ఈయనపరిపాలించినకాలము మిగుల ముఖ్యమైనది.

ఇట్లు “ఘోటకవాహినీఘోటకర్కశపారసీక సైనిక శిరచ్ఛేదకుండును, రణరంగవిజయేందిరాకరగ్రహణమంగళయోగ్యపటహ శంఖస్వనుండును అయిన గోపాలరాజును, రామచంద్రరాజును తన కుడియెడమభుజములై యుపచరింపఁ బ్రజానురంజకముగ నలువదిరెండేండ్లు పరిపాలనమొనరించి శ్రీ రాయపరాజుగారు ఆయనయొక్క డెబ్బదియైదవయేట ననఁగా క్రీ. శ. ౧౬౮౯వసంవత్సరమున స్వర్గస్థులైరి.

—: శ్రీ వత్సవాయ తిమ్మరాజుగారు :—

( ౧౬౮౯—౧౬౭౭ )

శ్రీ రాయపరాజుగారికి శుభగుణకదంబమైన సూరాంబ యను నామంబునంజెన్నారు సతీతిలకముగలదు. ఈ పుణ్యమూర్తులగు దంపతులకు తిమ్మరాజు బలభద్రరాజనను నిరువురు కుమారులుకలగు. వీరిరువురిలోఁ బెద్దవారైన తిమ్మరాజుగారు తండ్రిగారు కాలముచేసిన

వెనుక ప్రజాపరిపాలనాభారమును వహించిరి వీరు క్రీ. శ. ౧౭౧౮ లో జననమొంది రాజ్యమునకు వచ్చునప్పటికి ముప్పదియొక్క వర్షముల ప్రాయముగలవారై యుండిరి. ఈయన యమితశౌర్యపరాక్రమవంతులై గొప్పగొప్పరాజులను జయించి మించినవారగుటచే ఈయన సార్వభౌమతిమ్మరాజుగారనియు, ఈయనయొక్క ధర్మకార్యతత్పరతచేతను, చేకొన్న జయములచేతను కీర్తితిమ్మరాజుగారనియుఁ బ్రఖ్యాతిగాంచిరి. ఈ కీర్తితిమ్మరాజుగారి విజయములనుగూర్చి లక్ష్మణకవి తన రామవిలాసములో నిట్లనివర్ణించియున్నాఁడు.

"సీ॥ రాజులు మెచ్చఁ బర్లాకోటసాధించి
నరహరీదేవు దుర్నయము హరించెఁ
గుఱుతైన బాపినీడుకోటలగెలువట్టి
యోగనకోటంతయు నుర్విఁగలిపెఁ
దుగరాజుమొదలైన దొరలనుభంగించి
విశ్వంభరుని యుద్ధవిరతుఁ జేసెఁ
దగఁ బూసపాటి సీతారామ భూపాలుఁ
డభినుతింపఁగ విజయంబుఁగాంచె
నరిసమేతుయవనాధీశుఁ దురగపతినిఁ
గయ్యమునఁ గెల్చి లోకవిఖ్యాతిఁ జెందె
వత్సవాయాన్వయమునకు వన్నెఁ దెచ్చె
రాయపనృపాలు శ్రీ తిమ్మరాజమౌళి"

ఈ పైపద్యమునందలి మొదటిపాదమునఁ జెప్పఁబడిన పర్లాకోట యనునది గంజాముజిల్లాలోని పర్లాకిమిడి కోటయేమోయని తోఁచుచున్నది. ప్రస్తుతమున గంజాంజిల్లాలో పర్లాకిమిడి, పెద్దకిమిడి, చిన్న

కిమిడి యను మూఁడుసంస్థానములుకలవు. ఈభాగముల నామములం బట్టిచూడ కిమిడియను నొకపెద్దసంస్థాన మింతకును మూఁడు భాగములుగ విభాగింపఁబడినట్లు తెలియఁగలదు. ఈ కిమిడిజమీందారులు తామతిపురాతనమైన ఒరిస్సాకేసరి రాజవంశమునకు సంబంధించినట్లు చెప్పుకొనుచున్నారు. ఈ పర్లాకిమిడికోటయో పర్లాకోటయని చెప్పినను, పర్లాకిమిడిని పాలించిన భూపాలురలో నరహరిదేవుఁడున్నట్లెచ్చటను గానరాదు. అప్పుడు పర్లాకిమిడి సంస్థానమును పాలించుచు, మన తిమ్మరాజుగారికి సమకాలికులైనవారు ముకుందరుద్రనారాయణదేవుఁడు, ముకుందదేవుఁడు, అనంతపద్మనాభనారాయణదేవుఁడు అనువీరు మువ్వురు కలరు. వీరిలో ముకుందరుద్రనారాయణదేవుఁడు క్రీ. శ. ౧౬౩౦-౧౬౭౬ వఱకును, ముకుందదేవుఁడు ౧౬౭౬ మొదలు ౧౬౭౮ వఱకును, అనంతపద్మనాభనారాయణదేవుఁడు ౧౬౭౮-౧౬౮౬ వఱకును బరిపాలించెను. శ్రీ తిమ్మరాజుగారు ౧౬౮౫ వఱకుఁ బరిపాలించినవారగుటచే అనంతపద్మనాభనారాయణదేవుని యనంతరమున రాజ్యమునకువచ్చిన సర్వజ్ఞజగన్నాథనారాయణదేవుఁడుకూడ సమకాలికుఁడనియో నుడువవచ్చును. కాని వీరి నలువురిలో నెవ్వరును నరహరిదేవ నామధారులైనట్లు కనిపించదు. ఒకవేళ నీపర్లాకిమిడి కోటయో పర్లాకోటయని సిద్ధాంతమేర్పడినయెడల నరహరిదేవుఁడను నామాంతర మీపైనవచించిన నలువురు పరిపాలకులలో నెవ్వరికో నొకరికుండ వలయును! ఈ విషయమునుగూర్చి యింతకెక్కుడుగఁ జెప్పుటకు నాధారాభావముచే వీలులేకపోయినది.

పైపద్యచతుర్థచరణమునఁ జేర్కొనఁబడిన పూసపాటిసీతారామ రాజుగారినిగూర్చి యొకింతచెప్పుట కాధారములుకలవు గాన ఆయనను

గూర్చి యిక్రింద జెప్పఁబోవుచున్నారము. ఈ పూసపాటి వారినిఁ గూర్చి రాయబహదూరు శ్రీ కందుకూరి వీరేశలింగముపంతులుగారు తమ 'ఆంధ్రకవులచరిత్ర' యందిట్లువ్రాసియున్నారు.

"ఓరుగంటియందుండిన కాకతీయరాజులు చెప్పుకొనునట్లుగానే యీపూసపాటివారును తాము సూర్యవంశజులైన మాధవవర్మ సంతతి వారమని చెప్పుకొందురు. కొండపల్లి సర్కారులోని పూసపాడను గ్రామనివాసముచేత వీరికిపూసపాటివారని యింటిపేరు కలిగినది. ఓరుగంటి సంస్థానము ప్రతాపరుద్రునితో నశించినవెనుక పద్మనాయ వారును, పూసపాటివారును మొదలైనవారు మహమ్మదీయులకు లోఁబడిరి. రఘునాథరాజను మారుపేరుగల పూసపాటి తిమ్మరాజుగారు గోలకొండలోసరదారుగానుండి శ్రీకాకుళమునకువచ్చి, శ్రీకాకుళమునకు ఫౌజుదారుగానుండిన షేర్ మహమ్మదుఖాన్ వలన ౧౭౫౯వ సంవత్సరమున, కుమిలిబోగాపురము తాలూకాలను గుత్తకుపుచ్చుకొని పాలనము చేయనారంభించెను. ఈయనపుత్రుఁడైన సీతారామచంద్రరాజుగారు మఱికొన్ని తాలూకాలనుగూడ కవులునకుఁబుచ్చుకొని పర్లాకిమిడిసంస్థానాధిపతియైన గజపతిదేవుతో మైత్రిసంపాదించి, ౧౫౦౦ గుఱ్ఱపురౌతులతోను, ౪౫౦ కాల్బలముతోను పొట్నూరు జయించి కళింగరాజని పేరువడసి యాయూరు నివాసమేర్పఱచుకొని ప్రబలుఁడయియుండెను."

ఈ సీతారామచంద్రరాజుగారే మనతిమ్మరాజుగారి సమకాలికులు. ఈయనమెచ్చుకొనునట్లుగనే తిమ్మరాజుగారు విజయముగాంచిరని లక్ష్మణకవి వర్ణించియున్నాఁడు.

పూసపాటి తిమ్మరాజుగారెవనినుండి కుమిలిబోగాపురముతాలూకాలను కవులునకుఁదీసికొనిరో యట్టి శ్రీకాకుళపు ఫౌజుదారుఁ

డైన పెర్మహాన్మ్యమనే లక్ష్మణకవి పైపద్యమున “సరిసమతు యవనాక్షీశుఁ సరగఁ గెలిచి” అని వర్ణించియున్నాఁడు. ఈ పెర్మహాన్మ్యడునుగూడఁ గయ్యమునఁ గెల్చి విజయలక్ష్మీపరిగ్రహణమొనరించినవాఁడగుటచేఁ శ్రీ తిమ్మసార్వభౌముఁడు శ్రీకాకుళమువఱకునుండు దేశమును దన దోర్వీర్యముచే నార్జించెనని నిస్సంశయముగ వక్కాణింపవచ్చును.

పైపద్యమునఁ జెప్పఁబడిన తక్కిన బావిణీకోటనుగుఱించి కాని, యోమకోటనుగుఱించి కాని, దుగరాజునుగుఱించి కాని విశేషాంశములు తెలియకపోవుటచే వానినిగుఱించి వ్రాయకవిడిచితిమి కాని దుగరాజు శబ్దము విశాఖపట్టణముజిల్లాలోని పాచిపెంట జమీందారులచే బిరుదముగ నుపయోగింపఁబడుచున్నది.

ఇట్లు ఖండపగ్రామవంతుఁడై యనేక రాజులను జయించి పెక్కు దుర్గముల నాక్రమించి సాటిరాజులందఱిలో శ్రేష్ఠుఁడై సార్వభౌమ శ్రీ తిమ్మరాజుగారు వినుతిఁగాంచిరి.

ఈయన తాతగారైన మొదటి తిమ్మరాజుగారు ఆయనయొక్క యేలుబడిలో ఆయన పినతల్లి కొమారుఁడైన గణపతిరాజు నారాయణ రాజుగారికి చిల్లంగి మొదలగు గ్రామములను గొన్నిటిని “జమియ్యతు” క్రింద “మొకరరు” చేసియుండిరి. నాఁటినుండియు నారాయణ రాజుగారు చిల్లంగిలో మట్టికోటఁ గట్టించి గ్రామములు బందోబస్తుచేసికొనియుండిరి. కాని యా గణపతిరాజువారికిని ఈ తిమ్మరాజుగారికిని సరిపడక విరోధమువచ్చి యంతకంతకు శత్రుత్వము ప్రబలమయ్యెను. అందుమీఁద నీతిమ్మరాజుగారు ఈ చిల్లంగికోటను ముట్టడించి యచ్చటి పరిపాలకులను సాధించి కోటను స్వాధీనముచేసికొని యాగ్రామములను గిమ్మార్రు పరగణాలోఁ గలుపుకొనిరి.

ఇదివఱకుఁ గొంత కాలమునుండియు బెండపూడి ఇసుకపల్లి పరగణాలు మహమ్మదీయ పాలక్కారుల (సైన్యాధిపతుల) యాధీనము క్రిందనుండుచువచ్చినవి. కాని వానినుండి తమకుఁదగినంత రాఁబడి రానందున వారుదానిని పిఠాపురాధీశుల కంటఁగట్టయత్నించిరి. కాని, యా పరగణాలు పాడులోనున్నవనియు, వానిం జేకొనుట నష్టమునకే కాని లాభమునకుఁగాదనియు, నందువలన నా రెండు పరగణాలను దాము భరించలేమనియుఁ బిఠాపురపువారు చెప్పఁగా, నా తురుష్కాధికారులు బెండపూడి పరగణాను పిఠాపురపురావువారికిని, ఇసుకపల్లి పరగణాను పెద్దాపురపు వత్సవాయవారికిని దఖలుపఱచినారు. నాఁటినుండియు ఇసుకపల్లిపరగణా వత్సవాయవారి యధీనము క్రిందకువచ్చెను. పెద్దాపురపు సంస్థాన మీకాలముననే చాలగావిరివిఁజెంది సర్వవిధముల నభివృద్ధిఁగాంచినదగుటచేత, నిది యేదీనికుచ్ఛ్రదశయని యూహింపనగును. ఈ రాజ్యవిస్తారమువలననే శ్రీతిమ్మరాజుగారు సార్వభౌమ బిరుదమును వహించినట్లు తలంచవలసియున్నది.

ఈయన యెంతపరాక్రమవంతుఁడో యంత సత్కార్యదీక్షాసముత్సాహుఁడు. ఈయననుగుఱించి లక్ష్మణకవి తనరామవిలాసములో నిట్లభివర్ణించియున్నాఁడు.

"మ॥ నిధినిక్షేపతటాకదేవగృహము న్నిర్మించెనుద్యద్గయో
దధియై దీనులఁబ్రోచె షోడశమహాదానంబులుం జేసె నం
బుధిపర్యంతధరిత్రియేలె బుధులన్పోషించె సంపూర్ణధ
ర్మధనుండై నుతికెక్కె వత్సవయ తిమ్మక్ష్మాపతీంద్రుండిలన్"

ఈ తిమ్మరాజుగారు పెద్దాపురమును బరిపాలించుచుండఁగా పిఠాపురమును తెనుఁగురాయనింగారి మనుమఁడును చంద్రారాయనింగారి

కొమారుఁడునగు మాధవరాయనింగారు పరిపాలన సేయుచుండిరి. ఆ మాధవరాయనింగారు తమబంధువర్గములోఁ జేరిన నారసింహరాయనింగారి కొమార్తెయైన రమణయ్యగారిని పరిణయము సేసికొనిరి. ఈ పిఠాపురపురావువారే యింతకుఁగొంతకాలము క్రిత మీనారసింహరాయనింగారికి జూపల్లెమును దానిచ్చియుండిరి. శ్రీ పీఠికాపురాధీశులగు రావువంశీయులకును పెద్దాపురపు వత్సవాయవారికిని మైత్రి యుండి నందువలన, ఒకానొకప్పుడు నారసింహరాయనింగారు పిఠాపురమునకు బోవుచు పెద్దాపురము వచ్చినందున శ్రీ తిమ్మరాజుగారు రమణయ్యగారికని చెప్పి కొన్నిగుఱ్ఱములను ఇంకను ఇతరబహుమానములనుచేసిరి. కాని యీనారసింహరాయనింగారు, తమకొమార్తె పిఠాపురమునకుందు రనియు, ఆమెకు పసుపుకుంకుము క్రింద శాశ్వతముగా జరుగులాగున నేదైన నేర్పాటుచేయవలసినదనియుఁగోరఁగా, పిఠాపురమువారికిని తమకునుగల మైత్రిని బాటించి, అంతవఱకుఁదమసంస్థానము క్రిందజరుగుచున్న చాళుక్యభీమవరము (చామర్లకోటవద్దది) గ్రామమును రమణయ్యగారికి పసుపుకుంకుము నిమిత్తమిచ్చివేసినారు. ఈ ప్రకారము వత్సవాయ తిమ్మరాజుగారమితోదారసాహసములంగలిగి, చేతికడ్డులేకుండ దానము సేయుచుఁ, దమవితరణముచే శిబికర్ణులందలపించుచు వన్నెయువాసియుం గాంచిరి.

—: భాషాభిమానము: కవిసన్మానము. :—

ఈతిమ్మరాజుగారుకూడ తండ్రితాతలవలెనే తామకూడ భాషాభిమానులై కవీశ్వరులనాదరించి ప్రసిద్ధిచెందినవారు. రామవిలాసమును రచియించిన ఏనుఁగు లక్ష్మణకవి తాతగారైన లక్ష్మణకవిగారు ఈయనకాలమునందేయుండి, తాము రచియించిన ద్రౌపదీపరిణయ

ప్రబంధము నీయనకంకితముచేసియుండిరి. ఈ సంగతియే రామవిలాసములోని యీక్రిందిపద్యమువలనఁ దెలియఁగలదు.

“చ॥ హరిహరపద్మజాంశభవుఁడై తగు వేమఁగులక్ష్మణార్యుచే
సురుచిరశబ్దభావరసగుంభదలంకృతిమాధురీ మనో
హరమగు ద్రౌపదీపరిణయంబను నుత్తమకావ్యమందె సు
స్థిరమగు కీర్తిసొంపెసఁగఁ దిమ్మనృపాలుఁడు ధర్మపద్ధతిన్.”

ఈ వేమఁగు లక్ష్మణకవియే ధ్రువచరిత్రమును వేంకటరాజ పుత్రుఁడగు జగ్గరాజునకును, తుల్యామహాత్మ్యమును కస్తురిరంగరాజ పుత్రుఁడగు జగన్నాథరాజునకును, వత్సవాయకులజులయిన రాజబంధువుల కంకితము చేసినట్లే క్రిందిపద్యము వెల్లడించుచున్నది.

“చ॥ కవికులసార్వభౌముఁడనఁగాఁ దగు వేమఁగు లక్ష్మణార్యుచే
ధ్రువచరితప్రబంధము బుధుల్వినుతింపఁగ నందియాగభు
గ్భవన మహాసుఖానుభవకారణమైన యశంబుగాంచె వా
సవవిభవుండు వత్సవయ జగ్గనృపాలుఁడు సన్నుతోన్నతిన్.”

“ఉ॥ హేమనగేంద్రధీరుఁడగు వేమఁగు లక్ష్మణసత్కవీంద్రుఁడు
ద్దామసుధామయోక్తివితతంబగునట్లు రచించినట్టి తు
ల్యామహిమప్రబంధము గుణాఢ్యులుమెచ్చఁ బరిగ్రహించెఁబ్ర
జ్ఞామహితుండు జగ్గనృపచంద్రుఁడు శాశ్వతకీర్తిసంధిలన్.”

ఈ తిమ్మరాజుగారు కృతినందిన ద్రౌపదీపరిణయము కూడ నెక్కడను గానరాకున్నది.

ఈ వత్సవాయ రాజులమీఁదఁ జెప్పఁబడినవవి యొకటి రెండు చాటువులు బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారిచే సమకూర్పఁ

బడిన చాటుపద్యమణిమంజరియందు ముద్రితములై యున్నవి. అవి రెండునుగూడ తిమ్మరాజు గారిమీఁదఁ జెప్పఁబడియున్నవి. ఆపద్యము లష్టదిగ్వినుత యశోవంతుఁడైన యీకీర్తి తిమ్మక్ష్మాకాంతునిమీఁదనే చెప్పఁబడినవేమోయనితలంచి వాని నీక్రింద పొందుపఱుచుచున్నారము.

"ఉ॥ తీరుగ వత్సవాయకుల తిమ్మజగత్పతికీర్తిహారమా
హారశరద్ద్విజన్మకులిశాయుధజాతులమించె; శౌర్యమా
హారశరద్ద్విజన్మకులిశాయుధజాతులమించె; రూపమా
హారశరద్ద్విజన్మకులిశాయుధజాతులమించె సిద్ధరన్"

"ఉ॥ రాజులరాజులోభి, యొకరాజులరాజతిమూర్ఖుఁ డష్టది
గ్రాజులరాజుచోరుఁడు, విరాజులరాజొకపక్షి, తారకా
రాజులరాజుదోషి, ఫణిరాజులరాజొకవక్రగామి, యీ
రాజులురాజులా సుగుణరాజులరాజవు నీవుగాక, సూ
రాజవతంస! వత్సవయి రాజమహీపతి! తిమ్మభూపతీ"

ఈయన తమ్ములైన బలభద్రరాజు గారుకూడ భాషాపోషకులై కిరాతార్జునీయమును కృతినందుటయే గాక తాముకూడకవులయి శ్రీరామశతకమును రచియించి విఖ్యాతులైరి. ఈ సంగతియే రామవిలాసములోని యీక్రిందిపద్యమువలన వేద్యమగుచున్నది.

"మ॥ అమితఖ్యాతికిమూలమైన కృతిఁజానందెఁ గిరాతార్జునీ
యము శ్రీరాములపేరఁ బద్యశతకం బారూఢినిర్మించె భో
జమహీజానిగతిన్ బ్రసిద్ధిగనియెన్ సాహిత్యపారజ్ఞుఁడై
రమణన్ శ్రీబలభద్రరాజు ప్రజలన్ రక్షించె ధర్మస్థితిన్"

ఇట్లనేకకవిపుంగవులచే సంస్తుతులందుచు, వచ్యుతాండగు శ్రీకృ

ష్ణునకు బలభద్రునింబోలె, బలభద్రుం డచ్యుతాంశసంభూతులగు తమకు, దక్షిణభుజంబునై వడి ననువర్తించుచుఁ, గమకోశ యుండఁగా నుండ. సార్వభౌమతిమ్మరాజుగారు దారసాహసవిక్రమార్కులై. రణరంగవిజయులై, కవిజనాశ్రయులై, రసగ్రహణభోజులై ప్రథితిఁ గాంచి విరాజిల్లిరి.

## —: దేశస్థితి. :—

ఈకాలమునందలి దేశస్థితిఁ దెలిసికొనుట కొంతవఱకు ముఖ్యావసరము గనుక దానినిగుఱించి యీక్రిందఁ దెలుపఁబోవుచున్నారము. క్రీ. శ. ౧౫౭౧వ సంవత్సరమునుండియు రాజమహేంద్రవరము, శ్రీకాకుళము, సర్కారులు గోలకొండలోని కుతుబ్ షాహివంశమునకు స్వాధీనములైనవి. కృష్ణానదికి దక్షిణమున నుండు ననేకులు హిందూరాజులు కూడ గోలకొండ నవాబులకు సామంతులైరి. రిఫత్ ఖానుఁడు రాజమహేంద్రవరమువద్ద విజయమునొంది రాజమహేంద్రవర పరిపాలకునికి సాయమొనరించిన ఖాసింకోట రాజునుకూడ సాధింపఁ దలంచి యుత్తరదిక్కుగాఁ బ్రయాణమై వెడలెను. కాని మార్గమధ్యమున హిందువులసైన్యము లాతని నెదిరించుటచే తిరిగి హిందూమహమ్మదీయులకొక గొప్పయుద్ధము సంభవించెను. ఈయుద్ధమునఁగూడ హిందువులే పరాజయమునొందుట తటస్థించినది. ఈయుద్ధమైనపిదప నంతగొప్ప యుద్ధంబులేవియు లేకపోవుటచే, ఈ పైనఁజెప్పిన రెండు సర్కారులందునుంగల దుర్గములను వశపఱచుకొని ఒరిస్సారాజైన విజయనాథదేవునికూడ నోడించి తనయిష్టమువచ్చిన షరతులనంగీకరించునట్లాతనితో సంధిచేసికొని యటుపిమ్మట రాజమహేంద్రవరమువచ్చిచేరెను. అందువలన నాఁటినుండియు, బహమనీరాజ్యవినాశనసంక్షోభ సమయమున

హిందువులచే సంపాదింపఁబడిన రాజ్యములన్నియు జయింపఁబడి, ఢి
ల్లీపట్టణమునుండి ఒరిస్సావఱకునుగల దేశమంతయు తిరిగి మహమ్మ
దీయరాజుల పరిపాలన క్రిందకువచ్చెను.

కాని యీమధ్యకాలమున, అనఁగా మహమ్మదు కూలికుతుబ్
షాహ (౧౫౮౦-౧౬౧౧) పరిపాలించుచుండఁగా ఖాసింకోటరాజు
చనిపోవుటచే పంద్రెండేండ్ల వయస్సుకలిగిన యాతని కొమారుఁడైన
ముకుందరాజు సింహాసనమునకువచ్చి గోలకొండ నవాబుల యధికార
మునుధిక్కరించి వారికి కప్పము చెల్లింపుటమానుకొనెను. అంతటితోఁ
జాలక యాతఁడు మహమ్మదీయ గౌర్నరునుపట్టుకొని యతనిబందిఖా
నాలో ఖైదీగానుంచఁ బ్రయత్నించెను. అందువలన నాతని నణఁచి
వేయుటకై మీర్ జైనుక్ అబిదీన్ గుసుమ్‌దార్ అను సేనానిపంపఁబడెను.
ఈ మహమ్మదీయ సైన్యాధిపతి కిరుగుపొరుగులనుండు హిందూరాజులు
సహాయముగానేతెంచిరి. అప్పుడిరువాఁగులవారికిని రాజమహేంద్రవ
రమువద్ద నొకమహాయుద్ధము జరిగెను. ఆయెంతసేపటికిని నేపక్షము
వారికిని జయాపజయముల నిర్ణయించవీలుకాదయ్యెను. దాదాపుగా
మహమ్మదీయులోడిపోయిరి. కాని యింతకుఁబూర్వమే సేనానాయక
త్వమును వహించిన అమీర్ జుమ్లాఅమీనుల్ ముల్కు అనునతఁ డాక
స్మికముగా నింతవఱకు మూలబలముగానుంచిన యొక గొప్ప యాశ్విక
సైన్యముతో హిందూరాజులంబొడిచి వారినోడించి విజయంబునుగాం
చెను. మహమ్మదీయులకు విజయము చేకూరెననుటయేగాని. వారి
సైన్యమున ధైర్యపరాక్రమములనెఱపుచుఁ బోరాడు వీరాతివీరులైన
గొప్పవారలనేకులు రణరంగమున నిహతులైరి. ముకుందరాజు ఖాసిం
కోటకు పాఱిపోయెను. అక్కడికిని మహమ్మదీయు లతనిని వెంబడించు

టచే తుట్టతుదకు దేశమునువదలిపెట్టి యాతఁడు బంగాళమునకుఁ దాఁకొనియెను.

ఈ ముకుందరాజుతోఁ బోరాటమునకు రాజమహేంద్రవరము, ఏలూరులనుండి సైన్యములు తీసికొనిపోఁబడినప్పుడు కొండలలో నివసించుచు, అప్పుడప్పుడు కొల్లపెట్టుటకు గోదావరీ పల్లపు భూములపై దండెత్తివచ్చుచుండు రెడ్లు, అదియేతగినసమయమనియెంచి కోయవాండ్ర సహాయమునుదీసికొని, ఏలూరు, నిడుదవోలు, శాహర్జల్లిలను, దోఁచుకొనిరి. ఆ యా దేశవాసులు రక్షణమునకై చుట్టుపట్లనుండు నరణ్యములకు పాఱిపోయిరి. కొంతసైన్యముతో అమీర్ ఖాన్ అనునతఁడు వారిపైకిఁబంపఁబడెను. అతఁడు వారినోడించితఱుముగా వాడుక ప్రకారము వారు చెల్లాచెదరై పోయి తిరిగి కొండగుహలలోను, లోయలలోను, మూఁగొనియుండిరి ఒకప్పుడిరువదివేలమంది గోదావరీతీరమున మహమ్మదీయుల నెదిరించ నిలిచిరనికూడఁ జెప్పఁబడుటకలదు. కాని తుట్టతుదకు వారుసంపూర్ణముగ నోడింపఁబడుటయు, దేశమున శాంతి సంస్థాపనయుంగూడ కలిగెను.

ఏలూరును, గోదావరికి పశ్చిమముననుండు ప్రదేశమునుగూడ సంపూర్తిగ జయింపఁబడెను. కాని రాజమహేంద్రవరముమీఁదను, నదికి ప్రాగ్దిశనున్న ప్రదేశముమీఁదను మహమ్మదీయుల యధికారమేమాత్రమును భద్రముకానిస్థితిలోనుండెను. ఆ పరగణాయొక్క విజయము సంపూర్తియనిపించుకొనఁజాలదయ్యెను. మధ్యడెల్టాలోని నగరములంక ఇబ్రహీమ్‌షాహయొక్క సైన్యములచే జయింపఁబడక మిగిలియుండెనని తెలియవచ్చుచున్నది. అంతియగాక పరగణాయొక్క మధ్యభాగమైనను, అప్పుడప్పుడు కొండలలోని యనారోగ్య ప్రదేశముల

కాన్నరక్షణకై తరుచుగొట్టుఁబడుచువచ్చిన జమీనుదారుల కొల్లల నుండియు, దోపిళ్లనుండియు. రక్షింపఁబడలేకపోయెను. ఆ జమీన్‌దారులు తఱుచుగను వ్యాప్తుగ నొక్కసారి దండునుగూర్చుకొని వచ్చి పై నివర్ణింపఁబడినట్లుగనే దోఁచుకొనుచుండిరి తగినంత మూలబలము లేకపోవుటచే మహమ్మదీయులు వారినిప్పూర్తిగనణఁచిపెట్టుటకు సాధ్యము కాకుండెను.

అయినప్పటికి, ఢిల్లీలోని పాదుషాహాలు రాజమహేంద్రవరము సర్కారును తమసామ్రాజ్యములోఁజేర్చుకొని దానిని ఒరిస్సాపరగణాలలో నొక కొంతభాగముగ పరిగణించుచువచ్చిరి. బంగాళములోని అక్బరుపాదుషాహా ప్రతినిధియైన రాజా మానసింగు, ఒరిస్సాయొక్క యుత్తరభాగమును కొంతజయించి, దక్షిణమునయున్న సామంతరాజ్యములగు రాజమహేంద్రవరము, శ్రీకాకుళములనుగూడ తానుజయింపకపోయినను తనవిజయములలోఁ గలుపుకొనివానికి రు 1,25,000 లు శిస్తుకట్టెను. ప్రతిసంవత్సర మీసొమ్ము వచ్చుచున్నట్లు "అయిని అక్బరీ" యను గ్రంథమున వ్రాయఁబడియున్నది. కాని యదార్థమునకు మొగలుల యాయుధములు చిలుకసరస్సును దాఁటిరాలేదని చెప్పవలసియున్నది. ఒరిస్సాలోని యొకభాగమని పాదుషాహాలీజిల్లామీద సొంతనామమాత్రాధికారము చెలాయించుచువచ్చినను, నిజమునకదిమాత్రము గోలకొండనవాబుల స్వాధీనములోనేయుండెను. వారు తమకువచ్చురాఁబడి వసూలుచేయుటకై కొంతబలము నచ్చటనిలిపిరి. ఆమాన్యములకు పన్నుకొట్టివేయఁబడెను. అట్టి మాన్యములవలననో, యుద్ధమతరగతులవారినుండి బలాత్కారముగ సేవియోలాగుటవలననో, లేక యన్యాయముగ ప్రజలనుహింసించి లంచములను బుచ్చుకొనుట

చేతనో, యాబలములు తమజీవనము గడుపుచుండిరి. పొందికలేని యీపరిపాలనము క్రీ. శ. ౧౫౭౧ మొదలుకొని మన సార్వభౌమ తిమ్మరాజుగారి కాలమువఱకు జరుగుచుండెను.

ఈ పరిపాలనమిట్లుజరుగుచుండఁగా క్రీ. శ. ౧౬౭౨ మొదలుకొని ౧౬౮౭ వఱకు అబూహుసేన్ కుతుబ్ షాహ యను నాతఁడు గోలకొండ నవాబుగానుండెను. అతఁడుమిక్కిలిమంచివాఁడు. అతఁడు హిందువులను మహమ్మదీయులను సమానముగ నాదరించుచు సమర్థులైన హిందువుల కున్నతోద్యోగముల నొసంగుచుండెను. ఈయన యొక్క మంచితనమునుబట్టియే ప్రజలీయనను తాన్ షాహ లేక మంచి రాజని పిలుచుచువచ్చిరి. ఈ తాన్ షాహశబ్దమే రానురాను తానీషాగా మారెను. ఈయన కాలముననేయున్న శ్రీరామభక్తుఁడైన రామదాస నామాంతరముగల గోపన్నగారిని సంస్మరించక ఈతానీషాగారివద్ద నున్నతపదవుల నాక్రమించిన హిందువులలో అక్కన్న మాదన్నయనువారలిరువురు. వీరిద్దఱిలో అక్కన్నగారు సైన్యాధిపతియనియు, మాదన్నగారు మంత్రియనియు రాయపరాజుగారి పరిపాలనముంగూర్చి వ్రాయునపుడే తెలిపియున్నారము. ఈ గోలకొండ రాజ్యమును సాధించవలయునని పెక్కురు పెక్కుమారులు ప్రయత్నించియుండిరి. కాని రామలక్ష్మణులవలెనున్న యీపురుష సింహములనుజూచి వెనుకకు తగ్గుచుండిరి. అక్బరుషాదుషాహ మునిమనుమఁడైన అవరంగజేబు ఏదోయొక మిషనుకల్పించి యీ గోలకొండను బట్టుకొనుట కనేకమారులు ప్రయత్నించెను. కాని భండన గాండీవియని ప్రఖ్యాతిపడసిన అక్కన్నగారును, బుద్ధిని బృహస్పతిని మించి యాలోచన కంతటివాఁడు లేఁడని పేరుగాంచిన మాదన్నగారును

అవరంగజేబు సైన్యములను కోటగోడలను దరియకుండ శకుముఁగొట్టుచు వచ్చిరి.

క్రీ. శ. ౧౬౮౬వ సంవత్సరమున అవరంగజేబు గోలకొండను తిరిగి ముట్టడించెను. కాని యీపర్యాయము, ఈవఱలో హిందువులకుఁ గొప్పపదవుల నిచ్చుచున్నాఁడని తానీషాను ద్వేషించినట్టియు, అక్కన్న మాదన్నగార్లకు విరోధులైనట్టియు మహమ్మదీయులు శత్రుపక్షమునఁజేరిరి. ఈ గోలకొండను ముట్టడింపకపూర్వము శత్రుసేనలు హైద్రాబాదును ముట్టడించి దానిని జయించినవి. అప్పుడచ్చటనున్న తానీషా గోలకొండకు పాఱిపోయి వచ్చి దుర్గద్వారమును మూయించెను. అక్కన్నమాదన్నగారలు హైద్రాబాదుపట్టణముననే ముష్కరులగు తురుష్కులచే వధియింపఁబడిరి.

తనపక్షముననున్న మహమ్మదీయులే తన్నువిడిచిపెట్టి శత్రుపక్షమునఁజేరి మోసమొనరించుటచే తానీషా యోడిపోవలసినవాఁడయ్యెను. అయినను అతఁడమితధైర్యశౌర్యములనుజూపుచు నేడుమాసములవఱకు దుర్గమును సంరక్షించుకొనుచుఁ బోరాడెను కాని అవరంగజేబు మాయలముందఱ నీతని ధైర్యశౌర్యములేవియుఁ బనికిరాకపోయెను. చిట్టచివరకు అవరంగజేబు ౧౬౮౭వ సంవత్సరమున కోటను స్వాధీనపఱుచుకొని తానీషాను జెఱఁబెట్టెను. ఆమఱుసటి సంవత్సరముననే గోలకొండ మొగలసామ్రాజ్యములోఁ జేర్పఁబడియెను.

నాఁటినుండియు నీరాజమహేంద్రవరము శ్రీకాకుళము సర్కారులుకూడ, గోలకొండరాజ్యములోనివేగనుక, మొగలులవశమయ్యెను. ఈ సర్కారులు ఒకరిస్వాధీనముతప్పి మఱియొకరి స్వాధీనమైనవన్నమా

టయేగాని క్రొత్తపరిపాలనయుం దేమాత్రమును మార్పు కనఁబడద య్యెను ఇదివఱకు వలెనే! యిప్పుడుకూడ హింసా న్యాయములు ప్రబలములయియే యుండుటచే ప్రజలకీనూతనాధికారుల పరిపాలన క్రొత్తచేయులేదు.

ఈ క్రొత్తగా సంపాదించిన రాజ్యములను బరిపాలించుటకై అవరంగజేబు ఒకప్రతినిధిని నియమించెను. ఆప్రతినిధికి దక్కనుసుబా దారని పేరు. ఇతఁడు మొదట ఔరంగబాదులో నివసించి తరువాత హైదరాబాదును తనముఖ్యనివాసస్థానముగఁ జేసికొనియెను. కాలక్రమమునని దక్కనుసుబాదారుడే హైదరాబాదు నైజామను పేరఁబిలువంబడుచు వచ్చెను. ఈ దక్కనుసుబాదారుక్రింద నిరువది రెండు పరగణాలు కలవు. వానిలో రాజమహేంద్రవరము శ్రీకాకుళము లనునవి రెండు. ఈరెండును ఏలూరు, కొండపల్లి, గుంటూరులు మొత్తమీ యైదునుకలిసి యిప్పటికిని "ఉత్తరసర్కారు" లను నామంబున వ్యవహరింపఁబడుచున్నవి.

ఈ తిమ్మరాజుగారి పరిపాలనాకాలముననే అనఁగా క్రీ. శ. ౧౬౬౪వ సంవత్సరమున ఫ్రెంచితూర్పుఇండియావర్తకసంఘమేర్పడి యీ పటులో వర్తకముచేసికొనుచున్న డచ్చి, ఇంగ్లీషు, పోర్చుగీసువారివలెనే హిందూ దేశముతో వ్యాపారముచేయుట కారంభించినది! ఈ ఫ్రెంచి దేశీయులనే పరాసువారనిపిలుచుదురు. వర్తకవ్యాపారమునకై వచ్చిన యీపరాసుసంఘమువారు సూరతుపట్టణమున ౧౬౬౮లో హిందూ దేశమున తమ మొదటి గిడ్డంగినికట్టిరి. క్రీ. శ. ౧౬౭౪వ యేట ఫ్రాన్సిస్ మార్టిన్ అనునొక గొప్పపరాసుదేశీయుఁడు, విజాపురపునవాబు నాశ్రయించి, కొంత నేలనుసంపాదించి, యచ్చటనే తూర్పుతీరమునందు

మొదటి పరాసుస్థానము నేర్పఱచెను. అదియే పుదుచ్చేరియని పిలువఁబడుచున్నది!

క్రీ. శ. ౧౬౬౮లో బొంబాయి ఇంగ్లీషువర్తకసంఘమువారి క్రిందకువచ్చెను. ౧౬౯౦వ సంవత్సరమున బంగాళములోని సతనాతి యను ప్రదేశమాంగ్లేయుడైన జాబ్ చార్నల్ అనునాతని గొనఁగఁ బడెను. ఆప్రదేశారంభమునుండియే ప్రస్తుతమున్నకలకత్తానగరము కట్టఁబడినది.

ఈవిధముగవర్తకవ్యాపారము నిమిత్తమైవచ్చిన ఫ్రెంచిఇంగ్లీషు తూర్పుఇండియా వర్తకసంఘములు వీరినాశ్రయించియు, వారి నాశ్రయించియు, కొంతకొంతభూమిని సంపాదించుకొనుచు భారతభూమిలో మిగులచమత్కారముగ తమస్థానముల నేర్పఱచుకొనినవి.

గోలకొండ, మొగలసామ్రాజ్యమునఁ జేర్పఁబడిన సంవత్సరము వనే (౧౬౮౭) ప్రజానురంజకముగఁ బరిపాలించి, యశోయకీర్తిని సంపాదించిన సార్వభౌమ తిమ్మరాజుగారు తమ డెబ్బదవయేట పరమ పదమునొందిరి.

## రెండవ రాయపరాజుగారు. :—

## (౧౬౮౭—౧౭౧౮)

శ్రీ సార్వభౌమ తిమ్మరాజుగారికి సంతానము లేకపోవుటచే ఆయన యనంతరమున ఆయనతమ్ములైన బలభద్రరాజుగారి కొమారులు రాయపరాజుగారు సింహాసనారూఢులైరి. వీరిని ఉద్దండరాయపరాజుగారనికూడ పిలుచుటకలదు! ఈయనను గురించి లక్ష్మణకవి తన రామవిలాసములో నిట్లువర్ణించియున్నాఁడు.

"చ॥ శుకకలహంసబర్హిబలిసూదనరత్నసపద్మసింధురా
శ్లోకముఖదేశసంభవసవిశ్వహయంబుల నోలిదెచ్చి కా
నకలిడి దేశనాథులు మనుప్రతిమానవవీర్యశౌర్యతా
రకరిపుతుల్యు వత్సవయ రాయనృపాలుని గొల్తురెప్పుడున్॥

మ॥ పరసాత్త్వ్లి విరతాన్నదానకలనా సంతోషితానంతభూ
సురపాళీ శుభవార్యదర్శనగజస్తోమాశ్వరాజ్యార్థను
స్థిరలక్ష్మీపరిపూర్ణగాంభీర్యవసుక్ శ్రీకాన్తయాన్వమా
భరణుల్ రాయపరాజచంద్రునిదగున్ భల్మానువర్తింపగా॥"

ఈయన యనివార్యశౌర్యపరాక్రమవంతుఁడై పర్వనాయకులను జయించినట్లు పైనిఁజెప్పిన రామవిలాసములోనిదే యగు నీ క్రింది పద్యము వెల్లడించుచున్నది.

"గీ॥ రూపునకామవిక్రమారకోటిపైమునను
మాధవునిగెల్చి విఖ్యాతిమహిమఁగాంచెఁ
బర్వనాయకులజయంబు పదిలపఱచెఁ
దేజమున రాయపక్షమాధీశ్వరుండు"

వీరు రాజ్యకము చేయుచుండఁగా, క్రీ. శ. ౧౭౦౭ వ సంవత్సరమున మొగలచక్రవర్తులలో శ్రేష్ఠుఁడైన అవరంగజేబు కాలము చేసెను. ఇతని వెనుకవచ్చిన యుత్తరకాలపు మొగలులు దుర్బలులైనందున, ఇతని మరణముతోనే మొగలుమహాసామ్రాజ్యము శిథిలమైపోవుట ప్రారంభించినది. ఔరంగజేబు క్రింద నుద్యోగములలో నుండి గొప్ప రాజకార్యధురంధరులైన తురుష్కులు స్వాతంత్ర్యమును సంపాదించుటకై ప్రయత్నములు సేయఁజొచ్చిరి. అట్టివారిలో దక్కనుసుబాదారు

ఒకఁడు. అతని పేరు కమరుద్దీన్ అసఫ్జా. ఇతఁడు నైజామ్-ఉల్-ముల్క్ అను బిరుదముతో హైదరాబాదును రాజధానిగఁ జేసికొని దక్షిణదేశమును బరిపాలింపఁజొచ్చెను. ఇతఁడు ఢిల్లీశాహనుషాహకు పేరునకుమాత్రము ౧౭౨౨వఱకు సామంతుఁడనని చెప్పుచు ౧౭౨౩ లో తాను స్వతంత్రప్రభువైనట్లు ప్రకటించెను. అప్పటినుండియు నదివఱకు మొగలులవశమునందున్న గోలకొండసుబా యితని స్వాధీనములోనికివచ్చెను. ఈతని కాలమున ఆర్కాటు, కర్నూలు, రాజమహేంద్రవరము, శ్రీకాకుళములు ఈగోలకొండ సుబాలోనివిగా నుండెను. వీనిని. నిజామ్-ఉల్-ముల్కునకు ప్రతినిధులుగా నుండిన నవాబులు పరిపాలించుచువచ్చిరి. ఈతని వంశీయులైన హైదరాబాదు పరిపాలకులిప్పటికిని ఈనిజామ్ అనుబిరుదముతోఁ బిలువఁబడుచున్నారు.

దేశము ఒకరి స్వాధీనమునుండి మఱియొకరి స్వాధీనములోనికిఁ బోవుచున్న సంక్షోభసమయముననే మన రెండవ రాయపరాజుగారు విగతదేహులైరి. ఈయనయొక్క పరిపాలనమునుగుఱించి యిప్పుడున్న యాధారములతో నింతకన్న నెక్కువగ నేమియుఁ దెలియరాదు. ఇంతకంటె ఏమియు విశేషములు తెలియరాకుండుటంబట్టి యీయన రాజ్యమున శాంతినిలబడియుండెనేమోయని యూహించుట కవకాశమిచ్చుచున్నది! ఈ గ్రంథమును వ్రాయుటయందు మిక్కిలిసహాయకారియైన మూలగ్రంథమగు రామవిలాసముకాని, మాకు దొరకిన యితరాధారములుకాని, యీయన పరిపాలనముగుఱించి వ్రాయుటలో నింతకంటె మాకెక్కువతోడ్పడవయ్యెను,

శ్రీ గొట్టుముక్కల భగవద్రాజుగారి కొమార్తెయైన రాగమ్మగారు ఈ రాయపనృపాలుని సతీమణియై విలసిల్లెను. ఈ యిరువురు

పుణ్యసంపత్తులకు తిమ్మరాజుగారు, బలభద్రరాజుగారు, సూరపరాజుగారు అను ముగ్గురు కొమరులుగలిగిరి. వీరందఱిలోను తిమ్మరాజుగారు బాహుబలశాలియై విరాజిల్లెను.

### —: మూఁడవ తిమ్మరాజుగారు :—

### ( ౧౭౧౮—౧౭౩౮ )

రెండవ రాయపరాజుగారు దేహము చాలించినవెనుక ఆయన కొమరులలో జ్యేష్ఠులైన తిమ్మరాజుగారు ప్రజాపరిపాలనాభారమును వహించిరి. ఈయన రాజ్యమునకువచ్చునప్పటికి కేవలము పదిసంవత్సరముల ప్రాయమువాఁడు. ఈయనకు యుక్తవయస్సు వచ్చునంతవఱకు తల్లిగారైన రాగమ్మగారే మంత్రిదండనాథాగ్రణుల సాయముతో రాజ్యతంత్రమును నడుపుచుండిరి.

ఇట్లు రాఘవమ్మగారు కొమరునిసింహాసనమెక్కించి రాజ్యమేలుచుండఁగా హాజీహుస్సేన్ అను సర్దారుఁడు హైదరాబాదునుండివచ్చెను. రెండవరాయపరాజుగారి పరిపాలనలో కమ్రుద్దీన్ అసఫ్ జా స్వాతంత్ర్యుఁడయ్యెనని చెప్పియుంటిమికదా! అతఁడు రాజమహేంద్రవరము శ్రీకాకుళము సర్కారులకు నవాబుగ అన్వరుద్దీనును నియమించెను. ఈ సర్కారులందలి జమీందారులు చెల్లించవలసినకప్పము బాకీపడియుండ దానిని వసూలుచేయుటకై అన్వరుద్దీను తనతాబేదారైన రుస్తుంఖానును బంపెను. అతఁడురాజమహేంద్రవరమును తన ప్రధాననివాసస్థానముగ జేసికొనియెను. ఈ రుస్తుంఖానుకే హాజీహుస్సేన్ అనునామాంతరముకలదు. ఇతఁడు ౧౭౩౭ మొదలు రాజమహేంద్రవరము సర్కారు నేడేండ్లు పరిపాలించెను. ఇతఁడు సైన్యముతో వచ్చుచుండఁగా

నాతని నెట్టులైన దేశములోనికడుగు పెట్టకుండ చేయవలెనని మొగలతుర్తి సంస్థాన ప్రభువులైన కలిదిండివారి తాలూకు రామరాజును, నూజివీడు సంస్థానికుల తాలూకు సుబ్బన్న అనే ఆయనయు, తమ సైన్యములం జేర్చుకొని యుభయులు నొక్కటిగాఁగూడి రెండుమూఁడుసారు లాతనిని ఏలూరువద్ద నెదిరించిరి. కాని పరాజితులై పలాయనులై పెద్దాపురము వచ్చిచేరిరి. దేశాభిమానస్వాతంత్ర్యగౌరవముల నెఱిఁగిన రాఘవమ్మగారి ప్రోత్సాహమున తిమ్మరాజుగారును, పిఠాపురమును బరిపాలించుచున్న రావు వెంకటకృష్ణారాయనింగారును, వీరికిఁ దోడైనిలిచి ఆ. హాజీహుస్సేనును గోదావరిని దాటిరాకుండ చేయవలెనని యోచనలుచేసి బలములను సాసిద్ధముచేసి యుద్ధమునకు సిద్ధపడిరి. ఇంతలో నాసర్ లష్కరుఁడు గోదావరినదిదాటి రాజమహేంద్రవరమునచ్చెను. అంతట నొకటిగాఁగూడిన వీరంటి సైన్యములును రెండుసారు లాతురుష్కసైన్యాధిపతిని శాలివాహనశకము ౧౬౫౬వ సంవత్సరమునకు సరియైన క్రీ. శ. ౧౭౩౪వ సంవత్సరమున మార్కొనిరెను. కాని దైవము తురుష్కులపాలనుండుటచేతను, మహమ్మదీయుల వంచకత్వమువలనను, నీ యుద్ధమునగూడ రుస్తుమ్‌ఖానుఁడే విజయుఁడయ్యెను.

వెంకటకృష్ణారాయనింగారు తమకు సన్నిహితజ్ఞాతియైన రావు బుచ్చన్నగారిని వెంటఁబెట్టుకొని రామరాజు, సుబ్బన్నగార్లసహితముగఁ గొండవాండ్రసహాయమునఁ బితూరీ లేపుటకై కోటపల్లి మన్యమునకుఁ బాఱిపోయిరి. కాని యచ్చటికరిగినవారిలో బుచ్చన్నగారు తక్క మిగిలినవారు మన్యపుజ్వరములచేఁ బీడితులై మృత్యువుపాలైరి.

అటుతరువాత నసర్ లష్కరుఁడు పెద్దాపురమునకరిగి పశ్చిమమున

నున్న పాండవులవారిమెట్టయని చెప్పఁబడుచోట దండువిడిసి తన్నో్డించ సైన్యములను సహాయమిచ్చెనుగదా యను కసిచే రాగమ్మగారికి కపటముగాఁ బిల్లని తనకొమారుఁడైన నూరుద్దీన్ హుస్సేనుచే రాయబారమంపెను. "మీది ప్రాచీనమైనసంస్థానము. మీది ధర్మపరిపాలనము. మీసంస్థానమును మీకు స్థిరపఱచుటకు మేమెవ్వరము? ధర్మదేవతయే మీకుస్థిరపఱచియున్నది. ధర్మప్రభువులగు మీకొమారుల నొక్కపర్యాయ మిచ్చటకుఁబంపినచో వారి దర్శనము చేసికొని ధన్యులమగుదుము. మేముకూడ వారికిసంస్థానమునుస్థిరపఱచి వెడలిపోఁగలము." ఇవ్విధమున తన తనూజుఁడైన నూరుద్దీన్ హుస్సేనుచే రాయబారమంపఁగా రుస్తుంఖానుని కపట మెఱుంగక, యతని వాక్యములయందు సంపూర్ణవిశ్వాసముంచి, గౌరవపరివారముగ నిరువురు ముఖ్యాను చరులను మాత్రమే తోడిచ్చి రాఘవమ్మగారు తన కొమారులను పరమసాధువైన మేషాకృతినున్న క్రూరవ్యాఘ్రము దగ్గఱకు, మహాభీలమృత్యుగహ్వరమునకు, యమసదనమునకు సాగనంపినట్లువంపెను! ఆమెయొక్క కుమారులుకూడ నూరుద్దీన్ హుస్సేన్ వలెనే హాజీహుస్సేన్ వాక్యమునందలి కాపట్యము నెఱుంగక తమ పాలిటి యమాలయమునకుఁబోయిరి.

అప్పుడా రాజకొమారులను హాజీహుస్సేను తన డేరాలోనికి రప్పించి కొంతసేపుసంభాషణజరిగినపిదప నూనెకాపించి సలసలమఱుగుచున్ననూనెను జొన్నవెన్నులతోఁ వీపుమీఁదఁగొట్టించి దయాదాక్షిణ్యరహితుఁడై, క్రూరకిరాతస్వభావుఁడై, రాక్షసవృత్తిని నెఱపి, దారుణహింసపాలుచేసి యసువులందీసెను.

ఈవిధమున నారాజకుమారుల వధాప్రకారము స్థానికచరిత్ర

యందు వివరింపఁబడియున్నను, హాజీహుస్సేనునకు తిమ్మరాజుగారీవఱకు గొంతకప్పము చెల్లించవలసియున్నట్లును, ఆ రాజకుమారులు తన దేరాలోనికి వచ్చినపిదప తమకు కప్పము బాకిపడినందులకానవాబు వారిపైఁ గోపపడెననియు, నందుకు తిమ్మరాజుగారు యుక్తసమాధానములొసంగినట్లును, అందుపైఁ దనమాటలకట్లు నిర్భీతచేతస్కులరై ప్రత్యుత్తరములొసంగుటకిట్టి యాతురుష్కసైన్యాధీశుఁడు వారలం జెఱనుంచఁ బ్రియత్నించెననియు, నటుపిమ్మట శౌర్యవంతులును, మానధనులు నగువారలు తమకైజారులందీసి పొడుచుకొని క్షత్రియోచిత మరణము నందిరనియుఁగూడఁ జెప్పఁబడుటకలదు.

ఈ ధరణీశవరుల వధావిధాన మనతికాలముననే నగరులోఁ దెలియ రాఘవమ్మగారు పుత్రశోకావేశముచేతను, మానాభిమానసహితులును, సత్కార్యకరణోత్సుకులును, నగు ముష్కర తురుష్కులే దౌర్జన్య మొనరింతురోయన్న భీతిచేతను, అగ్నిప్రవేశముంగావించి వీరమాతయుం బోలె దేహపరిత్యాగమొనరించిరి. సంస్థానసేవకులలో విశ్వాసపాత్రుఁడైన చల్లాపెద్దియను నతఁడు రాగమ్మగారినుండి యనుమతిం గైకొని పతివ్రతాశిరోమణులగు క్షత్రియకాంతారత్నములు సర్లష్కరుని సైనికులచే నట్టిపరాభవమునకును పాలుగాకుండునట్లు వారి నవరోధమునకుంచి దానికగ్నిముట్టించెను. అంతట వారెల్లరు నా మహాగ్నిహోత్రజ్వాలలఁ దమ భౌతికశరీరంబులంజాలించి యుత్తమలోకముం గూర్చిజనిరి. ఆహా! హిందువుల స్థైర్యసాహసము లిటులనేగదా వెల్లడియయినవి!

ఈపైన వివరింపఁబడిన తెలుంగున రాయపరాజుగారి కొమారులైనరెండవ తిమ్మరాజుగారు ౧౭౧౮ మొదలుకొని యిరువదేండ్లుభూత

లంబుగుం బాలించి క్రీ. శ. ౧౭౩౮లో దారుణవధపాత్రులై విగతజీవులైరి. ఈయన యనేక దేశలిపులును, ననేక దేశభాషలును నేర్చినట్లు రామవిలాసములోని యీక్రిందిపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది.

"ఉ॥ ధీరులుసన్నుతింప బహుదేశలిపుల్ బహుదేశభాషలున్
సారకవిత్వశాస్త్రవరసజ్ఞతయున్ దనసూక్ష్మబుద్ధిచే
నేరిచె విద్యలన్నిటికి నిత్యవిభూషణమైనయీవిచే
భూరియశంబుగాంచె గుణపూజ్యుఁడు తిమ్మనృపాలుఁడిమ్మహిన్"

ఈ తిమ్మరాజుగారి మరణముతో క్రీ. శ. ౧౫౭౧వ సంవత్సరమునకుఁ బూర్వమునుండియు వత్సవాయవంశీయులచే నవిచ్ఛిన్నముగఁ బరిపాలింపఁబడుచు వచ్చుచున్న పెద్దాపురసంస్థానము మహమ్మదీయుల యధికారముక్రిందకు వచ్చెను.

—: మహమ్మదీయుల సర్వాధికారము :—

( క్రీ. శ. ౧౭౩౮ మొదలు ౧౭౪౯ వఱకు )

రాగమ్మగారగ్నిప్రవేశ మొనర్చుతరి, నామెగ్గలు కొంపెల్ల మహాలక్ష్మి యనునొక బ్రాహ్మణవితంతువుండెను. అప్పుడా రాగమ్మ గారు తమకుమనుమఁడును, తిమ్మరాజుగారి కొమారుఁడును, నేఁడాది శిశుప్రాయునై యున్న జగపతిరాజుగారిని విజయనగరమునందున్న పూసపాటి విజయరామరాజుగారి భార్యయుఁ దన సోదరిసమానురాలును నైన చంద్రయ్యమ్మగారికి సంగతియంతయుం జెప్పి యొప్పగించవలసిన దని చెప్పెను. అంతట వితంతువైన నాబ్రాహ్మణియు నేకైకవత్సర ప్రాయుఁడైన యారాచకొమరుని నామెయాజ్ఞాప్రకారము విజయన

గరమునకుంగొనిపోవ బయలుదేఱివచ్చుచుండఁగాఁ గొంతమంది మహా మ్మదీయభటులు లామెను ద్వారమువద్ద నడ్డగించి యీరాజపుత్త్రు నెచ్చటకుఁ దీసికొనిపోవుచున్నావని యడుగ నామె యతఁడు రాజపుత్త్రుఁడు కాఁడనియు, తన కొమారుఁడే యనియుఁ బ్రమాణముచేసి చెప్పెను. అటుపిమ్మట నాభటులు సంశయమనస్కులరై యామె వచనంబులను విశ్వసింపఁజాలక తమ సంకోశముందీర్చుకొన నొక జామపండు తెచ్చి యాబాలునికిచ్చి, యతనిచే నాఫలమును గొఱికించి యా యుచ్ఛిష్ట ఫలము నామెనుభుజియించవలసినదని యానతిడిరి అంతటనామెయు, నా రాజపుత్త్రసంరక్షణమే తన విధాయకకృత్యముగా నెంచి, కులభేదము నించుకయుంబాటిసేయక, యేతత్సందర్భమున నాభటుల కేమాత్రము ననుమానము వొడమునట్లుకూడ నటియింపక, వా రానిచ్చిన తక్షణమే యాయుచ్ఛిష్టఫలమును భుజియించి యాతురకల సంశయముల నివారించెను. పిదప నాభటులును నామెవాక్యములు విశ్వసనీయములైనవిగనెంచి బాలకసహితముగ నామెను వదలిపెట్టిరి. ఆహా! కులభేద మెట్టివిపత్తును దాటించినది!

ఆక్షత్త్రియపుత్త్రప్రాణత్రాత్రయైన యా మహాలక్ష్మియుఁ దన గమ్యస్థానముంజేర చేఁబ్రోలుమార్గముపట్టెను

ఈ మధ్యకాలములో తోటపల్లిమన్యమునకుఁబోయిన బుచ్చన్న గారు కొంతమందిని సహాయముఁదీసికొని దేశముమీఁద పితూరీచేయుటకై ప్రయత్నపడుచుండఁగా నామఱుసటిసంవత్సరముననఁగా రాక్షస సంవత్సరమునకు సరియైన క్రీ. శ. ౧౭౩౯లో హాజీహుస్సేనుఖానుఁ డాతనిని పిఠాపురములోఁబట్టుకొని శిరచ్ఛేదము చేయించెను. ఇతఁడు పిఠాపురమునువదలి కళింగదేశమును జయింపఁబోవుచుండఁగా పెద్దా

పురమునందలి మహమ్మదీయభటులు బాలకసహితముగాఁ గోటలో నుండివచ్చుచున్న బ్రాహ్మణవితంతువును వగలిపెట్టిరను వార్తవిని వారిపైనుంకిపడి తుట్టతుదకు చేఁబ్రోలువద్ద నాబ్రాహ్మణిం బట్టుకొని యాబాలకునిఁ జెఱనుంచి యతనిని జాగరూకతతోఁ జూచుచుండవలసినదని యొకసేవకుని కొంతసైన్యమును నియోగించెను

ఈరీతిని ప్రళయరుద్రుఁడై, దుర్వారశౌర్యమును వెలయించి, జనసంహారమే తన వినోదక్రీడయుఁ బరమావధియుగ నెంచి, మృగయుఁడు మృగములంబలె ప్రజలఁ దఱిమితఱిమి వేటాడి కసిమసంగుచు, దుర్నిరీక్ష్యతేజుఁడై రుస్తుంఖానుఁడు క్రీ శ. ౧౭౩౨ మొదలు ౧౭౩౯ వఱకుఁ బరిపాలించెను.

ఈ పదునెనిమిదవ శతాబ్దాదినుండియు హైదరాబాదులో నివసించుచున్నట్టియు, రాజకార్యవ్యవహారములకు సంబంధించిన కాగితములనుఁ బరిక్షించగలిగినట్టియు జేమ్సుగ్రాంటు అనుఆయన యీ యేండ్ల భయంకర పరిపాలనమునుగూర్చి యాక్షేపణాగర్భితములగు నపహాస్యవచనముల నిట్లువ్రాసియున్నాఁడు.

•రుస్తుంఖానుయొక్క న్యాయబుద్ధివలనను, భుజబలమువలనను ప్రజలుపొందిన యుపకారము లసంఖ్యేయములు. ఇతఁడు తనకొసంగఁబడిన యధికారము నతిసమర్థతతో నెఱపి, నాలుగు దక్షిణపరగణాల సహితముగ రాజమహేంద్రవరము నేఁడేండ్లు పరిపాలించెను. ఈ పరగణాలలోనుండెడి జమీందారులు మొగలుమహాచక్రవర్తియైన ఔరంగజేబు మరణానంతరమునఁ బుట్టిన సంక్షోభమునను, కలతలను దమకు వీలుగాఁ జేసికొని, తనుచుట్టుపట్లనున్న మహమ్మదీయనాయకుల యధి

కారము ద్రోసిపుచ్చి తాము సాధారణముగా స్వతంత్రులగుటకుఁ
బ్రయత్నించుచువచ్చిరి. జమీందారులయొక్క యిట్టి దుండగములను
నివారించి, సరియైనషరతులమీఁదఁ గ్రమపరిపాలనమేర్పఱచుట, యీ
క్రొత్తజిల్లాదారు ( రుస్తుంఖాను ) కు, దుష్కరకార్యముగానుండెను.
అవసరమునకుఁదగిన పద్ధతినవలంబించుట. విధానించికనికరముచూపుట,
పరుషమై, సర్వసామాన్యమైన న్యాయముకానగుట వీనికనుకరించఁ
దగిన యుదాహరణమని, నేఁటివఱకు ప్రజలచేఁ బలుకఁబడుచున్న
నైజాముగారి యాశయము దోషరహితమైనదని, యీ క్రొత్తజిల్లాదా
రుని నడవడికస్వీకరించెను. ఆకాలమునందే, జమీందారులు పరధా
గారములను మోసముచేసి యపహరించుటచే, నాగు, పాటుపడుస్వభా
వముగల కృషికులని, శిల్పకారులంగూడ హింసయును నయోహస్త
ముతోఁ బిండిపిప్పిఁజేసిరి. గనుక నట్టి నిర్దయాళులైన క్రూరులగు
జమీందారులను నిర్మూలము చేయుటయే రుస్తుంఖానుని పరిపాలన
యందలి ప్రథమప్రధానవిషయమై యుండెను. ఆ ప్రకరవలముబొం
బడక పాఱిపోయినవారు రాజద్రోహులుగ పరిగణింపఁబడిరి! అట్లు
పాఱిపోయినవారును హారినంటిపెట్టుకొని యున్నవారునుగూడ తిరిగి
వచ్చినయెడల బహుమానము లొసంగఁబడునని ప్రకటింపఁబడెను.
ఇందువలనఁ జాలినంతమంది త్వరలోనే పోగయిరి. వారట్లు పోగబు
నది భయాశ్చర్యములనుగలిగించు "కుల్లామినారులు" ని పిలవఁబడు
రెండుస్మరణచిహ్నశిలాగోపురముల నిర్మించుటకే గాని సజీవులైయుండి
యిహసౌఖ్యముల ననుభవించుటకుమాత్రము కాదయ్యెను! ఇట్టికుల్లా
మినారులప్పుడు ప్రతిపరగణాయొక్క ముఖ్యపట్టణమువద్దను సామా
న్యముగాఁ గానవచ్చుచుండెను. సాధారణముగాఁ బ్రజలెల్లను నితనికి

భయపడుచు నితఁడన్న వెఱఁగుపడుచుండెడివారు. ఈ రుస్తుంఖానుఁ డవిధేయులైన యీజమీందారుల నెల్లరం దొలఁగించి వారికి బదులుగ అమీనులను నియమించి ప్రసిద్ధిఁ జెందెను. ఈరుస్తుంఖానుని తీక్ష్ణ పరిపాలన ముత్తరసర్కారులలో మార్గదర్శక ప్రశస్తికు పేరు వడసి యుండెను ''

ఈ రుస్తుంఖానుఁ డిల్లివార్యకొల్వ్యమర్శిరీక్షుఁడై, ప్రళయంతకుని చందంబున విజృంభించుచుండ నీతనికన్న నొకించుక మేలని పించుకొన్న యితనితనయుఁడు నూరుద్దీన్ హుస్సేనుఖానుఁ డీ ప్రళయ సంహారమునుగాంచి సహింపలేక బలవంతముగ నాతని మెడమీఁద దేరాకొయ్యలు వేసి త్రొక్కి చంపించి వానిపాలిటి యమదూతయయ్యెను.

ఈ రుస్తుంఖాను మరణమును నూరుద్దీన్ హుస్సేను తనపై యధికారికిఁ దెలిపినమీఁద [illegible] తాఁడును అతఁడొనరించిన కార్యము మంచిదే యని యతనిం గొనియాడి యతనికి రాజమహేంద్రవరమునకే గాక దాడివెడలిజయించినచో కళింగముసర్కారునకుఁగూడ నధికారమిచ్చితి మని ఫర్మానానిచ్చెను. అటుపిమ్మట నూరుద్దీన్ హుస్సేను కళింగమును జయించుటకై దాడివెడలిపోవుచు, చేబ్రోలు వెళ్లుతఱుణమునకు మన తిమ్మరాజుగారి కుమారుఁడైన జగపతిరాజును తురుష్కులు చెఱలో నుంచిరన్నసంగతి తెలిసి, పూసపాటి పెదవిజయరామరాజుగారు విజయ నగరమునుంచినలువదివేలఫౌజునుగూర్చుకొనివచ్చి నూరుద్దీన్ హుస్సేను నెదిరించెను. అప్పు డుభయపక్షములవారికిని ఘోరసంగ్రామము జరిగెను. అట్లు మహోగ్రముగ యుద్ధము జరుగుచుండఁగా, విజయ రామరాజుగారి తురుపు అనకాపల్లి బోయలు అనెడుఫౌజు రెండువేల మంది నూరుద్దీన్ హుస్సేన్ఖానుఁడెక్కిన దంతావళముంబొదివి, దాని

పైనున్న యంబారీచుట్టుకొని మహమ్మదీయు లొకమూల నీటెలును బల్లెములుపుచ్చుకొని పొడుచుచున్నను. గొబ్బరిపుచ్చెల్లు తలలనూడఁ గొట్టుచున్నను వెనుకకుఁదియగక, తమ ప్రయత్నములనుండి మఱలక, యతిసాహసముతో నంబారీత్రాళ్లను త్రెంచివైచి నవాబును బట్టుకొని శిరస్సును ఖండించిరఁట! ఇదియేనిజమగుచో హిందువుల ధైర్యసాహసములు భూలోకమున శాశ్వతముగ నుండకపోవునా? అంతట తురకల సైన్యములు కదనరంగమునకు వెన్నిచ్చి తమపిక్కలదారుఢ్యమును జూపినవి! అటుపిమ్మట విజయరామరాజుగారు, జగపతిరాజును హవాలా చేసికొనియున్న సర్లష్కరునికి సరదారునికి బహుమానము లొసంగి యాచిన్నవానిని వానియొద్దనుండితపికొని విజయనగరము వెంటఁబెట్టుకొనివెళ్లి తమ యన్న కొమారుఁడైన ఆనందరాజుగారితోఁ గూడఁ బెంచుచు సంరక్షించుచుండిరి.

ఇప్పుడీ చెఱవిడిపించితెచ్చిన పెదవిజయరామరాజుగారి భార్యయైన చంద్రయ్యమ్మగారి కీజగపతిరాజు మేనగోడలి కుమారుఁడని వేఱొకచోట చెప్పఁబడినది. ఈ పెదవిజయరామరాజుగారు శ్రీ సార్వభౌమ తిమ్మరాజుగారి పరిపాలనమునఁ జెప్పఁబడిన శ్రీ పూసపాటి సీతారామచంద్రరాజుగారి మనుమఁడు. ఈయన, తండ్రిగారైన యానందరాజుగారి యనంతరమున రాజ్యమునకువచ్చి మన్నెదొరలను గెల్చి వారిదేశము లాక్రమించుకొని మన్నెసుల్తాను బిరుదమునువహించిరి. ఈయనయే తమపేరట విజయనగరమునుగట్టించి, తమ రాజధానిని పొట్నూరునుండి విజయనగరమునకు మార్చుకొనిరి. వీరు ౧౭౧౩వ సంవత్సరమునకు సరియైన విజయసంవత్సర విజయదశమీ జయవారమునాఁడు విజయనగరమునఁ గోటకట్టుటకు శంకుస్థాపనము

చేసినట్లు " ఆంధ్రకవులచరిత్రము " నుడువుచున్నది.

ఈ పెదవిజయరామరాజుగారి నగరున జగపతిరాజుగారు ఆనందరాజుగారితోఁ బెరుగుచుంటనుఁ దెల్పియుంటిమి. కాని యొక్కయింటనే పెరుగుచున్న యీ స్వాతంత్ర్యాభిలాషులగు రాజకొమారులకిరువురకును పొసఁగదయ్యెను. వీరిరువురు ప్రతివిద్యయందును నొకరినొకరు మించవలెనని ప్రయత్నించుచుండిరి. ఇరువురునుగూడ దేనియందును నొకరినొకరు తీసిపోయినవారుకారు. బాల్యక్రీడావినోదములయందు సయితము జగపతిరాజుగారొకపక్షమువహించిన ఆనందరాజుగారు వారికెదుటిపక్షము నవలంబించుచువచ్చిరి. తగరు కోడిపందెములలో సయితము జగపతిరాజుగారొకవైపు, ఆనందరాజుగారొకవైపు నుండుచువచ్చిరి. ఆనందరాజుగారి కానాఁటికానాఁడు వయస్సు వృద్ధియగుచున్నట్లుగనే జగపతిరాజుగారిపై నసూయకూడ నభివృద్ధియగుచుండెను. కాని ఆయనకు నిర్నిమిత్తముగ జగపతిరాజుగారిపై నుదయించిన యసూయాద్వేషము లేపోనియుంజేయక యప్పటికి మాత్రము నిష్ప్రయోజనములయ్యెను. వీరిరువురినిగుఱించిన యొక చిన్న యితిహాసముకలదు. అప్పటి యీక్షత్రియకుమారు లిరువుర మైత్రిసంబంధమెట్లుండినదియు భావించుటలో నియ్యది కొంతవఱకుఁ దోడ్పడునేమోయని దాని నీక్రిందపొందుపఱుచుచున్నారము.

ఒకానొకనాఁడు విజయనగరముకోటలోఁ గోడిపందెములుజరిగెనఁట. జగపతిరాజుగారికిఁ జరణాయుధములం బెంచుట యభ్యాసము నత్యంతప్రీతికరమునై యుండెను. తామెంతవఱకుఁ బెంచుచుండిన కుక్కుటమునే జగపతిరాజుగారు పందెముకట్టిరఁట. ఆనందరాజుగారాసమయమునకొక్క కుక్కుటమును పోటీకి తెచ్చి పందెమునకు వదలి

రట. ఇట్లొకకొంతతడవారెండుపుంజులును బోరాడినపిమ్మట జగపతిరాజుగారి కుక్కుటరాజమే గెలుపుగొనెనట. అంతట ఆనందరాజుగారోడిపోయినను అవిచారమును మోమునం దోపనీయక, యించుక నవ్వుచుం బరిహాసవచనములఁ « బెంపుడికోడియే గెలిచిన » దని జగపతిరాజుగారిని గేలిసేసిరట.

ఈ విధమున నానందరాజుగారి జగపతిరాజుగారి ననూయానేత్రమునం జూచుచువచ్చినను, చంద్రయ్యగారొకకంటను విజయరామరాజుగారొకకంటను ఆయనం గనిపెట్టుచు నొక కొఱంతయుం గలుగకుండ నంరక్షించుచుండిరి.

ఇట్లుండఁగాఁ బెద్దాపురసంస్థానమును గిరిగి నిలువఁబెట్టుటకై నితాంత ప్రయత్నములు జరుగుచుండెను. పెదవిజయరామరాజుగారికార్యమునుసాధించుటకై తమ ప్రధానామాత్యులైన బుచ్చాబుచ్చన్నగారితో స్థలమంత్రాంగములుచేసి యప్పుడమీర్‌దారుగానున్న «నీమత్ అలీని» మంచిమాటచేసికొని యతఁడెట్లో నప్పగించునట్లుచేసి యతనికి రూ౧౦,౦౦౦లు లంచమిచ్చి సఫలీకృత ప్రయత్నులైరి. పిదపనప్పటికి షోడశవర్ష ప్రాయులైయున్న వత్సవాయ జగపతిరాజుగారిని క్రీ. శ. ౧౭౮౯వ సంవత్సరమునఁదిరిగి తమ పితృపితామహార్జిత రాజ్యమునకుం బట్టాభిషిక్తులంజేసి పూసపాటి పెదవిజయరామరాజుగారు పెద్దాపుర సంస్థాన పునస్సంస్థాపనకర్తలై వినుతికెక్కిరని కొందరును యీయనయే తనభుజబలపరాక్రమములచేత మార్గమున నెన్నిచిక్కులు తటస్థించినను, ఎంతద్రోహముచేయించుటకు ఆనందరాజుగారెన్నించినను, విజయుఁడై, రాచవారిసాహాయ్యమున అప్పటిపరిపాలకుఁడైన మహమ్మదీయుని నయమునను భయమునను లోబరచుకొని రాజ్యాభిషిక్తుఁ

డమ్యోనని కొందరును జెప్పుచున్నారు. ఏదియెట్లున్నను స్వాతంత్ర్యేచ్ఛ గల మన జగపతిరాజుగారు తిరుగా సంస్థానమును, పోయినసంస్థానమును సంపాదించుట యెంతయు ప్రశంసనీయము.

## —: శ్రీ వత్సవాయ జగపతిరాజుగారు :—

(౧౭౪౯ — ౧౭౫౮)

శ్రీ వత్సవాయ జగపతిరాజుగారు బాల్యముననే తురుష్కుల చెఱలోనుండి కష్టములనుభవించి, పిదప పెదవిజయరామరాజుగారిచేతఁ గారాగార విముక్తిఁగొంది, తరువాత వారిచేతనే వారియింటనే పెంపఁబడి చిట్టచివరకు వారిసాహాయ్యము చేతనే తమ రాజ్యమునకుఁ బునరభిషిక్తులై క్రీ. శ. ౧౭౪౯ మొదలుకొని పాలించిరి. ఈయన దంతులూరి రామరాజుగారి తనూజయైన సీతమ్మగారినిఁ బరిణయమైరి.

వీరు రాజ్యమునకు వచ్చునప్పటికి ముస్తాఫానగరము, ఏలూరు, రాజమహేంద్రవరము, శ్రీకాకుళము, సర్కారులను జాఫర్ అలీయను నతఁడు పరిపాలించుచుండెను. జాఫర్ అలీ, తనక్రింద అమీన్ దారుగానున్న నీమత్ అలీ తనకు తెలియకుండ లంచమును గ్రహించి పెద్దాపురముసంస్థానమును తిరిగి వత్సవాయవంశీయులకిచ్చివేసెనని యాతనిపై మండిపడి, జగపతిరాజుగారినిసాధించి తిరిగి కోటను స్వాధీనపఱచుకొనవలెనని బలములంగూర్చుకొని పెద్దాపురముమీఁదకుదాడి వెడలెను. హిందూరాజులపై టోకోటు బూటకములనుసికొల్పి గెలుపుచుబట్టికొని గర్వోన్మత్తుఁడైయున్నమ్లేచ్ఛమదగజేంద్రమేడ! ధర్మానువర్తనుఁడైధర్మాయుధుఁడై సుగుణియై, దుర్జనభర్జన శిష్టరక్షణములు దైవనియత కర్తవ్యములుగభావించి, తృణీకృతశాత్రవుఁడై, నవీనయౌవనావేశసంవర్ధితధైర్య

శౌర్య సముత్సాహుఁడై, ప్రబలిన జగపతిక్షితినాథకంఠీరవం బేడ! అయినను లోతు దిగినంగాని తెలియదన్న సామెతననుసరించి జాఫర్ అలీ పెద్దాపురాధినాథునితో యుద్ధమునకుందలపడెను. కాని యాభూభుజ భుజపరాక్రమమునకు నిలువలేక వెన్నిచ్చి పాఱిపోయెను, నాటినుండి యు జగపతిరాజుగారు జాఫర్ అలీకిఁ బ్రక్కలోనిబల్లెమై, గుండెలు తల్లడమొనరించుచు, వాని పాలిటి కాలయముఁడై యుండిరి. ఆయన యన్న జాఫర్ అలీకి, హడలుగానుండెను., ఈ విషయమును లక్ష్మణ కవి ఇట్లు వర్ణించియున్నాడు.

సీ॥ కన్నులను గ్రాంధకారంబువలెఁ గ్రమ్మి
గట్టు పుట్టలు చెట్లు కాననీదు,
కలఁకఁ గుత్తుకఁ గొత్త గడుసు సంకిలి జోడు
హత్తిన గతి హజ్జ లాడ నీదు,
చెవులఁ దాళం బమర్చిన మాడ్కి బంధించు
లేమల మొఱ్ఱ లాలింప నీదు,
లలినాటియున్న గుండెలలోని గాలమై
యూర్పుల సడలింప నోప నీదు,

వత్సవయ జగపతి మహా వసుమతీశ
విజయ ధాటీ సమాటిక విజితవిముఖ
జాఫరలిఖానమానస స్తంభనప్ర
గల్భరూఢభయావేశగాఢతమము॥

అంతియగాక యీజాఫర్ అలీఖానునే వింధ్యపర్వతములకుఁ బాఱఁ దోలినట్లుగ నీక్రిందిపద్యము ఘోషించుచున్నది.

౹౹చ॥జగపతిరాజ సింహాకర సంభృత ఖడ్గఘటోద్భవుండుసాం
పుగ పరవాహినీశ్వర సముత్కట జీవనమెల్లఁ గ్రోలి నే
ర్పుగ ఘనరాజమండల నిరోధముఁజేసినజాఫరల్లి విం
ధ్యగిరిని నామశేషమగునట్టుగ నుంచె జగద్ధితంబుగన్॥

ఈ జగపతి రాజుగారిట్లమిత పరాక్రమవంతులై పాలించుచుండగా నీయుత్తర సర్కారులు ఫ్రెంచివారి స్వాధీనతకిక్రిందవచ్చెను. అది వారికెట్లువచ్చినదియుఁ దరువాత జరిగిన బొబ్బిలియుద్ధసంక్షోభమును గుఱించియు నిచ్చటఁగొంతవివరముగఁజెప్పుటసముచితముగనుండకపోదు.

క్రీ. శ. ౧౭౪౮లో నైజామ్ కుమ్రుద్దీన్ అసఫ్జా మరణమునొందెను. అతనిపిదప నైజాముపదవి నాక్రమించుకొనుటకై యతని ద్వితీయాత్మజుఁడు నాజరుజంగునకును, ఇతని మేనల్లుఁడైన మిర్జాఫాజంగునకును, బోరాటములుజరిగెను. ఈసుప్రసిద్ధకలహాములలో నాంగ్లేయులు నాజరుజంగుపక్షమునను, పరాసువారు మిర్జాఫాజంగుపక్షమునను వహించిరి. ఫ్రెంచివారీపైపోరాటమున విజయులైనను వారికిని ఆంగ్లేయులకును గలహములు తుదముట్టవయ్యెను. ఫ్రెంచివారు, హైద్రాబాదు సింహాసనమునఁ దమకు వశవర్తియైన మిర్జాఫాజంగునుంచినట్టుగనే, ఆర్కాటునకుఁగూడ నవాబుగఁ దమకనుకూలుఁడైనవాఁడున్న మంచిదనియెంచి, తమస్నేహితుఁడును, సహాయుఁడునైన చందాసాహేబున కాపదవికొసంగవలెనని ప్రయత్నించిరి. ఇట్టి ప్రయత్నములు జరుగుచుండఁగా కొద్ది సంవత్సరములక్రితమే యుత్తరసర్కారులనుండి ఆర్కాటునకు మార్చఁబడిన అన్వరుద్దీనును ౧౭౪౯లో ఆంగ్లేయులు నవాబుగ నంగీకరించి వానిపక్షము నవలంబించిరి.

ఈ యుద్ధములో మునిఁగితేలుచు, నాజరుజంగు, ఫ్రెంచివారి స్థానములైన మచిలీపట్నము, యానాములు నాక్రమించుకొనవలెసినదని యుత్తరముననున్న దనయుద్యోగీయులకుత్తరువిచ్చెను. అప్పుడు ఫ్రెంచిగవర్నరుగనున్న మాన్స్యూర్ డూప్లే మచిలీపట్నము ప్రాముఖ్యస్థలమనియు, దానిని తిరిగిసంపాదించకపోయినచోఁ దన దేశాభ్యుదయమునకు భంగము కలుగునని యూహించి, యచ్చటనున్న తమగిడ్డంగిని, నాపట్టణమును, తిరిగి పట్టుకొనవలసినదని కొంతసేనను బంపించెను. పంపినసైన్యము విజయమునొందుటయు నాయాప్రదేశములనున్న గిడ్డంగులపై ఫ్రెంచిబావుటానిలుపుటయుఁగూడ జరిగినది.

ఆ సంవత్సరాంతముననే, ఫ్రెంచివారును వారి సహాయులను నాజరుజంగుయొక్క సేనానివేశముంబొదవినప్పుడు, అతఁడు తాబేదారులచేతఁ గపటమున వధియింపఁబడెను. అతిక్షణమే ఫ్రెంచివారతని ప్రతికక్షియైన మిర్జాఫాజంగును, డక్కనుసుబాదారుగఁ జేయ పుదుచ్చేరికి వెళ్లిరి. అప్పుడచ్చటనొక గొప్పయుత్సవము జరిగెను. ఆ సమయముననే మిర్జాఫాజంగు మచిలీపట్టణమునకు చుట్టుపట్లనున్న పరిదేశమును, కృష్ణానదికి దక్షిణముననున్న మొగలరాజ్యములను కృతజ్ఞతాపూర్వకముగ ఫ్రెంచివారికొసంగెను.

మిర్జాఫాజంగు యీభోగమును జాలకాల మనుభవించియుండలేదు. అతఁడాయాతరుణములఁ దనకుఁ దోడ్పడుచుండుటకై కొంత ఫ్రెంచిసేనను తనదగ్గఱనుంచుకొన నిశ్చయించుకొనెను. అతనికోరిక ననుసరించి బుస్సీయొక్క సైన్యాధిపత్యము క్రింద ౩౦౦ ఆంగ్లేయులును ౨,౦౦౦ ఫ్రెంచిసిపాయిలును వచ్చుచుండఁగా వారికి స్వాగతమొసంగి హైద్రాబాదునకుఁ గొనిపోవు నుద్దేశ్యముతో గోలకొండకు బయలు

చేసెను. అతఁడు చాలదూరము ప్రయాణ మైపోకమునుపే తన సేనలలో రేగిన కలహమునణఁచుచుండఁగా నతఁడు వధింపఁబడెను.

అప్పుడు మొదటి నైజాముగు అసఫ్జాయొక్క తృతీయతనయుఁడగు సాల్బత్ జంగును, మాన్సూయర్ బుస్సీ మీర్జాఫా జంగుయొక్క యుత్తరాధికారియని ప్రకటించెను. ఆ తత్క్షణమే క్రొత్తసుబాదారు త్వరముగా ఔరంగబాదు పట్టణమున కతివైభవముతోఁ బోయి యటుతరువాత దానినే తనముఖ్యనివాసస్థానము చేసికొనెను.

బుస్సీ కొన్ని నెలలవఱకు సాల్బత్ జంగుతో నుండిన వెనుక, నతని శరీరారోగ్యము సరిగా లేకపోవుటచే మఱలస్వస్థతఁబొందుటకై సముద్రతీరస్థమగు మచిలీపట్టణమునకుఁ బోయెను. కాని యతఁడచ్చటఁ జాల కాలము నిలుచుటకు వీలు లేకపోయెను. నైజాముయొక్క దివానునకు బుస్సీయన్నను, ఫ్రెంచివారిసహాయమన్నను, మొదటినుండియుఁ గిట్టకయ్యెను. అందువలన బుస్సీ మచిలీపట్టణమున కరిగినప్పుడతఁడు తనయభిప్రాయములతో నేకీభవించువారితోఁగలిసి కుట్రలుపన్ని ఫ్రెంచివారి నుద్యోగములనుండి తొలఁగించి తరిమివేయఁ బ్రయత్నించెను. ఫ్రెంచివారియధికారము నైజామురాష్ట్రమున క్షీణించుచుండుట కనిపెట్టి శరీరాస్వస్థ్యమునకు లోఁబడియైనను తత్క్షణమే ఔరంగబాదునకు వెళ్లవలసినదని డూప్లెబుస్సీకి ఆజ్ఞాపించెను. ఆ యుత్తరువందిన వెంటనే యింకను దేహారోగ్యము కుదురుపడకపోయినను, నా సేనాధిపతి తక్షణమే యొక్కనిమిషమైన నాలస్యమొనరించక సముద్రతీరమును విడిచి హైదరాబాదునకు వెళ్లి అచ్చటనుండి ఔరంగబాదునకుఁ బోయి మొత్తముమీఁద 300 మైళ్లదూరప్రయాణముచేసెను. ఫ్రెంచివారు వచ్చుచున్నారని తెలిసి నైజాముయొక్క దివాను తాను లొంగి

పోయినట్లు తెలిపెను. నైజామును బుస్సీని నిజమైనప్రాగ్దేశీయవైభవముతోఁ బ్రవేశమిచ్చి యాదరించెను. దానితో వారి రాజీనామా పూర్తియయ్యెను. అంతట నైజామును, బుస్సీయును గొప్పయుత్సవముతో నగరునకరిగిరి. అప్పుడు కృతజ్ఞతాచిహ్నముగ నైజామ్ సాల్బట్‌జంగ్ పరాసువారిపక్షమున బుస్సీకి, సాధారణముగా నుత్తర సర్కారులని పిలువఁబడు సముద్రతీరస్థరాష్ట్రములను ధారవోసెను. అప్పటినుండియు నాసర్కారులమీఁదవచ్చు రివిన్యూవలననే ఫ్రెంచి సైన్యము పోషింపఁబడుచుండెను. ఆవిధమున ఫ్రెంచిసైన్యపోషణార్థమై ౧౭౫౨లో కొండవీడుపరగణాయును, ౧౭౫౩వ సంవత్సరమున ముస్తాఫానగరము, ఏలూరు, రాజమహేంద్రవరము, శ్రీకాకుళము పరగణాలును ఫ్రెంచివారి యధీనముక్రిందకువచ్చెను.

అంతట బుస్సీ, నైజాముచేఁ గ్రొత్తగానొసంగఁబడిన యీపరగణాలను తక్షణము బయలుదేఱివెళ్లి స్వాధీనపఱుచుకొనవలసినదని మచిలీపట్టణమందున్న ఫ్రెంచి యున్నతోద్యోగియగు మాన్స్యూర్ మొరాసిన్ అనువానికుత్తరవుసేసెను, ఫ్రెంచివారి యధికారమును స్థాపించుటయందతని కవసరమైనయెడల నుపయోగపడఁగలదని ౧౫౦ మంది మ్లేచ్ఛులును ౨౫౦౦లమంది సిపాయిలును గల సైన్యమాతనికి సహాయముగనరిగెను.

ఈ కడనుజెప్పఁబడిన నాల్గు పరగణాలకును గవర్నరుగా నున్న జాఫర్ అల్లీఖాఁ ఫ్రెంచివారిపైఁ దిరుగఁబాటుచేసి, వారికెట్టులైన నీ పరగణాలను స్వాధీనపడకుండ చూడవలెనని ప్రయత్నించెను. ఇతఁడింతవఱకు శ్రీకాకుళము పరగణాలోనున్న జమీందారులలోఁ బ్రముఖుఁడైన విజయనగరమురాజగు పెదవిజయరామగజపతిగారితో యుద్ధ

మొనరించుచుండెను. ఆయనకూడ ఫ్రెంచివారికీపరగణాలను స్వాధీనపడకుండ చేయవలెనను తలంపుగలవాఁడగుటచేత జాఫర్ ఆలీ ఆయనతో సంధిచేసికొనెను.

ఇట్లాయనతో సంధిచేసికొని యితర జమీన్దారులనుగూడ తమపక్షమునఁ జేరి తమయుద్యమమునకుఁ దోడ్పడవలసినదని ప్రోత్సాహపఱచెను. ఈజాఫరల్లిచేతఁ బురికొల్పఁబడినవారిలో బొబ్బిలిజమీందారులగు రంగారావుగారొకరు. ఈవఱకుఁ దమకును దమకును విరోధములున్నను ఫ్రెంచివారిని దేశమునుండి వెడలనడపవలెనన్న యుద్దేశ్యముతోఁ బూర్వవైర్యములను గట్టిపెట్టి బొబ్బిలి సంస్థానాధీశులగు రంగారావుగారు జాఫరల్లితోఁగూడియున్న విజయనగర ప్రభువులగు విజయరామరాజుగారితోఁ గలియుటకంగీకరించి వచ్చిచేరిరి. అప్పుడు వీరందఱును ఫ్రెంచివారి నెదిరించుటకు తమతమ సైన్యముల నొక్కటిగాఁగలిపిరి. కాని రాజమహేంద్రవరము, శ్రీకాకుళము సర్కారులను అసలువానికివచ్చు శిస్తుకన్న తక్కువ కౌలుకిచ్చెద నని చెప్పి మొరాసిన్, విజయరామరాజుగారిని జాఫర్ అలీఖానునుండి విడదీసి తమపక్షమునఁ జేరునట్లుచేసికొనెను.

ఆవిధమున నారెండుసర్కార్లను మొరాసిన్ విజయరామరాజుగారికిచ్చుట తమస్థితికి క్షేమముకాదనియాలోచించి కనుఁగొని రంగారావుగారు ఫ్రెంచివారి కుద్వాసనచెప్పువిషయమున దీక్షనువహించి, యాయుద్యమమునఁ దామొక ప్రధానపాత్రమునుగైకొనిరి.

జాఫరల్లీఖానుఁడు క్రొత్తగావచ్చిచేరిన తనస్నేహితుఁడైన విజయరామరాజుగారిచేత నంతిత్వరితముగను నంతసులభముగను విడనాడఁబడుటఁగాంచి తక్షణమే దేశమునువదలిపెట్టి పశ్చిమముగానరిగి, తా

నిప్పుడువదలిపెట్టిన దేశమును గొల్లఁగొనుటలోఁ దనకుసాయపడవలసిన దని మహారాష్ట్రులనుబిలిచెను. వారును అందులకంగీకరించి, యొక గొప్ప సైన్యముతోబయలుదేఱివచ్చి కూర్పుకనుమలనుదాఁటి శ్రీకాకుళము రాజమహేంద్రవరము పరగణాలగుండా దోచుకొనుచుఁబోయి తుదకు ఏలూరువద్దనుండి తమదేశమునకేగిరి.

తెలఁపనితలంపుగఁగలిగినట్టియు, హానికరమైనట్టియు నీకండమూత్రింగుఱించి విన్నవాఁడై, బుస్సీస్వయముగా ౧౭౫౮వ సంవత్సరము జూలై నెలలో మచిలీపట్టణమునకు వెళ్లి అటనుండి అగష్టు నెలలో, మహారాష్ట్రులు దండయాత్రచేసిన కాలమునరేగిన యల్లరులనణఁచుటకును, దమకు నూతనముగానొసంగఁబడిన పరగణాలపరిపాలనా విధానమును జక్కఁబఱచుటకును, నాలుగుపరగణాలకు మధ్యస్థముగానున్న రాజమహేంద్రవరమునకుఁ బోయిచేరెను. మహారాష్ట్రులును దాము దోచుకొన్న దోపిడితో సంతృప్తిచెందినవారై స్వరాజ్యమునుఁ దిరిగి సంపాదించుకొనుటయందు జాఫర్ అలీ, కిఁక నేమాత్రము సహాయము చేయక మిన్నకుండిరి. అందువలన జాఫర్ అలీ ఆశాపహతుఁడయ్యె ననియు, నందువలన నతనిచేఁ దమకేముప్పును రాదనియునమ్మి బుస్సీ ఔరంగబాదునకువెళ్లెను. అటుతరువాత నతఁడు నైజామ్ మైసూరు మీఁదకు దాడివెడలినప్పుడును, అతనినిమహారాష్ట్రులును, సావనూరు నవాబును నెదుర్కొనినప్పుడును, ఆతనికిఁ దోడైనిలిచి మఱవరాని సాహాయ్యమునొనరించెను.

దివానుగానున్న హసనవాజ్‌ఖానును, నింతవఱకు రాజమహేంద్రవరము మొదలైనపరగణాలకు గవర్నరుగానున్న జాఫర్‌అలీఖానును, ఇరువురుఁగలసి బుస్సీ ఔరంగబాదులో లేనిసమయముఁజూచి యతని

మీఁద కొండెములనుజెప్పి నైజాము మనసువిరిచిరి. తనయౌన్నత్యమునకంతకును గారకుఁడీ బుస్సీయే యైనను, అతనిని, ఘోరించి సైన్యములను ద్వేషించుచు వారల నెట్లైన నైజాము కొలువునుండి తొలఁగించి, యింగ్లీషువారిని రప్పించవలెనను నభిప్రాయముతో షానవాజ్ ఖాన్ నైజాముతో బుస్సీపైనున్నవికొన్నియు, లేనివికొన్నియు, గోరంతలు కొండంతలుచేసియుంజెప్పి కృతఘ్నుఁడను నపవాదమునకుఁ బాత్రుఁడయ్యెను. అంతట నైజామును వారు వంచించినవన్నియు సత్యములని నమ్మి వారిప్రోత్సాహమున ఘోరించివారిని తన కొలువునుండి తొలఁగించెను. ఇది ౧౭౫౩వ. సంవత్సరము మేనెలలో జరిగెను. ఇంతటి మహాపరాభవానలముచే సంతప్తమానసుఁడయ్యు, బుస్సీ తన మనస్థైర్యమును విడనాడక, శత్రువులు తమ్ము వెంటాడించి వచ్చుచున్నను హైదరాబాదు దగ్గర తనకున్నకొద్దిసైన్యముతో శత్రువునెదిరించనిల్చెను. అచ్చట్లు తనస్థానమును గాపాడుకొనుచు, శత్రువు దరికిఁ జేరనీయకుండ కొట్టుచు నతితీవ్రముగ యుద్ధమొనరించుచు, మూఁడుమాసములుగడిపెను. అప్పటికతనికి మచిలీపట్టణమునుండి సైన్యములువచ్చెను. వాని సహాయ్యముతో శత్రువులను జయించి నైజామువద్దఁ దనయుద్యోగస్థానము నాక్రమించుకొనెను. అప్పుడతఁడీవఱకుఁ దనపై కుట్రలుపన్ని కొండెములుచెప్పి తనకుసేనతోఁ దన్నెదిరించిన షానవాజ్ ఖానును గూడ తొలగించఁడయ్యెను. ఈ వఱకు వలెనే నైజాము తరువాత నతనియంతటివాఁడై యధికారము నెఱపుచుండవలయునని యతనికోరికగనుక బుస్సీ దానిని నెఱవేర్చుకొనుటకై తాను నైజాముచేతఁ దొలఁగింపఁబడినప్పటినుండియుఁ బ్రయత్నించి తుదకు సఫలీకృతప్రయత్నుఁడయ్యెను. నైజాము సాలబత్ జంగు

౧౭౫౬వ సంవత్సరము అగష్టు ౨౦ తేదీని బుస్సీని అతని పూర్వగౌరవములను బిరుదములను నాతనికి మఱలనొసంగి సన్మానించి యతివిభవముతో పూర్వస్థానమునందతనినుంచెను. యింతకు పూర్వము సంభవించినట్టి యపాయము ముందీక నెప్పుడును గలుగకుండున ట్లేర్పాటులు చేయుచు బుస్సీ ౨౬వ అగష్టు మొదలుకొని ౧౬వ నవంబరు వఱకు హైద్రాబాదులోనుండెను. పిదప సీ౧౬వ తేదీనే తన యధికారమును పునఃస్థాపన మొనరించుటకై ౫౦౦ యూరోపియనులను. ౪,౦౦౦ల సిపాయిలను దీసికొని సర్కారులకుఁ బయనమయ్యెను, ఔరంగాబాదునకు వెళ్లఁదలఁచిన సాలబత్ జంగ్ నకు ౨౦౦ల యూరోపియనులను, ౫౦౦ల సిపాయిలను నొక విశ్వాసపాత్రుఁడైన యుద్యోగియుని క్రింద నుంచి తోడితెచ్చెను.

బుస్సీ, హైదరాబాదులో యుద్ధమొనరించుచున్న కాలమున సర్కారులలోఁ గొన్నికలహములు రేఁగెను. అందువలన నా సమయమునఁ దమపక్షముననుండి విశ్వాసము గనఁబరచిన జమీందారులను బహుమానించుటకును, కలహములు రేప బ్రోత్సాహమిచ్చిన నాయకులనుగాని, కలహకారకులైన జమీందారులను గాని శిక్షించుటకును బుస్సీ సర్కారులకు రావలసివచ్చెను. అతఁడట్లు ౧౬వ నవంబరున హైద్రాబాదులోఁ బయలుదేఱి బెజవాడ, ఏలూరుల మీఁదుగా ౧౯వ డిశంబరునకు రాజమహేంద్రవరము వచ్చిచేరెను. ఈవఱలో బుస్సీ రాజమహేంద్రవర శ్రీకాకుళముల కధికారిగా ఇబ్రహీమ్‌ఖాను అనువాని నియమించెను. కాని హైద్రాబాదున యుద్ధము జరుగుకాలమున ఇబ్రహీమ్‌ఖాను ఘోరించివారి యధికారమునుద్రోసిపుచ్చి తాను స్వతంత్రుఁడై పాలించుచుండెను. ఇప్పుడు బుస్సీ వచ్చుచున్నాఁడని

తెలియుటతోడనే యతఁడు దేశమునువిడిచి పాఱిపోయెను. ఇంతవ ఱకు ఫ్రెంచివారికిలోఁబడి వారియెడల విశ్వాసముగలవాఁడై యుండిన పూసపాటి విజయరామరాజుగారు పదివేల స్వసైన్యముతోను చాల మంది జమీందారులతోను బుస్సీని గలుసుకొని యతనికి స్వాగత మొసంగ రాజమహేంద్రవరమున కరుదెంచిరి.

“తమదేశమునుండి విజయనగరరాజ్యములోనికిఁ బ్రాఁకు కొండకాలువలనుమళ్లించి బొబ్బిలిరంగారావుగారి కాపులు తమభూము లకుఁ బెట్టుకొన్నందునను, దేశస్వభావమునుబట్టి బొబ్బిలివారిని సాధిం చుట యసాధ్యముకాకపోయినందునను, విజయరామరాజుగారు మన స్సులో బొబ్బిలి రంగారావుగారిపై ద్వేషమువహించి యాయనను శిక్షిం చుటకై బుస్సీని తన యావచ్ఛక్తిని వినియోగించి బహువిధములఁ బ్రోత్సాహపఱిచి పురికొల్పెను. అందుమీఁద బుస్సీగారు బొబ్బిలి రాజ్యమును విడువవలసినదనియు, దానికిబదులుగా నధికమై శౌల్యమును మూల్యమునుగలదేశ మియ్యఁబడుననియు, రంగారావుగారికి వ్రాసిరి. రంగారావుగారు పితృపితామహాగతమైన బొబ్బిలిరాజ్యమును విడచుట కంగీకరింపకపోవుటయే కాక తక్కిన సంస్థానాధిపతులతోడిపాటుగా రాజ మహేంద్రవరమునకువచ్చి యాతనిని సందర్శింపకపోయెను” రాజమ హేంద్రవరమునకు విజయరామరాజుగారును తక్కినరాజులును వచ్చు టనుగుఱించియు, బొబ్బిలిరంగారావుగారు రాకపోవుటను గుఱించియు ౧౭౬౦ వసంవత్సరప్రాంతములందున్న దిట్టకవినారాయణకవికృతమగు రంగరాయచరిత్ర మిట్లు వర్ణించుచున్నది.

“ఉ॥ పాయని వేడ్క విశ్వపర పాయకరాయుత బాహుశౌర్యులా
పాయకరాయఁడుం గిమిడిపట్టణపుం బృథివీశ్వరుండు నా

రాయణదేవ్రుఁడున్ నరసరాజు మఱింగొలుగొండ మన్నెపున్
రాయఁడు నాదిగాఁగల ధరావరులందఱువచ్చిరత్తఱిన్ ॥

క॥ ఉద్ధతులముల్కు సంగర్యనోత్సుకత్వ
మాత్మఁ జిట్టాడనాడాడ నలరుమన్నె
దొరలువచ్చిర మానుషగోఃప్రసంగ
కలితుఁడగు రంగరాయఁ డొక్కరుఁడు దక్క ॥

సీ॥ నిజభుజాదండనిర్ణిద్ర కోదండంబు
గాండీవకార్ముక క్రమముఁజూపఁ
జరమభాగస్ఫురచ్ఛుభముల తూణీరముల్
కవదోఃసొంపు సంఘటిలఁజేయ
నాసీరముఖరనానాశంఖికధ్వనుల్
దేవదత్తారవోద్వృత్తిఁ దెలుప
నూరెలఁబరతెంచు జులుమతతేజీలు
ధవళాశ్వముల మస్తుద్రస్తరింప

గీ॥ కలియుగార్జునుఁడౌర యీఘనుఁడటంచుఁ
దనుజగర్జనమెన్న నుద్ధతులముల్కు
వీక్షణాపేక్షనేతెంచె విజయరామ
రాజరాడస్య లోకమార్తాండమూర్తి॥

* * * * * * *

చ॥ నలువదివేలకాల్బలము నాలుగువేల తురంగమంబులున్
నలువదియొంబ దేనుఁగుల నంతములైన శతఘ్నికాచయం
బులు నొకవేయి లొట్టియలపూర్వవిభావిభవంబుఁ దెల్పుచున్
గొలువ పరాసుతేనిఁ గనుఁగోఁ జనుదెంచెను రాజతిర్వరల్ ”

ఈ కడపటి పద్యమందు విజయరామరాజుగారు నలుపదివేల కాల్బలముతో వచ్చినట్లు చెప్పఁబడుచున్నను, ఆయన వెంట నిజముగా వచ్చినసేన పదివేలు మాత్రమేయని యాంగ్లేయచరిత్రకారుఁడైన ఆర్మ్ దొరగారు వ్రాసియున్నారు. "ఇట్లుండఁగా రంగారావుగారి యనుమతిమీఁదనే బుస్సీదొరగారు కొంతమంది సిపాయీలను బొబ్బిలి రాజ్యముమీఁదుగా మఱియొకచోటికిబోవుటకుఁ బంపిరి. విజయరామ రాజుగారి తంత్రమువలననో రంగారావుగారి బుద్ధిపూర్వకమైన యేర్పాటువలననో పంపఁబడిన సిపాయీలు త్రోవలో బొబ్బిలిభటులచే నెదిరింపఁబడి ముప్పది ప్రాణములను గోలుపోయి మరలి రావలసిన వారయిరి. ఈ యవమానము విజయరామరాజుగారి ప్రోత్సాహ మునకు తోడుపడఁగా, బుస్సీగారు రంగారావుగారిని శిక్షించి వారిని కుటుంబసహితముగా బొబ్బిలినుండి వెడలఁదోలుటకు నిశ్చయించుకొనెను. ఇన్నూటయేఁబండ్రు గుఱ్ఱపురౌతులను నాలుగు ఫిరంగులనుగల ౭౫౦ యూరోపియనులతోను విజయరామరాజుగారి భటులును సిపాయీ లును గలిసిన ౧౧౦౦౦ స్వదేశీయ పదాతిబలముతోను బుస్సీగారు బొబ్బిలికోటమీఁదికి దండువెడలిరి." ఈ యుద్ధమున కనేకులు రాజులు ఫ్రెంచివారి పక్షమునవలంబించియున్న విజయరామరాజుగారికి సాహా య్యార్థ మేగుదెంచిరి. రంగరాయచరిత్ర మీవచ్చినరాజుల నిట్లు పేర్కొనుచున్నది.

సీ॥ పాలుపొందఁ గాకర్లపూడి జగన్నాథ
రాజుగారొకకొంత ఫౌజుతోడ
సత్యవరపుపుర స్వామియానలరామ
భద్రరాజొకకొంత బలముతోడ

ఘనయశోనిధిముఖీ కాశీపతిక్షమా
ధవమౌళి యొకకొంత దళముతోడ
నలఘువిక్రముఁడు జింతలపాటినీలాద్రి
రాజుగారొకకొంత ఫౌజుతోడ
గీ॥ విజయరామరాజక్షమా విభునిమౌళి
నేత్రిపర్వంబొనర్చిరి నిజభుజాభు
జంగరసనాయమాన ప్రచండనిశిత
మండలాగ్రప్రభావళుల్ మెండుకొనఁగ ॥

ఈ పైనఁజెప్పిన రాజన్యులే కాక, పెద్దాపురసంస్థానాధీశులైన వత్సవాయి జగపతిరాజుగారుకూడ, విజయరామరాజుగారు తమకొనరించిన యుపకారమును, మేలునాలోచించి కృతజ్ఞతాసంబద్ధులై సంగరరంగమున కేగిరి. వీరిరాఁకను రంగరాయచరిత్రకృతికర్తయగు దిట్టకవి నారాయణామాత్యుఁ డిట్లు వర్ణించియున్నాఁడు.

శా॥ శ్రీరంజిల్లుకడాని పైడిజలతారీమాహురీకెంపుటం
బారీయేనుఁగునెక్కి పెక్కులు మదేభంబుల్ దనుంగొల్వరాఁ
గారూఢిన్ జతురంగ సైన్యములతో గర్జిల్లుచున్ వత్సవా
యీరాయప్రభుమౌళివచ్చెఁగను రాజీక్షించి హర్షింపఁగన్ ॥

హైదరాబాదువద్ద జరగిన యుద్ధములో ఫ్రెంచివారియొక్క సత్తువను దెలిసికొన్నవాఁడగుటచేత జాఫర్ అలీఖాన్ బొబ్బిలివారికి సాయపడరాఁడయ్యెను.

౧౭౫౭వ సంవత్సరము జనేవరి నెలలోనే మన దేశమునందలి బిక్షుకులచేత నిరంతరము గానముచేయఁబడుచు ప్రసిద్ధిపడసిన బొబ్బిలి

యుద్ధము జరిగినది. ఆ మహాయుద్ధమున వెలమదొరలగు రావువంశీయులును, వారిసైన్యములును జూపిన యత్యంతశ్లాఘాపాత్రములగు ధైర్యశౌర్యసాహసపరాక్రమాది విషయములును, విజయరామరాజుగారు తాండ్రపాపయ్యచే నిహతులైన సంగతియును, మన తెలుఁగు దేశమునందలి జనసామాన్యమునకుఁ దెలియనివికావు.

అటుపిమ్మట నీసంగతి విజయనగరములోనున్న చంద్రయ్యగారికి తెలియఁగా నామె తానిఁక జీవించుట వ్యర్థమనియు, బ్రతికియుండఁదగదనియుఁ జెప్పి సహగమనమునకుఁ బోయెదనని ప్రయాణముకాఁగా, నామె బావగారి కొమారుఁడు ఆనందరాజుగారువచ్చి సహగమనము చేయునెడల నన్నువధియించి మఱియుఁబోవలసినదని చెప్పి యామె నట్టి కేల కార్యప్రయత్నమునుండి మఱలించెను. తన పినతండ్రిగారితో బుస్సీగారు చేసిన యేర్పాటులాయనకు సంతృప్తికరముగ నుండకపోవుటచేత ఆనందరాజుగారు ఫ్రెంచివారిని దేశమునుండి వెడలఁగొట్టి వారికి బదులుగా నాంగ్లేయులను రప్పించవలెనని యోచించి కలకత్తాలోను, చెన్నపట్టణములోనునున్న ఇంగ్లీషువారికి, ఉత్తరసర్కారులపై దండెత్తి వచ్చినచో తనశక్తియందున్న సాహాయ్యమును దాను చేయుదునని చెప్పి యుత్తరములు వ్రాసెను.

బుస్సీ శ్రీకాకుళము పరగణానుండి ౧౭౫౭వ సంవత్సరాంతమున రాజమహేంద్రవరమున కరిగెను. అటనుండి యౌరంగబాదునకుఁ గొన్నితొందరలుగలుగుటచే నక్కడకుఁబోవలసినవాఁడయ్యెను. అతఁడౌరంగబాదుననున్నసమయముననే హిందూదేశమునందలి ఫ్రెంచిస్థానములకు గవర్నరుజనరలుగావచ్చిన మాన్స్యూర్ లాలీ, యతనినిఁ గర్నాటకమునకుఁ బోవలసినదని యాజ్ఞాపించెను. అతని యాజ్ఞాను

సారముగ బుస్సీ ఔరంగబాదునుండి బయలుదేఱి తన సైన్యముతో మచిలీపట్టణము దాపునకువచ్చెను. కృష్ణానదిమీఁదనున్న రెయ్యూరు వద్ద బుస్సీఁ తనకు బదులుగావచ్చిన యుద్యోగియఁగు మార్క్విస్ డికాఁఫ్లాన్స్ అనువానికి ౧౭౫౮వ సంవత్సరము అగష్టు ౯వ తేదీనిఁ దన సైన్యాధిపత్యమును, ఉత్తరసర్కార్ల పరిపాలనాధికారమునుగూడ నొప్పగించి, కర్నాటకమునకు వెడలిపోయెను.

ఔరంగబాదునకుఁ బోవుటకై బుస్సీ యెప్పుడు రాజమహేంద్రవరము విడిచెనో, యప్పటినుండియు ఆనందరాజుగారు చేసినపనులు ఫలోన్ముఖములుకాఁజొచ్చెను. బంగాళమునుండి కల్నల్ ఫోర్డు అను నతఁడు ౫౦౦ల యూరోపియనులును, ౨,౦౦౦లమంది సిపాయిలును, ౧౦౦మంది ఓడకళాసువాండ్రునుగల సైన్యముతో బయలుదేఱివచ్చెను. ఈవచ్చిన ఇంగ్లీషుసైన్యము నవంబరు ౧వ తేదీని విశాఖపట్టణమునుండి పయనమైపోయి ఖాసింకోటవద్ద ఆనందరాజుగారిని కలుసుకొనెను. ఆనందరాజుగారాసైన్యముతోఁగలిసి, తిన్నదిరించుటకై రాజమహేంద్రవరమువద్ద సైన్యసమేతులై వచ్చియున్న ఫ్రెంచివారిని గలిసికొనఁ నేగెను. అప్పుడానందరాజుగారికిని ఇంగ్లీషువారికిని నొకయొడంబడిక జరిగెను. ఆ యొడంబడికప్రకారము ముందు జయింపఁబడఁగల దేశమంతయు నానందరాజుగారికి రివిన్యూవసూలుచేసికొనుటకిచ్చుటకును, రేవుపట్టణములును, నదీముఖద్వారమునందున్నపట్టణములును వానితోఁ జేర్పఁబడిన జిల్లాలయాదాయముతో ఇంగ్లీషువారికిచ్చివేయఁబడుటకును, ఆనందరాజుగారు నెలకు రు ౫౦,౦౦౦లు సైన్యవ్యయముక్రిందను, రు ౬,౦౦౦లు యుద్యోగియుల ప్రత్యేక వ్యయములక్రిందను నిచ్చుచుండుటకును, ఆనందరాజుగారిగాని ఇంగ్లీషువారిగాని

స్వాధీనమునందున్న దేశముల నొకరికమ్ముటగాని యిచ్చివేయుటగాని యుభయుల యంగీకారముమీఁదనే జరుగుటకును నేర్పాటుకావింపఁబడెను. పిమ్మట నాయుభయులును, దమతమసైన్యముల నొక్కటిగాఁ జేర్చి ప్రయాణమైరి. ఆ యుభయుల సైన్యములకు డిశంబరు 3వ తేదీని శత్రుసేనలు గొల్లప్రోలువద్ద విడిసియుండుటఁ గానవచ్చెను. కాన్ ఫ్లాన్సు అనునతఁడు శత్రుసైన్యమునకు సేనాధిపత్యమునువహించెను. అతని సైన్యమున ౫౦౦లమంది యూరోపియనులును, ౬,౦౦౦లమంది సిపాయిలును, ౫౦౦లు దేశీయగుఱ్ఱపుదళమును, చాలమంది స్వదేశ సైనికులును యుండిరి అంగ్లేయులవైపు ౪౭౦మంది యూరోపియనులును, ౧,౯౦౦ల మంది సిపాయిలు నుండిరి. ఇదియునుంగాక యానంగజపతిరాజుగారు ౫౦౦లమందిగుఱ్ఱపుదళముతోను, ౫,౦౦౦ల మంది కాల్బలముతోను మరికొంద ఱీఁటెకాండ్రతోను విలుకాండ్రతోను సహాయముగనే తెచ్చిరి డిశెంబరు ౭వ తేదీని ఆంగ్లేయులు, శత్రువునకు నాలుగుమైళ్లదూరముననున్న చేఁబోలుగ్రామము నాక్రమించుకొనిరి. ఉభయపక్షముల సేనాధిపతులునుగూడ పరసైన్యమొకయుద్ధండముగవచ్చినను తమ్మురక్షించుకొనుచు శత్రువులనెదిరించి యుద్ధముచేయుటకుఁ దామాక్రమించుకొన్నస్థలము మిక్కిలి వీలుగా కుదిరినదని తమ స్థానములను గదలక మూఁడు దినములవఱకు నిలిచిపోయిరి. ఆంగ్లేయ సేనానాయకుఁడుకుడిచేతిమీఁదుగాఁ బర్వతప్రాంతములకుఁబోయి ఘోరించివారికి వెనుకనున్న రాజమహేంద్రవరమునకుఁ బోవు రాజమార్గమునుబట్టుకొని యావిధమున శత్రువు నోడించుటకుఁ బ్రయత్నించిన బాగుగనుండుననితలంచి డిశెంబరు ౯వ తేదీ యుదయమునఁ బైలుదేఱి చేఁబోలుకు మూఁడు మైళ్లదూరమున నున్నట్టి

కుందూరు లేక చందుర్తి గ్రామమునకు రాగంటకు వచ్చిచేరెను. ఇప్పుటికిని ఆంగ్లేయసైన్యమునకును పరాసుసైన్యమునకును నాలుగు మైళ్లేయెడమకలదు. కాని ఆంగ్లేయసైన్యమునకు వ్యూహమువన్నుటకు మునుపటికన్న నీస్థలమే మిక్కిలి యనుకూలముగఁ గుదిరియుండెను. ఆంగ్లేయస్కంధావారమునకును, పరాసుశిబిరములకునునడుమ (ప్రస్తుతము పాడుపడిన) వోదులపెంట గ్రామముకలదు. దాని నాక్రమించుకొన్నయెడల స్వరక్షణమునకేమి, శత్రువునెదిరించుటకేమి మిక్కిలి యనుకూలమైన స్థలముగానుండుననియు దానిని బట్టుకొనుటకే ఫోర్డు కదలివచ్చుచున్నాఁడనియు నూహించి పరాసుసేనానాయకుఁడైన కాన్ఫ్లాన్సు తానున్నస్థలమునుండికదలి పరసైన్యాగమనమును నిరోధించ నేగెను. ఫోర్డుమాత్రము తానున్నస్థలమునుండి కదలక, శత్రుచలనమునుబట్టియే తన వ్యూహమును జక్కఁబఱచుకొను నుద్దేశ్యముతో నాగిపోయెను. అతఁడాగిపోవుటకుఁ గారణము సైన్యముయొక్క బలహీనతయు, భయమునేఁగాని తదితరకారణము లెవ్వియుఁ గావనియు, తిరిగి యింగ్లీషువారు తమపూర్వసేనానివేశమైన చేఁబ్రోలునకు మఱలి పోవనున్నారనియుఁదలంచి కాన్ఫ్లాన్సు తనసైన్యమును ముందుకు వేగిరపడినడపించెను. ఇప్పుడుభయసైన్యములు ముఖాముఖి నొండొంటిం డీకొనినవి. ఇచ్చట నిరువాఁగులవారికిని గొప్పసమరముజరిగెను. ఆ సంకులసమరమున కల్నల్ ఫోర్డుయొక్క బుద్ధికుశలతచేత నాంగ్లేయులకే విజయము చేకూరెను. ఈ యుద్ధమున ఫ్రెంచివారివైపు ఆఱుగురుద్యోగీయులును, డెబ్బదిమంది జనులును చనిపోయిరి. దాదాపుగఁ జనిపోయినంతమందిజనమును ఖైదీలుగఁ బట్టుకొనఁబడిరి. ఇఁకనాంగ్లేయులవైపు నొక యుద్యోగియుఁడును, పదునేనుగురు జనమును నష్ట

పోయిరి. కొద్దిమందికి గాయములు తగిలెను. పరాసుసేనానాయకుఁడైన కాక్ ఫోన్సు, యుద్ధరంగమునుండి రాజమహేంద్రవరమునకు నలువదిమైళ్లదూరమున్నను గుఱ్ఱపుస్వారీమీఁద నర్ధరాత్రమునకు వచ్చి చేరెను.

ఈజిల్లాలో జరిగిన యుద్ధములలో నిదియే ముఖ్యమైనది. దీనిని బట్టి ౧౭౫౮ వ సంవత్సరమువఱకు ఫ్రెంచివారి స్వాధీనములోనున్న యుత్తరసర్కారులు ఆంగ్లేయులవశమాయెను. ఈజిల్లాయందాంగ్లేయుల యధికారము స్థాపితమగుటయు సంభవించినది. ఈ యుద్ధమును ప్రజలు మొన్నటివఱకు సంస్మరించుచు భీతిల్లుచునే యుండిరి.

౧౭౫౮ వ సంవత్సరమున నైజాము రాష్ట్రమునుండి రోహిలాలు దండెత్తివచ్చుచున్నప్పుడు ప్రజలంగాకూడ తమపోయిన రాష్ట్రమునుదిరిగి సంపాదించుకొనుటకై పరాసువారిని ఖ్యాతములగు సైన్యములను గూర్చుకొని వచ్చుచున్నారనియెంచి తలపోయుచువచ్చిరి.

ఓడిపోయిన పరాసుసైన్యమునేక మార్గములంబట్టి రాజమహేంద్రవరము వచ్చి చేరెను. కల్నల్ ఫోర్డు తక్షణమే ౧౬౦౦ లమంది సిపాయిలను ముందుగాబోయి రాజమహేంద్రవరదుర్గము నాక్రమించుకొనవలసినదని ప్రయాణముచేసి పంపి తాను వెనుకనుండి బైలుదేఱెను.

తమవైపు వచ్చుచున్నది యొకసైన్యవిభాగమని యెఱుంగక యొకమహాసైన్యమనితలంచి కోటలోనున్న ఫ్రెంచివారు తమ్మురక్షించుకొనుటకుఁ జాలినంత మూలములను లేకపోవుటచేత దుర్గమును విడిచిపెట్టిరి. చాలమంది యూరోపియనులొక పడవనెక్కి గోదావరినదినిదాఁటుటకై ప్రయాణమైపోయి నదీమధ్యమునసుండిరి. చాల

పడవలు మందుగుండు సామానుతోనింపి గోదావరి మూలలియొద్దను జేరుకొనెను. అప్పుడింగ్లీషువారు రాజమహేంద్రవరదుర్గము నాక్రమించుకొని కోటగోడలమీఁదను గోదావరిచెంతయొద్దను మందుగుండు సామానుతో నున్నవారిపై నగ్నివర్షమును గురిపించసాగిరి. దాని వలన నవతలిగట్టునుండు శత్రువులు తమమందుగుండు సామానును దీసికొని పోవుటకుఁగాని, యచ్చటనిలిచి యుండుటకుఁగాని వీలుకలుగదయ్యెను. కొంత మందుగుండు సామానుతోను, మఱికొన్ని యుద్ధోపకరణములతోను రాజమహేంద్రవరము కోటలోనున్న పరాసుసేనకు యూరోపియనులు ఖైదీలుగఁ బట్టుకొనఁబడిరి. అప్పుడు మిగత సైన్యవిభాగమునుదీసికొని కల్నల్ ఫోర్డు రాజమహేంద్రవరము వచ్చిచేరెను. ఆనందగజపతి రాజుగారును వారిబలములును నిజమునకు యుద్ధసమర్థమునవేవిధమైన జోక్యమును గలుగఁజేసికొనక ఫోర్డువెంబడిని సహాయముగరాక, యుద్ధరంగమునకిరుగు పొరుగుల తచ్చాడుచుండెను. ఆంగ్లేయసైన్యమును గతణామే క్షేరించి వారిని వెంటాడించి తఱుమునుద్దేశ్యముతో ౨౩ వ తేదీని గోదావరి నదిని దాఁటెను.

ఈసంగతియిట్లుండఁగా కుందూరుయొద్ద జరిగిన యుద్ధములో విజయులైన యానందగజపతి రాజుగారు ఆంగ్లేయులను సహాయముతీసికొని తనరాజ్యము నభివృద్ధిపఱచుకొను నుద్దేశ్యముతో వచ్చుచున్నారని యితర జమీందారులవలెనే శ్యామలకోటలో ఠాణాచేసికొనియున్న పిఠాపుర ప్రభువులైన పెదమహీపతి రాయనింగారును నీలాద్రిరాయనింగారునుకూడ ననుమానించిరి.

పెదమహీపతిరాయనింగారు రుస్తుంఖానునిచేతఁ దలకొట్టఁబడిన బుచ్చన్నగారిమనుమలు. నీలాద్రిరాయనింగారు బుచ్చన్నగారి యన్న

కొమారులు. మహీపతిరాయనింగారు బాల్యులై యుండుటచేత నీలాద్రిరాయనింగారే వ్యవహారదక్షులై రాజకార్యములను నడపుచుండిరి.

వీరికిఁ బూర్వుఁడు పెద్దాపురపు వత్సవాయజగపతిరాజుగారు మొదలగు నుత్తరసర్కారులందలి యితరజమీందారులవలె కుందూరుయుద్ధమున ఫ్రెంచివారిపక్షమున నిలువఁబడి జోక్యము కలుగఁజేసికొనినవారు కారు. వీరిపూర్వుఁడును, గజపతిరాజుగారు నాంగ్లేయులును శత్రువుల కోటపై దండెత్తివచ్చుచున్నారనివిని వారి నెదిరించుటకై కాకినాడలోనున్న డచ్చి (వలందు) వారిని సహాయముకోరిరి. మూఁడు నెలలవఱకు డచ్చివారిసహాయముతో పిఠాపురప్రభువులు శత్రువులకు దుస్సాధ్యులై నిలిచి కోటను సంరక్షించుకొనుచుండిరి. కాని తరువాత నాహారపదార్థముల లేమివలననో లేక మఱియేకారణముననో కోటలో నున్నవారు శత్రువులకులొంగుటయు, కోటపై నాంగ్లేయుల బావుటా ప్రతిష్ఠింపఁబడుటయుఁగూడ జరిగినది. అటుపిమ్మట గజపతిరాజుగారు పెద్దాపురపుమార్గమున రాజమహేంద్రవరము పోవుచు నల్లచెఱువు గ్రామముదగ్గఱ దండువిడిసి జగపతిరాజుగారిని వంచించు కృత్రిమోద్దేశ్యముతో పెద్దమనుష్యులద్వారా తమ్మొక్కసారి కలిసికొనరావలసినదని నమ్మకముగా నాయనకుఁ గబురుపంపించెను. దీనినంతయు సత్యమేయని విశ్వసించి జగపతిరాజుగారు గజపతిరాజుగారి కొఱకుఁ గోటలో మేజువాని మొదలగు ప్రయత్నములను జేయించి సముచిత గౌరవపరివారముతో ఆయనను గలిసికొనఁ బాలకీనెక్కి ప్రయాణమై పోయి యెల్లచెఱువును సమీపించిరి. ఆనందగజపతిరాజుగారును తమ కృత్రిమోద్దేశ్యపరిసమాప్తికొఱకే మందుమున్నగునవి ధట్టించి బాఱుచేసి సిద్ధముగానుంచిన ఫిరంగులను పరివారసహితులైన జగపతి

రాజుగారు సమీపమునకు రాగానే వెళ్ళించిరి. అప్పుడు వత్సవాయ జగపతిరాజుగారు ఆనందరాజుగారి కాపట్యమును దమపరివారము నెల్లా చెదరిపోవుట కనుందెలిసికొని, యొకగుఱ్ఱము నెక్కి యొకఁడె యొంటిగఁబోయి తమకోటఁగోఁబ్రవేశించి, తమసైన్యములు యుద్ధసన్నద్ధములుగాక యుండుటచేత నొకవేళ నీలోపున నేరాఁగల యానందరాజుగారిని నిగ్రహించుట కష్టమనియు నందువలననట్టిసాన్నిధ్యమునయందు మానమే శ్రేయస్కరమనియు నెంచి నగర్లోఁ దుపాకిమందు నరపించి స్త్రీలతోఁగూడఁ జిచ్చంటించుకొని ప్రాణముఁగొందుటకు సిద్ధపడియుండిరి. అప్పుడు గజపతిరాజుగారువచ్చి మీరుచనిపోవలసినంత యగత్యమేమియును లేదనియు, మీకొమారులైన తిమ్మరాజుగారిని రాజ్యమును దమ కప్పగింతచేసి మీ యిష్టమువచ్చిన యోస్థలమునకైన వెడలిపోవలసినదనియు జగపతిరాజుగారితోఁజెప్పిరి. అంతట జగపతిరాజుగారు తాము బ్రతికియున్నయెడల నెప్పటికైన ఆనందగజపతిరాజుగారిపైఁ బగసాధించుకొనవచ్చుననియుఁదలంచి దేశమును విడిచిపెట్ట నంగీకరించిరి. కాని జగపతిరాజుగారు గజపతిరాజుగారిని నమ్మలేక తాము గోదావరిని దాఁటకమున్నే తమకేహానిచేయుదురో యనియెంచి గజపతిరాజుగారితాలూకు పండ్రెండువందల సైన్యమునకు సరదారులైన యిరువురు పెద్దమనుష్యులు వారి సైన్యములతోవచ్చి తమ్ముగోదావరిగడచి వెళ్ళుపర్యంతము క్షేమముగా సాగనంపుటకు కరారుచేసికొనిరి. ఆప్రకారమే యిరువురుసరదారులు తమసైన్యములతోవచ్చి జగపతిరాజుగారిని రాజమహేంద్రవరమువద్ద గోదావరినిదాటించి యవతలికి సుఖముగాఁబంపించిరి.

—: పెద్దాపురము గజపతుల యధీనముక్రిందికివచ్చుట :—

పిమ్మట ఆనందగజపతిరాజుగారు జగపతిరాజుగారి భార్యాపుత్రి

లను దమయమానిలోనుంచి పెద్దాపురపుజమీందారీని వశపఱుచుకొను
టకుఁ దమతరపువ్యవహారస్థులను నియమించి కోటలోఠాణా వేయించెను.
నాఁటినుండియుఁ బెద్దాపురముకోట యొకకొంతకాలమువఱకు గజపతుల
యధీనముక్రిందకువచ్చెను.

అటుపిమ్మట ఆనందగజపతిరాజుగారు రాజమహేంద్రవరము
వెళ్లిరి. అప్పటికప్పుడే యేతద్దుర్గము, ఫోర్డు స్వాధీనమైయుండుట
యానందరాజుగారి కొకయద్భుతముగాఁ గనఁబడెను. రాజమహేంద్ర
వరదుర్గమును దమ స్వాధీనముచేసినయెడలఁ దామిచ్చెదమన్న సైన్య
పోషణధనమును ఆనందరాజుగారు చెల్లించలేకపోయిరి. అందువలన
కల్నల్ఫోర్డు పెంచినవారినిఁ గఱుముటవదలిపెట్టి మిక్కిలి విసుగుదల
తోను కోపముతోను గోదావరినిదాఁటి యీవలకువచ్చెను. ఆనంద
గజపతిరాజుగారును, ఫోర్డు తనపైఁ బగసాధించుకొన వచ్చుచున్నాఁ
డేమోయనితలంచి రంపమన్యముదిక్కుగా దగ్గరనున్న కొండలకుఁబాఱి
పోయిరి!

ఆంగ్లేయసైన్యాధిపుఁడైన కల్నల్ఫోర్డు విశాఖపట్టణమునందున్న
తమ యాంగ్లేయులతో రాకపోకలు జరుపుట కనువుఁజేసికొనుటకై
పెద్దాపురమువఱకుఁ బోయెను. విశాఖపట్టణమున కీక్రితము నెలలో
ఆండ్రూస్ యనునొక యుద్యోగస్థుఁడువచ్చియుండెను. అతఁడానంద
గజపతిరాజుగారితో రాజీనామా రాయబారములు జరుపుటకు వెనుకకుఁ
బంపఁబడెను. అతఁ డానందగజపతిరాజుగారిని కొండలలో నుండఁగనే
దర్శించి రాయబారము నడిపెను. ఆండ్రూస్ను ఆనందగజపతిరాజు
గారిని శాంతపఱచి తమతో రాజీకివచ్చునట్లొడంబఱచి పెద్దాపురము
వద్దనున్న యాంగ్లేయ సైన్యమును గలిసికొనవలసినదని ప్రోత్సాహ

పఱచెను.

ఇట్లు మిక్కిలివిలువగలిగిన కొంతకాలమును వ్యర్థపుచ్చిన తరువాత ఫోర్డు ౧౭౫౯వ సంవత్సరము జనవరి ౨౭వ తేదీని పెద్దాపురమునుండి బైలుదేఱి ఫిబ్రేవరు ౬వ తేదీనాఁటికి ఏలూరుచేరెను. అచ్చటనుండి యతఁడు నరసాపురమువద్దనున్న ఫ్రెంచివారి గిడ్డంగి నాక్రమించుకొనుటకు కెప్టెన్ నాక్సు అనువానికి సేనాధిపత్యమునిచ్చి కొంత సైన్యమును బంపించెను.

నరసాపురమున ఫ్రెంచివారిపక్షమున నూఱుమంది యూరోపియనులును ౩౦౦లమందియో లేక ౪౦౦లమందియో సిపాయిలును గలరు. ఆతాలూకాకు జమీందారుఁడైన మొగల్తుర్రు (నరసాపుర సమీపగ్రామము) రాజును ఆంగ్లేయులు తమకువచ్చి సాయపడవలసిన దనికోరిరి. ఆయాహ్వానమునకు మనఃపూర్వకముగ సంతసించినవాఁడై మొగలితుర్రు జమీందారుఁడు కెప్టెన్ నాక్సును వచ్చికలిసికొని తనకుఁ జేతనైనంత సహాయమునంతయుఁ జేసెను. పరాసువారును జమీందారునియొక్క సహాయము నేకమ్ముకొనియుండిరి. కాని యెప్పుడు జమీందారుఁడు వారికి సాయపడ నేగఁడయ్యెనో వారప్పుడే గిడ్డంగిని వదిలిపెట్టి తాము మోసికొనపోవలేని మందుగుండుసామానునంతయు గోదావరిలోముంచివేసివెళ్లిపోయిరి. నాక్సును, గిడ్డంగిని రక్షించుటకొఱకై కొంతమంది సైనికుల నచ్చటవిడిచి మిగతపరివారముతో నేలూరు వచ్చి యింకనునచ్చటనేనిలిచియున్న విజయనగరము రాజుగారిని గలిసికొనెను.

ఈలోపుగా కాన్ఫ్లాన్సు మచిలీపట్టణమునకుఁబోయెను. ఇతనియొక్కకోరికవలన దక్కనుసుబాదారుఁడైన సాలబత్ జంగు కృష్ణా

పల్లపుభూములనున్న యాంగ్లేయులపై దాడివెడలెను. మార్చి ౨వ తేదీని ఫోర్డు మచిలీపట్టమునకుఁబోయి దాని నొకమాసమువఱకుముట్టడించినపిదప దాని నాక్రమించుకొనెను. ౧౭౫౯వ సంవత్సరము మేనెల౧౪వ తేదీని ఫోర్డు సాలబత్‌జంగుతోసంధిచేసికొనెను. ఆసంధి ప్రకారము మచిలీపట్టణమునకుఁ జుట్టుపట్లనుండు ప్రదేశమును, నైజాంపట్నమును ఈనాముగా నాంగ్లేయుల కియ్యఁబడెను. అప్పటినుండియు సుబాదారుకూడ ఫ్రెంచివారితో దనకున్న స్నేహమునంతయు వదలుకొందుననియు, నిఁకనెప్పటికి నుత్తరసర్కారులలో ఫ్రెంచివారిని స్థిరనివాసమేర్పఱుచుకొనకుండ నిరోధించెదననియు వాగ్దానముఁ జేసెను. ఈయొడంబడికనుబట్టి గోదావరినది కుత్తరమునన్న దేశ మంతయు మఱల దక్కనుసుబాదారునియధికారము క్రిందకువచ్చెను.

ఆ తక్షణమే యుత్తరసర్కారులనుండి ఫ్రెంచిసైన్యమింకను పూర్తిగా వెడలిపోవదయ్యెను. ౨౫౦ మంది యూరోపియనులును, ౨,౦౦౦లమంది సిపాయిలును గల యొకచిన్నసైన్యము ఆంగ్లేయులకు వచ్చుచున్న యాహారపదార్థములనుగాని మందుగుండుసామానునుగాని సహాయసైన్యమునుగాని నాశనముచేయుటకై మచిలీపట్టణము రాజమహేంద్రవరములకుమధ్య నిలిచిపోయెను. ఆ సైన్యము రాజమహేంద్రవరమునకుఁబోయి యచ్చటనున్న యాంగ్లేయసైనికుల నోడించి యాదుర్గము నాక్రమించుకొనెను. కాని త్వరలోనే సాలబత్‌జంగును గలిసికొను నుద్దేశ్యముతో దానిని విడిచిపెట్టి వెళ్లిపోయెను.

తరువాత రాజమహేంద్రవరమువద్ద గోదావరినదిని దాఁటి పశ్చిమముగా నేగిన వత్సవాయి జగపతిరాజుగారు కంభముమెట్టుకుఁబోయి యటనుండి వేలుపుకొండకరిగి యక్కడనుండి పంద్రెండువందల

సైన్యమునకు వేలుపుకొండ తుపాకినౌకరీ మొకరరుచేసినసిపాయివారిని వెంటఁబెట్టుకొని రాజలింగము, కొత్తపల్లిమార్గమున మన్యమునుబట్టి పెద్దాపుర సమీపముననున్న రాగంపేటకు నాలుగునెలలకు వచ్చిచేరిరి.

ఈలోపుననే మచిలీపట్టణ మాంగ్లేయులకు వశమైనదని తెలియకమునుపే, మొరాసిన్ అను ఫ్రెంచియుద్యోగియుఁడు తగినంతయుద్ధసహాయసంపత్తితో దక్షిణమునుండి మచిలీపట్టణమునకుఁ బయలుదేరెను. అతఁడు నవంబరు ౧౧వ తేదీకి అప్పటికిని డచ్ (వలందు) వారియధీనములోనున్న కాకినాడ వచ్చిచేరి, తమకు కుందూరు యుద్ధమునఁ దమపక్షమవలంబించి పోరాడినట్టి విశ్వాసపాత్రుఁడైన మిత్రవర్యుఁడుగానున్న జగపతిరాజుగారితోఁ దమయధికారమును పునఃస్థాపనమొనరించుటకును, ఆంగ్లేయుల నుత్తరసర్కారులనుండి తరిమివేయుటకును గుట్రలుపన్నఁజొచ్చెను. కాని యాతనిప్రయత్నము లేమాత్రమును సఫలములు కాకపోవుటచేత వెంటనే ప్రయాణమై యోడమీఁదుగా పుదుచ్చేరికి వెళ్లి చేరెను.

ఆ సంవత్సరమే డిశెంబరునెలలో ౫౦ మంది యూరోపియనులును, ౧౦౦ మంది సిపాయిలునుగలయొక చిన్నఫ్రెంచిసైన్యము వెనుకటివలెనే జగపతిరాజుగారితో యోచనలుచేసి వ్యవహారము జరుపుటకై కాకినాడవద్దదిగెను. జగపతిరాజుగారును రావు నీలాద్రిరాయనింగారితోఁ గూడి డచ్‌వారి ద్వారా రాయభారములు జరుపుచుండఁ గొందఱు పరాసువారు కోట మీఁద నున్న యాంగ్లేయుల బావుటాను పెకలించి తమబావుటానునాఁటిరి. పిదపనీసంగతియంతయు గజపతిరాజుగారి వ్యవహారస్థులును పెద్దాపురపుకోట ఠాణాలోనున్నవారును ఆనందగజపతిరాజుగారికి జాబులమూలమునఁ దెలిపిరి. అటుపిమ్మట ఆనంద

గజపతిగారు తమసైన్యమునంతయు వెంటఁబెట్టుకొని జగపతిరాజుగారిని ఫ్రెంచివారిని సాధించుటకై పయనమైరి. ఈసమయముననే మచిలీపట్టణమువద్ద కెప్టెన్ ఫిషర్ యొక్క సేనాధిపత్యముననున్న యాంగ్లేయ సైన్యము బంగాళమునకుఁబయనమై వెళ్లుచుండెను. ఆసైన్యాధిపుఁడగు ఫిషర్ రాజమహేంద్రవరమువచ్చునరికి కాకినాడవద్ద ఫ్రెంచి సైన్యమున్నదని తెలిసికొనియచ్చటికి దానినోడించనరిగెను. ఈసైన్యమును, ఆనందగజపతిగారిసైన్యమునుగలిసి కాకినాడ నెల్లఁబట్టికచ్చట నున్నకొంతమంది ఫ్రెంచివారు డచ్ వారికోటలోదాఁగికొని పిదపలొంగి పోయిరి. ఓడలుదిగనిమఱికొందఱు ఫ్రెంచివారుతమనావలను పుదుచ్చేరి మార్గమునకుఁ ద్రిప్పిరి.

ఆనంద గజపతి రాజుగారు తమసైన్యములను గొనికొని శ్యామల కోటలోనున్న ఫ్రెంచివారిని దఱుమఁగొట్టి యాంగ్లేయుల బావుటాను మఱలఁ బాఁతుటకై యుద్ధప్రయత్నములు చేసికొని సైన్యముతోఁ జాళుక్య భీమవరమువద్దనుండి వెళ్లుచుండిరి. అప్పుడు రావుసీలాద్రి రాయనింగారును జగపతిరాజుగారును గాకర్లపూడివారితోఁగలిసి కొన్ని వేలపౌజుతో గజపతిరాజుగారిని మార్కొననరిగిరి. కానిమార్గమధ్యమున వీరిసైన్యములోఁ గొంతభాగ మేకారణముననో వెనుకకు తగ్గినది. అప్పుడు సీలాద్రిరాయనింగారు సంగతిసందర్భములను, సైన్యస్థితిగతులను, యుద్ధోపకరణవిధానములనువిచారించి యీసందర్భమున మనమునిగ్రహించుటకష్టమనియు, నిప్పుడు తిరిగి శ్యామలకోట వెళ్లుట యుక్తమనియు జగపతిగారితోనుడివిరి. కాని జగపతిరాజుగారిమేము పౌరుషముతో, వచ్చినవారమెట్లును రానేవచ్చినారము. యుద్ధరంగమునకుఁ బ్రయాణమైవచ్చి వెనుకకు మఱలిపోవుట వీరవరేణ్యులకుచి

తమగునా? తిరిగి మఱలుముఖము పెట్టుట శౌర్యలక్షణము కానేరదని చెప్పి యతిసాహసముతో మిగతబలములతో గజపతిరాజుగారి నెదిరించఁబోయిరి.

ఈ యుభయుల సైన్యములు ఉండూరు ( శ్యామలకోట సమీపగ్రామము ) సమీపమున సంధించినవి. అచ్చట నొక గొప్పపంకుల సమరము జరిగెను. ఈ యుద్ధమున గజపతిరాజుగారి ధాటికి నిలువలేక రావు నీలాద్రిరాయనింగారు యుద్ధరంగమునుండి పాఱిపోయి తిరిగి శ్యామలకోటకు వచ్చి యచ్చటనున్న చిన్నవాండ్రను వెంటఁబెట్టుకొని యింక నక్కడ నిలువక జూపల్లెవారి సంస్థానములోనిదగు రాఘవపురమునకు వెళ్లి యటడాఁగియుండిరి. జగపతిరాజుగారు మాత్రము ధైర్యశౌర్యములతో నిలువఁబడి యమితవిక్రమమును జూపుచు సమరక్రీడను సలుపుచుండిరి. ఇట్లుండఁగా ఆయన యాకస్మికముగా గుండుదెబ్బ తగిలి నేలంబడిరి. అంతట నీ సమాచారము నానందరాజుగారికిఁ దెలియఁజేయునప్పటి కాయన తలకొట్టి తీసికొనిరావలసినదని కఠినమైన యుత్తరువుసేసిరి. అంతట నీరాజశాసనము నాలించి సత్యవరపుజమీందారుఁడైన రామభద్రపాయకరాయనింగారు, ఆనందరాజుగారి సముఖమునకరిగి, యింతటి యకార్యమునొనర్చుట మీవంటి రాజేంద్రులకు ధర్మముకాదనియు, నిదియునుగాక మీతండ్రిగారు మిమ్ములను ఈజగపతిరాజుగారినిఁ బెంచినారనియు, వీరికిపోయినసంస్థానమును మీతండ్రిగారు నిర్వాహకము చేసి యిచ్చినారనియు, నందువలన నిప్పుడు మీరును పాలకీ పంపించి సగౌరవముగ నాయనం దోడ్తెచ్చుట యుక్తముకాని తలకొట్టిన మిక్కిలి యపకీర్తి రాఁగలదనియు మనవిఁజేసికొనిరి. అటుపిమ్మట మీరే వెళ్లి జగపతిరాజుగారిని, పాలకీలోనుంచి గొనిరావలసినదని యానందగజ

పతిరాజుగారు పాయకరాయనింగారితో శెలవిచ్చిరి. ఆప్రకారమే యాయనయు వెళ్లి రణభూమిని వగిణితులై, ప్రాణావశిష్టులై పడి యున్న జగపతిరాజుగారి నందలమున నెక్కించుకొని వచ్చుచుండఁగా, ఆయనను జూచి గజపతిరాజుగారు కన్నుల నీరునించుకొనిరి. అప్పుడు పాయకరాయనింగారు “కష్టములెంతవారలకునుగలవు. ఎంతమాత్రము విచారించవద్దని యాయననోదార్చి పాఁకీనెత్తించుకొని తీసికొని వచ్చిరి. పిదప గాయములకు కట్లుకట్టించెదమని పాయకరాయనింగారు చెప్పఁగా జగపతిరాజుగారు నాకక్కఱలేదని సైగచేసిరి. వీరు నిరాశచేసికొని పోనిమ్మనియూరకొని వారికోరిక నెరవేర్చిరి. అంతట నానాఁడే మూఁడుఘడియలకుఁ దమభౌతికదేహమును జాలించి జగపతిరాజుగారు తమ యిరువదియైదవయేట ననఁగా క్రీ. శ. ౧౭౯౩వ సంవత్సరమునకు సరియైన ప్రమాదిసంవత్సర పుష్యశుద్ధ నవమినాఁడు వీరస్వర్గప్రాప్తులైరి.

ఈలోపున తావుసీలాద్రిరాయనింగారు శ్యామలకోట విడిచిపెట్టి పాఱిపోవుటను దెలిసికొని గజపతిరాజుగారుండూరునుంచి శ్యామలకోటకు వచ్చి తిరిగి యాంగ్లేయులబావుటానునిలిపి కోటలోనున్న ఘ్రించిపటాలపాతులను తఱిమివేసిరి.

ఈప్రకారముగా జగపతిరాజుగారిపరిపాలన ముగింపునకువచ్చెను. శ్రీరామవిలాసమను మహాప్రబంధమునురచియించినట్టియు, ముందుఁ జెప్పఁబోవు తిమ్మరాజుగారి కాశ్రయులై యుండినట్టియూ, నేనుఁగు లక్ష్మణకవిగారు ఈ జగపతిరాజుగారి కాలమునసహితముండినట్లు ఆయనచే రచియింపఁబడిన యీక్రిందిచాటుపద్యము నుడువుచున్నది.

ఉ॥ శ్రీయుతవత్సవాయ సుకులాంబుధి పూర్ణనిశాపతీ! జగ
ద్గేయశుభాకృతీ! విదితకీర్తినతీ కమనీయగుణావన
ప్రాయనలాకృతీ! సతతవైభవనిర్జితపూర్వదిక్పతీ!
ధీయుతవాక్పతీ! జగత్పతీ! నృపతీ! సుకృతీ! మహోన్నతీ!

ఈజగపతిరాజుగారు కవిత్వమునం దనిపుణులై పెక్కుపద్యములు శతకములు మొదలైనవి భద్రాద్రిరామునిమీఁదఁ జెప్పినట్లు రామవిలాసములోని యీపద్యము ఘోషించుచున్నది.

చ॥ పదములఁ గీర్తనల్ రుచిరపద్యశతంబులు రాగమాలికా
మృదుపదదండకంబులు సమృద్ధగతిన్ రచియించి కామిత
ప్రదునకు భద్రశైలప్రభుభర్తకు గానుకగా నొసంగెనే
త్రిదశులు మెచ్చఁగా జగపతిప్రభుచంద్రుఁడు భక్తిపెంపునన్.”

—: ఆనంద గజపతిరాజుగారి మరణము :—

శ్రీ వత్సవాయ జగపతిరాజుగారు చనిపోయిన యనంతరము వారిసహధర్మచారిణియగు దంతులూరివారియాఁడుపడుచైన సీతమ్మగారి కామెయొక్క భర్త్రుమరణప్రకారంబంతయు రామభద్రపాయకరాయనింగారు తెలియఁజేసిరి. ఆ పతివ్రతాశిరోమణియు వెంటనే యాయన వాక్యములాలించుచునే సహగమనమునకు సిద్ధమయ్యెను. ఈ సంగతి యానందరాజుగారికిఁ దెలియఁజెప్పఁగా నామె యిష్టమేలాగో యాలాగే కానియ్యవలసినదని చెప్పిరి. అప్పటికి శ్రీ సీతమ్మగారి కొమారులును వత్సవాయ వంశాబ్ధిచంద్రులు నగు తిమ్మరాజుగారు పూసపాటివారి యమానిలోనున్నందున, సహగమన సంసిద్ధయైన యా పవిత్రచరిత్రయుఁ దమకొమారులుభద్రముసుండియని పాయకరాయనిం

గారికొప్పఁజెప్పి కంటఁదడిపెట్టుకొనెను. అప్పుడాయనయు “అమ్మా! చిన్నవానినిందీసుకొని వచ్చి మీకుఁ జూపుదుమా” యని యనఁగా నామెయు, మీరు మాటలుమాత్రమందురుగాని మిమ్మునుదెచ్చిచూప నిత్తురా? ఇంతమాత్రమునకిట్టి మాటలేల ఇంతకు నేనగ్నిలోని కురుకుదానను. చూచిమాత్రమేమిచేయగలను. అయ్యో! ఇఁకనన్నింటికిని మీరేయున్నారు. మీదేభారము” అని దీనత్వముగఁబలికి సహగమనమునకు వెడలుచు మాకుసంభవించినయోగమే ఆనందరాజుగారికిని మూఁడు నెలలనాఁటికి సంభవించునుగాత! మని శపియించి పెనిమిటిచితిపై నెక్కి దేహమునుజాలించెనట!

ఈమె సహగమనముచేయుచుండఁగా ఆనందరాజుగారిభార్యలు పసుపుకుంకుమ మున్నగునవి పంపించిరనియు, మాదీదేశమేగాన మాకట్టిసాధనసంపత్తి గలదనియు,గనుక కొద్దిదినములలోనే మీకుసహితము సంభవించనైయున్న యిట్టియవస్థకు దూరదేశమునందున్న మీరేసిద్ధముచేసికొని యుంచుకొనుటమంచిదనియు హితోపదేశముచేసి తమకు పంపించిన పసుపుకుంకుమలను దిరిగి పంపివేసిరనియు నొకగాథ చెప్పఁబడుచున్నది.

పిదప ఆనందరాజుగారు మఱిరెండుమాసములకు రాజమహేంద్రవరమున స్ఫోటకపడి కాలధర్మముఁబొందిరి. అప్పుడు వారి భార్యలిరువురుగూడ సహగమన మొనరించిరి. ఇది శాపబలమే కాఁబోలు! శత్రుబలముచే నవీనముగ కల్పింపఁబడిన శాపబలము!!

తదనంతర మనకాపల్లి జమీందారులగు రామభద్రపాయకరాయనింగారును, బుర్రా బుచ్చన్నగారు నిరువురు నాలోచించి వత్సవాయ జగపతిరాజుగారియొక్క క్షోభ తగిలియే యానందరాజుగారి

ట్లల్వాయుష్మంతులైరనియు నట్లే కానిచో నింతపని జరిగియుండ నేరదనియు, నెక్కడైనను వారిసంస్థానమును నిలువఁబెట్టి ముందునకుఁ దీసికొనివచ్చి ననేగాని లేనియెడల నిట్టికార్న్యయుపుచావులే ప్రభువులకు సంభవించుఁ గలవనియు, నదియునుంగాక జగపతిరాజుగారు చిన్నవారై తుగుష్క్యాల చెఱలోనున్నప్పుడు విజయరామగజపతిరాజుగారు సైన్యసమేతులై వెళ్లి చెఱవిడిపించి తమ యింటనే పెంచి పట్టముగట్టిరనియు నందువలన నా సంస్థానమొకటియు నీసంస్థానమొకటియుఁగాగనియు, దూరాలోచనఁ జేసివిచారించి తిమ్మరాజుగారిని హవాలాచేసికొనియున్న సిపాయిల కిషాగాచేసి. వారిమంత్రులకును రాచముండలికిని "మీరాజును గొనిపోయి పట్టముగట్టుకొనవలసిన" దనిశెలవిచ్చిరి. అప్పుడు వత్సవాయవారిపక్షమువారువచ్చి తిమ్మరాజుగారినిఁ దీసికొనిపోయి పెద్దాపురసంస్థానమున కభిషిక్తులం జేసిరి.

ఇచ్చట విజయనగరమున బుద్దాబుచ్చన్నగారు, జరిగినసంగతులన్నియు బొబ్బిలిలో మృతులైన పెదవిజయరామరాజుగారి భార్యయు నప్పటికధికారిణియునైన చంద్రయ్యమ్మగారికి నివేదించిరి. పిదప నామెయుఁ గొంతతడవు పెద్దాపురపు వత్సవాయవారికి సంభవిల్లిన యిక్కట్టులనుగుఱించియు, గతించిన యానందరాజుగారి నడవడికను గుఱించియు విచారించి బుచ్చన్నగారుచేసినపనికిహర్షించిరి. తరువాత నామె మంత్రులయాలోచనలమీఁద తాళ్లపాలెమునయున్న తమ సన్నిహితజ్ఞాతియైన పూసపాటి రామభద్రరాజుగారి ద్వితీయభార్యపుత్రుఁడైన పంద్రెండేండ్ల యీడుగల వేంకటపతిరాజను చిన్నవానిని పెంచుకొని, ఆచిన్నవానిపేరు విజయరామరాజుగామార్చి యాయనను పట్టాభిషిక్తునిఁజేసెను.



◆ *

* కీర్తి శేషులైన శ్రీతిమ్మజగపతి మహారాజుగారు,

◆ కీర్తి శేషులైన శ్రీరాయుజగపతి మహారాజుగారు.
వారికుమార్లు శ్రీబుచ్చితిమ్మజగపతి రాజాగారు.

## —:నాలుగవతిమ్మరాజుగారు:—

( క్రీ. శ. ౧౭౬౦—౧౭౯౭ )

ఈ నాలుగవతిమ్మరాజుగారు రాజ్యమునకువచ్చునప్పటి కేడేండ్ల ప్రాయమువారు. తమప్రభువునందుఁగల భక్తివిశ్వాసములచేఁ దమ సంస్థానమును ప్రజలను భద్రముగఁగాపాడుచు మంత్రిసేనానాయకులే రాజ్యతంత్రమును నడుపుచుండిరి.

వీరు రాజ్యమేలుచుండఁగా హైదరాబాదునుండి యప్పుడు నైజాముగానున్న నవాబుమీర్ నిజామల్లీఖానుఁడు (౧౭౬౧-౧౮౦౩) సేనాసమేతుఁడై వచ్చి గోదావరికవతలయొడ్డుననున్న కొవ్వూరులో దిగియుండెను. అప్పుడాయనను సందర్శించుటకై బుద్ధా బుచ్చన్నగారు మొదలగు మంత్రివర్గమును, మఱికొందఱుద్యోగియులును, పెంచుకొన్న విజయరామరాజుగారిని వెంటఁబెట్టుకొని చంద్రయ్యమ్మగారు కొవ్వూరునకేతెంచిరి. వీరితోఁ బాటుగా పెద్దాపురమునుండి మనతిమ్మరాజుగారును, పిఠాపురమునుండి రావు పెదమహీపతిరాయనింగారును వచ్చిరి. నవాబునిజామల్లీఖానునకును విజయనగరప్రభువారికిని బాకీపడియున్న పేష్కషునుగూర్చి కొంత చర్చజరిగిన పిదప విజయనగరపుకోటను విజయరామరాజుగారికి ఖాయపఱచిరి. ఆప్రకారముగనే పిఠాపురపుకోటను పెదమహీపతిరాయనింగారికిని, పెద్దాపురపు జమీందారీని తిమ్మరాజుగారికిని స్థిరపఱచి వీరికి నౌబత్తులుమున్నగు ప్రాభవ చిహ్నవిశేషములనొసంగి వీరివలనఁ గానుకలు మొదలగు నజరులను గ్రహించి వెడలిపోయిరి.

అటుపిమ్మట బుద్ధాబుచ్చన్నగారు మొదలగు నమాత్యపుంగవులతోను

చింతలపాటినీలాద్రిరాజుగారు సింహాద్రిరాజుగారు మొదలగు బంధుజనముతోడను తక్కుంగల సేనానులతోను చంద్రయ్యమ్మగారు స్వదేశమునకు బైలుదేఱివెళ్లుచు మార్గముననున్న పెద్దాపురమున తిమ్మరాజుగారినిఁజూడదిగిరి. మన వత్సవాయ తిమ్మరాజుగారును, దమ సంస్థానమును దమకు మఱలనొప్పగించి, తమయెడ నవ్యాజప్రేమఁగనఁబఱచినందుకు వారియెడలమిగులఁగృతజ్ఞులై గౌరవపూర్వకమైన విశ్వాసముతో వారికి విందులుజరిపి యాటపాటలచేతను, నృత్యగానాదివినోదములచేతను సమ్మానించిరి. వారును గొంతకాలమచ్చటనుండి వీరు చేసినసత్కారములనందికొని, యెంతయునలరి తిమ్మరాజుగారిని శ్లాఘించి సుస్థిరరాజ్యవిభవులై సర్వశోభిరాజితులై వర్ధిల్లవలసినదని యాశీర్వదించి యటనుండితరలి యనతికాలముననే నిజరాజధానిం జేరికొనిరి.

శ్రీరామవిలాస మహాప్రబంధ నిర్మాణచాతురీధురీణుండును, మృదుసుధామధురగద్యపద్యరచనాప్రవీణుండును నగు నేనుఁగులక్ష్మణకవిపుంగవుఁ డీయనకాలముననే విలసిల్లినవాఁడు. ఈ కవీంద్రుఁడు తిమ్మరాజుగారికాశ్రితుఁడై, యాస్థానకవీశ్వరుఁడై యుండెను. ఈయన రామవిలాసమునురచియించి మొదట నీ తిమ్మరాజుగారి కంకితమీయఁ బోవగాఁ సుగుణశీలురగు నమ్మహారాజుగారు తాముచిన్నవారమనియుఁ దమవంశమువారిలోఁ బెద్దలును, కాంచీపురనివాసస్థులు నగు వత్సవాయ గోపరాజుగారి కంకితమీయవలసినదనియుఁ జెప్పి తమసౌశీల్యమును, బంధుజనాభిమానమును, దురభిమానరాహిత్యమును, క్షత్రియసంఘోచితమర్యాదను వేనోళ్ల వెల్లడించిరి. ఆహా! ప్రభువులనినవారేగదా! ఆకారణముననే బుధజనరంజకమైన శ్రీరామవిలాసప్రబంధము తిమ్మరాజుగారికాశ్రితులగు లక్ష్మణకవిగారిచేరచియింపఁబడియు,

కాండ్రేగులలోనున్న రాజబంధువులగు శ్రీవత్సవాయ గోపరాజుగారి కంకితముచేయఁబడెను.

మన తిమ్మజగపతిమహారాజుగారును, విజయనగరసంస్థానాధీశ్వరులగు విజయరామగజపతిమహారాజుగారును సమకాలికులని యెఱుఁగవగును. వీరిరువురును గ్రామపత్రములు అప్పకుట నొండొరులచ్చటినుండి యిచ్చటకును నిచ్చటనుండి యచ్చటకును బోవుచుండెడివారు. ఏనుఁగు లక్ష్మణకవిగారికి మన తిమ్మజగపతి మహారాజుగారాశ్రయులైనయట్లే అడిదముసూరకవిగారికి విజయరామగజపతిగారును నాశ్రయులైరి. విజయరామగజపతిగారినాఁడు అడిదముసూరకవిగారు విజయనగరమున నాస్థానకవీశ్వరులుగానుండిరి. " పెద్దాపురమున తిమ్మజగపతిమహారాజుగారు రాజ్యమేలుచుండఁగా నొకప్పుడడిదముసూరకవి తన ప్రభువువెంట పెద్దాపురసంస్థానమునకువచ్చి రాజులందఱును సభ చేసికూర్చుండియుండఁగా

ఉ॥ రాజుకళంకమూర్తి రతిరాజుశరీరవిహీనుఁడంబికా
రాజుదిగంబరుండు మృగరాజుగుహాంతరసీమవర్తి వి
భ్రాజితపూసపాడ్విజయరామనృపాలుఁడె రాజుగాక యీ
రాజులు రాజులే పెనుతరాజులుగాక ధరాతలంబునన్॥

అనుపద్యమును సభలోనాసీనులయియున్న రాజులవంకఁజూచుచు లేచిచదివెననియు, అంతమీఁద నిందలికడపటివాక్యము తమ్ముద్దేశించి పలికినట్లుభావించి రాజులందఱును కవినిఁ గోపదృష్టితోఁజూచుచు లేవఁబోవఁగా నతఁడు జంకక పద్యార్థమును జెప్పి " యీ రాజులనఁగా " పై చరణములయందుఁ జెప్పఁబడిన రాజులే యైనవారని స్పష్టీకరించి కోపముడిపి, వారిని శాంతచిత్తులను జేసెననియుఁ జెప్పుచున్నారు. ' ఇందలి

సత్యాసత్యములు కాలమునిర్ణయింపవలెను.

ఈ తిమ్మరాజుగారికిని విజయరామరాజుగారికిని ప్రాణస్నేహమని యీవఱకే నుడివియుంటిమికదా! వీరిరువురును విద్వాంసులై యుండుట దమకున్న స్నేహబంధమున నొకరిపై నొకరు సంస్కృతశ్లోకములం జెప్పి కొనుచుండెడివారు. వారి గీర్వాణవైదుష్యము నెఱుంగ నుదాహరణార్థము వారొండొరులపై రచియించుకొన్న శ్లోకములలో జెరియొక దాని నిటం బొందుపఱచుచున్నారము.

శ్రీ విజయరామగజపతిరాజుగారిమీఁద శ్రీ తిమ్మరాజుగారు చెప్పినది.

శ్లో॥ నాళీకభంగకృదతీవనదీనబంధు
ర్నక్షత్రపోనవసుధావిభవైకపేతః॥
రాజాకిమింగారిపినార్యభిమానహారి
రాజాపరంవిజయరాఘవసార్వభౌమః॥

శ్రీ తిమ్మజగపతిరాజుగారిమీఁద శ్రీ విజయరామరాజుగారు చెప్పినది.

శ్లో॥ అంభోజంకలయన్ సద్వృత్తమవని సాహిత్యరీత్యాన్వహో
ర్మాంధాతార మపారసంపదమహోభావేయనోరాశిషు
శత్రూణాంపురభంజనేతిగుణేకించోరగేంద్రంగాతి
ప్రాగల్భ్యప్రతిభాతి తిమ్మనృపతిః సాకాహింతప్రాభవః॥

ఆనందగజపతిరాజుగారి మరణానంతరమున రావుకొమార పెద మహీపతిరాయనింగారు పిఠాపురమును రాజధానిగఁ జేసికొని తమసంస్థానమును బాలించియున్నారు. ఆయన పరిపాలించుచుండఁగా రాఘు

పురమునకుఁబోయిన నీలాద్రిరాయనింగారు పిఠాపురముతిరిగివచ్చి వెనుకటివలెనే మహీపతిరాయనింగారిమూలశాత్రిగమునఁజేసుచేసికొనవలెనని ప్రయత్నించిరి కాని యీయన చేసినప్రయత్నములు ఫలోన్ముఖములు కాక వ్యర్థములయ్యెను అటుతరువాత పెదమహీపతిరాయనింగారు ఆయనను పిఠాపురమునుండి వెడలగొట్టిరి. పిదపఁగొంతకాలమునకనఁగా ౧౭౬౨ శివ సంవత్సరమున, కుమార వేంకటపతి రాయనింగారు విధి[illegible]న యనంతరమున నీలాద్రిరాయనింగారు తిరిగివచ్చి సింహాసనము నాక్రమించుకొని ౧౭౭౦ వఱకు రాజ్యమేలిరి. ఈయన వెనుక నీయన జ్యేష్ఠకుమారులగు పెదవేంకటమహీపతి రాయనింగారు రాజ్యమునకు వచ్చిరి. కాని యీయన కనిష్ఠసోదరులగు ముద్దువేంకటమహీపతిరాయనింగారు తమయన్నగారిని సింహాసనభ్రష్టులంగావించి రాజ్యమును దనయధీనమును జేసికొనవలెనని మహాప్రయత్నములు చేసెను. కాని యవి నిష్ఫలములయ్యెను. స్థిరగతులేకుండఁగా రెండేండ్లుమాత్రమే పరిపాలనచేసి మశూచికపడి పెదవేంకటమహీపతిరాయనింగారు కాలధర్మమొందిరి. ఆయన వెనుక సింహాసనారోహణమునకై యీయన కొమారులైన కుమారవేంకటమహీపతిరాయనింగారికిని. ఈయన పినతండ్రులైన బుచ్చివేంకటమహీపతిరాయనింగారికిని, ముద్దువేంకటమహీపతిరాయనింగారికిని కలహములు జనియించెను.

ఈ సందర్భమున నొక్కవిషయము చెప్పవలసియున్నది. చనిపోయిన యిరువురుమువ్వగు పిఠాపురప్రభువు లాంగ్లేయదొరతనము ( కంపెనీ ) వారికి చెల్లించవలసిన పేష్కషు బాకీపడియుండఁగా, వారియందుండు మైత్రియభిమానములచే మనతిమ్మజగపతిమహారాజుగారుజామీనుదారులై వారు చెల్లించవలసిన పైకమునంతయుఁ దామే చెల్లించిరి.

కాని బాహిరానుదారునకై వీరాంగ్లేయులకొసంగినసొమ్ము యెంతకాలము నకును దరిగి రాదయ్యెను. కాబట్టి పెద వేంకటమహీపతి రాయనింగారి యనంతరమున నీకలహసముయమున సంస్థానమెటుపోయి యెటువచ్చు నోయని తిమ్మజగపతిరాజుగారు తమ సొమ్మును రాబట్టుకొనుటకై పిఠాపురముపరగణాను దమవశముచేసికొని దానిని బరిపాలించుటకై రాజబంధువులైన వత్సవాయ తిరుపతిరాజుగారిని దమకు ప్రతినిధులుగ నియమించిరి. ఈవిధమున ౧౭౭౭వ సంవత్సరము మొదలు ౧౭౭౭కి వఱకు పిఠాపురముపరగణా వత్సవాయవారి యాజమాన్యమున జరుగుచుండెను.

అప్పుడు బుచ్చి వేంకటమహీపతిరాయనింగారు తమ భ్రాతృవ్య పుత్రులైన కొమార వేంకటమహీపతిరాయనింగారిని సోదరులగు ముద్దు వేంకటమహీపతిరాయనింగారిని దేశబహిష్కృతులం గావించి వత్సవాయవారి కియ్యవలసిన పైకమును జెల్లించి, సంస్థానమును బునస్స్వాధీనముచేసికొని ౧౭౭౭వ సంవత్సరము మొదలుకొని ౧౭౮౬ వఱకు దొరతనము చేసిరి.

ఈ తిమ్మరాజుగారు పరిపాలించుచుండు కాలముననే యనగా ౧౭౬౬వ సంవత్సరమున గుంటూరుతక్క యుత్తరసర్కారులన్నియు నాంగ్లేయులకియ్యబడినవి. గుంటూరుమాత్రము ౧౭౮౮వ సంవత్సరమున నొసంగబడెను. ఇట్లింతవఱకు హైదరాబాదు నైజాము స్వాధీనమున నుండిన యుత్తరసర్కారులు ఆంగ్లేయుల (కంపెనీవారి) వశమయ్యెను. తక్షణమే ఆంగ్లేయులును దమకువశమైన దేశమును పరగణాలుగ విభజించి తమపద్ధతుల ప్రకారము నూత్నపరిపాలనమును బ్రారంభించిరి. ఆంగ్లేయపరిపాలనా ప్రారంభదశలో నీగోదావరిజిల్లా యావఱలో నైజామునకు ప్రతినిధిగ నీదేశము నేలుచున్న హుస్సేన్

ఆలీఖానునకు కౌలునకీయఁబడెను. ఆతని కౌలు పరతు ౧౭౬౯ వ సంవత్సరముతో సరిపోయెను. అంతట నాంగ్లేయ దొరతనమువారు తమ యాధీనమునకువచ్చిన పరగణాలను కొంతయందిసభ్యులుగలయొక యాలోచన సభక్రిందను నొక చీఫ్ క్రిందనునుంచి పరిపాలించుచువచ్చిరి. ఈ గోదావరిజిల్లా మచిలీపట్టణముననున్న చీఫ్ చేతను నతని యాలోచన సభచేతను పాలింపఁబడుచు వచ్చెను. ఈ చీఫ్లు కాని యాలోచన సభాసభ్యులు కాని యప్పుడున్న యన్యాయ పరిపాలనమును దౌర్జన్యమును నాపలేకపోయిరి. అందువలనఁ బరిపాలనయందున్న లోపములను దొలఁగించుటకును రైతులకు క్షేమకరములైన యేర్పాటులు చేయుటకును, జమీందారులనుండి తగిన కప్పములను రాఁబట్టుకొనుటకు, వారి నిజమైనస్థితిగతులు విచారించుటకును చెన్నపురినున్న సెంటుజార్జికోటలోని యాలోచన సభయందలి అయిదుగురు సభ్యులు సంచారసంఘము ( Committee of Circuit ) గా నేర్పడవలసినదని ౧౭౭౫వ సంవత్సరమున కోర్టుఆఫ్డైరక్టర్లు ఉత్తరువిచ్చిరి. దేశముయొక్క సరియైనఫలసాయమును నిశ్చయపఱిచి యుత్తరసర్కార్లయొక్క స్థితి, జనసంఖ్య, వచ్చుఁబడిమొత్తము, జమీందారులకుండుయుద్ధబలము, వారికివచ్చురాఁబడి మొదలగునవి విచారించి రిపోర్టువ్రాయుట సంచార సంఘమువారి నిర్ణీతవిధియైయుండెను.

డైరక్టర్లయాజ్ఞాప్రకారము సంచారసంఘమువారు తమపనినిఁ బ్రారంభించిరి. కాని కొద్దికాలములోనే వారుచేయుపని, యప్పుడు చెన్నపురిగవర్నరుగానున్న సర్ థామస్ రంబోల్డు చేత నాటంకపఱుపఁబడెను. ఆయనయే ౧౭౭౮ లో జమీందారులను చెన్నపట్టణమునకుఁ బిలిపించి వారితో స్వయముగఁ దానే సెటిల్మెంటు ( గవర్న

మెంటువారికిచెల్లింపవలసినస్థిరమైనసొమ్ము (యేర్పాటు) చేయనిశ్చయించుకొనెను. ఆప్రకారమే యిదివఱలో జమీందారులు చెల్లించుమొత్తము (మామూలుజమాబందీ) కంటె పైగా నూటికి 12½ చొప్పున నెక్కువపన్ను కట్టవలసినదని సెటిల్ మెంటు అయిదేండ్లవఱకు నేర్పాటు కావింపఁబడెను.

౧౭౮౦వ సంవత్సరమున సర్ థామస్ రంబోల్డు దొరగారు గవర్నరుపదవినుండి విరమించినపిదప సంచారసంఘము తిరిగి నియమింపఁబడెను. ఈ సంచారసంఘవిచారణాఫలితమేమనఁగా రంబోల్డు దొరగారు జమీందారులకు నూటికి 12½ చొప్పున నధికముగా విధించిన కప్పము స్థిరపఱుచఁబడెను. ౧౭౮౬లో నా దొరగారుచేసిన సెటిల్ మెంటు తిరిగి మూఁడేండ్లవఱకు ననువర్తించునట్లు పెంపుఁజేయఁబడెను. తిరిగి ౧౭౮౯వ సంవత్సరమున ఆలోచన సభాసభ్యులును చీఫ్‌లును, జమీందార్లకు వారికివచ్చుమొత్తము రాఁబడిలో రెండువంతులుపన్ను విధించన యుక్తముగానుండునని తెలియఁబఱచిరి. అటుపై రివిన్యూ బోర్డువారును (ఈరివిన్యూబోర్డు ౧౭౮౬వసంవత్సరమున స్థాపింపఁబడినది), గవర్నమెంటువారును నందులకంగీకరించి యీపైని వచించిన ప్రకారము సెటిల్ మెంటుచేసిరి.

ఇట్లుండఁగా ౧౭౯౦వసంవత్సరమున గొప్పకఱువువచ్చెను. ఈ కఱువు ౧౭౯౦వ నవంబరు మొ॥లు ౧౭౯౨వ నవంబరువఱకుఁ బ్రజలను దనకాహారముగఁజేసికొని దేశవినాశముఁజేయుచుఁ బ్రబలియుండెను. ఈ గొప్పకాటకమువలన ప్రజలుపొందినకష్టము లిన్ని యన్ని యని వర్ణింపనలవికాదు. ఈ రెండుసంవత్సరములలోఁ దినుటకన్నము లేక, యాకలిబాధకోర్వఁజాలక, మలమలమాడి ప్రాణములువిడచినవా

రైనసేమి, దేశమును వదలిపెట్టి పరదేశముల కన్నముకై వెళ్లినవారైనసేమి, మొత్తము దేశమునందున్న ప్రజలలో నాలుగవ వంతు జనముకలరని చెప్పఁబడుచున్నది. అప్పు డాంగ్లేయ దొరతనమువారు క్షామపీడితులను రక్షించిపోషించుటకై రు ౧,౮౦,౦౦౦ లు వ్యయపఱిచిరి. పౌరవ్యయముమీఁద బీదకుటుంబములందలిపిల్లల కన్నదానము చేయఁబడెను.

ఈ క్షామము మూలమున జమీందారులు దొరతనమువారికి చెల్లించవలసిన కప్పములు బాకీపడిరి. ఈ కఱువుకారణమున దొరతనమువారు జమీందారుల కచ్చటచ్చట రిమీషనులిచ్చుచువచ్చినను, వారు తమకురావలసినరాఁబడిని వసూలుచేయుటయందు మిక్కిలి ఖండితముగ నుండుచువచ్చిరి.

ఇట్లుండఁగా చీఫులయొక్కయు నాలోచన సభవారియొక్కయుఁ బరిపాలనమంత సంతృప్తికరమైనదిగా లేదని సంచారసంఘమువారు రిపోర్టుచేసినందున, నుత్తరసర్కారులయందలి చీఫులును, ఆలోచన సభలును దీసివేయఁబడి వారిస్థానమున ౧౭౯౪ వసంవత్సరమున దేశ పరిపాలనకు కలెక్టరులు నియమింపఁబడిరి. ఒక్కొక్క కలెక్టరుయొక్క యధికారమునందున్న దేశమునకు కలెక్టరేట్ అనిపేరు. అదియే యిప్పుడు జిల్లాయని పిలువఁబడుచున్నది. ఈ కలెక్టర్ల నేర్పరిచినపిదప దేశమంతయుఁ ౫ కాలెక్టరేట్లక్రింద విభాగింపఁబడెను. రాజమహేంద్రవరము, కాకినాడ, మొగల్తుర్రు ననునవి హెడ్క్వార్టర్లు (అధికారులుండు స్థలములు) ౫ మొట్టమొదట మూఁడు కలెక్టరేట్లు ఏర్పఱుచఁబడెను. కాని కొద్దికాలములోనే ప్రకృతపు గోదావరిజిల్లాలోఁ జాల భాగము రాజమహేంద్రవరమునందుండు కలెక్టరు యధికారముక్రింద

నంచఁబడి రాజమహేంద్రవరము జిల్లాయని పేరుపెట్టఁబడెను.

౧౭౯౦-౯౧సంవత్సరములలో దేశమునఁ గఱువువచ్చెననియు, జమీందార్లుచెల్లించవలసిన కప్పము బాకీపడియుండిరనియుఁ బైని వ్రాసియుంటిమికదా! ఈ క్షామపీడితదేశస్థులగు జమీందార్లనుండి రావలసిన రాఁబడిని వసూలుచేసికొనుట గవర్నమెంటువారికి మిక్కిలి కష్టముగానుండెను. అందువలన నీనూతనముగ నేర్పఱుపఁబడిన యుద్యోగీయులు తమ నియమితవిధులను నెఱవేర్చునప్పుడు ప్రజలును, జమీందారులును గూడ వారి నెదిరించుచువచ్చిరి. కాని పెద్దాపురము, పిఠాపురము మున్నగు జమీందారులు దొరతనమువారికంత శ్రమ కలుగఁజేయకయే తామియ్యవలసిన పైకమును జెల్లించివైచిరి. ఈ సంస్థానములలో గవర్నమెంటువారిపైఁ దిరుగఁబాటొల్లివియును లేక మొత్తముమీఁద శాంతి నిలిచియున్న దనియే చెప్పనగును. ఒక్క మొగల్తుఱ్ఱు సంస్థానమునమాత్ర మిట్టి తిరుగుఁబాటును కలహమును రేఁగెను. ఇట్టి చిన్నకలహమే ౧౭౯౬వ సంవత్సరమునగూడ సంభవించెను. గాని యీచిన్న కలహములను కొద్దిపాటి సైన్యముతోనే మిక్కిలిసులభముగ దొరతనమువా రణఁచివేయుచువచ్చిరి.

ఈ నూతనముగావచ్చిన యింగ్లీషుపరిపాలనావిధానము క్రమక్రమముగాఁ జక్కపడుచున్నకాలమున ననఁగా క్రీ. శ. ౧౭౯౭వ సంవత్సరమున విద్వద్బృందమునకును, కవీంద్రసంతానమునకును కల్పద్రుమంబై, యర్థిజనపారిజాతమై స్వయముగా విద్వాంసుఁడై కీర్తిప్రఖ్యాతులనంది విరాజిల్లిన శ్రీ తిమ్మజగపతిమహారాజుగారు స్వర్గస్థులైరి.

ఈ తిమ్మజగపతి మహారాజుగారికి వేఁటయన్న నత్యంత ప్రీతి. వీరొక్కమాఱు క్షుధార్తులై వేఁటనుండి తిరిగివచ్చుచుండఁగా పరివార

మంతయు వెనుకఁబడుటయు వీరు ముందునకు సాగివచ్చుటయు సంభవించెను. అంతట వీరచ్చటి కనతిదూరముననున్న యొక పల్లెకరిగి పెండ్యాలవారను నింటిపేరుగల యొక భూసురాంగనను దన కేదైన భుజించ నొసంగవలసినదని యడిగెను. ఆమెయుఁ దామువండుకొన్న యంబలితక్క తమయింటయేదియు లేదనియుఁ, గావలసిన నదియే కొంచెము పోసెదననియుఁ జెప్పెను. రాజును నందుల కంగీకరించి దానిం గ్రహించెను. తరువాత ఆయన పెద్దాపురమును జేరి యాపుణ్యాంగనకు కబురుపంపించి యామె కాగ్రామము నగ్రహారముగ నిచ్చెను. ఈ యగ్రహారమునకే “అంబటిపూడి” యని యిప్పటికిని నామధేయము గలదు. ఇప్పుడుకూడ పైఁజెప్పిన పెండ్యాలవారీయగ్రహారము ననుభవించుచున్నారు.

ఈ తిమ్మరాజుగారు దానధర్మనిరతులై ప్రకృతమున నములాపురము తాలూకాయని పిలువఁబడు కోనసీమలో ననేకభూదానములు చేసినట్లు తెలియవచ్చుచున్నది. ఈ దానధర్మాది గుణంబుల నుపలక్షించి యొక కవీశ్వరుఁడు వీరిమీఁదఁజెప్పిన యొక చాటువు సీక్రిందఁ బొందుపఱిచి దానితో వీరిపరిపాలనమును ముగించుచున్నారము.

శా॥ తాజాగాసిరులుండి మోరికిడకం బామెక్క లేనట్టియా
ఫాజీలోభుబిఁబట్టి లోపలికి నిపాదోదకంబిచ్చినన్
తాజీమిచ్చును కర్ణుఁడాజనుల మేద్దాత్మృత్వముంజూచి, శ్రీ
రాజా తిమ్మజగత్పతీ! నరపతీ! రక్షింపనీవే గతీ॥

—: శ్రీరాజా రాయజగపతిరాజుగారు :—

( క్రీ. శ ౧౭౯౭—౧౮౦౪ )

శ్రీ రాజా తిమ్మజగపతి మహారాజులుంగారి యనంతరమున

ఆయన కౌమారులైన శ్రీరాజా రాయజగపతిరాజుమహారాజులుంగారు రాజ్యమునకువచ్చిరి, వీరు సింహాసనమునకు వచ్చునప్పటి కిరువదిరెండేండ్ల ప్రాయమువారు, వీరిపరిపాలనమునుగుఱించిన సంగతులను దెలిసికొనుట కాధారములు కొన్నియైనను లేకపోవుటచేత నొక్క విశేషమునుమాత్రము తెలిపి వీరి చరిత్రను ముగింపవలసివచ్చుచున్నది.

వీరికాలముననే ఇండియాగవర్నమెంటువారును కోర్టుఆఫ్డైరక్టర్లును, ౧౭౯౩వ సంవత్సరమున బంగాళారాజధానిలో నవలంబింపఁబడిన పర్మనెంటుసెటిల్మెంటు నిచ్చుటకూడఁ ప్రవేశపెట్టవలసిన దని మదరాసు గవర్నమెంటువారిని తొందరపెట్టుచువచ్చిరి. ఈ పర్మనెంటుసెటిల్మెంటువలన రైతులనుండి జమీందారులు రాఁబట్టుకొనవలసినసొమ్ము మొత్తమునుగుఱించియు, జమీందారులు గవర్నమెంటువారికి చెల్లించవలసిన కప్పమునుగుఱించినట్టియు చిక్కులు విడిపోఁగలవని యూహింపఁబడుచువచ్చెను. అప్రకారమే యీపర్మనెంటుసెటిల్మెంటు రాజమహేంద్రవరముజిల్లాలో ౧౮౦౨-౦౩ సంవత్సరములలోఁ బ్రవేశపెట్టఁబడెను.

అప్పటికి దొరకిన లెక్కలనుబట్టి కడచిన యెనిమిది మొదలు పదుమూఁడు సంవత్సరములలో భూమిమీఁదవచ్చిన మొత్తపు రాఁబడిలో సగటున రెండువంతులు పేష్కషు చెల్లించుపద్ధతిమీఁద నప్పటికున్న జమీందారులకు వారిసంస్థానములు శాశ్వతానుభవముగా స్థిరపఱుచఁబడెను.

ఈ పైనవివరింపఁబడిన పర్మనెంటుసెటిల్మెంటు పెద్దాపురసంస్థానమున శ్రీ రాయజగపతిరాజుమహారాజులుంగారి కాలమున జరి

గెను. ఈ సెటిల్ మెంటు ననుసరించి గోదావరిజిల్లాలోని చాలభాగము పెద్దాపురసంస్థానమునఁ జేర్పఁబడి దాదాపుగా నేడులక్షల పేష్కషు విధింపఁబడెను. ఇంకను గొప్పవైశాల్యముగల ప్రదేశములు పిఠాపురము, పోలవరము, కోటరామచంద్రపురము జమీందారీలలోఁగూడఁ గలుపఁబడినవి. ఈ సెటిల్ మెంటు ప్రకారము పిఠాపురము జమీందారీకి రెండునరలక్షలును, పోలవరము జమీందారీకొకలక్షయును, కోటరామచంద్రపురము జమీందారీకి లక్షయిరువదియైదువేలును పేష్కషు నిర్ణయింపఁబడెను.

ఈ సెటిల్ మెంటు జరిగిన కొంతకాలమువఱకుఁ దమ సంస్థానమును బరిపాలించి శ్రీరాజా రాయజగపతిరాజుమహారాజులుంగారు రక్తాక్షిసంవత్సరమునకు సరియైన క్రీ. శ. ౧౮౦౪వ సంవత్సరమున బరమపదమునొందిరి. వీరి పరిపాలన యెంతవఱకు వ్యాపించినదనఁగా తోటపల్లియెస్టేటు, రంప, చోడవరము మొదలగు పదునెనిమిది సర్దారీలును, ఇప్పటి గోదావరిజిల్లాలోని పిఠాపురంయెస్టేటు, రామచంద్రపురంజమీందారీయును దక్క కడమ ప్రదేశమంతయును, కొవ్వూరుతాలూకాయును, ఏలూరుతాలూకాలో కొంతభాగమును, ఎర్నగూడెముతాలూకాలో కొంతభాగమును, భీమవరము తాలూకాయును, తణుకుతాలూకాలోఁ జాలభాగమును, నర్సాపురము తాలూకాలో మొగల్తురుయెస్టేటు మినహాగా మిగిలిభాగమును గలుపఁగా శ్రీరాయజగపతిరాజుగారు పరిపాలించిన పెద్దాపురసంస్థానముగా నేర్పడఁగలదని చెప్పఁబడుచున్నది.

## —: రా ణు ల ప రి పా ల న :—

### ( ౧౮౦౪ మొదలు ౧౮౩౭ వఱకు )

### —: శ్రీలక్ష్మీనరసయ్యమ్మాదేవిగారు :—

చనిపోయిన శ్రీ రాయజగపతిరాజులుంగారికి లక్ష్మీనరసయ్య గారనియు, బుచ్చిసీతయ్యమ్మగారనియు, బుచ్చిబంగారయ్యగారనియు ముగ్గురు భార్యలుకలరు. వారిలోఁ బ్రథమ భార్యయగు లక్ష్మీనరస య్యగారికి ౧౭౯౯వ సంవత్సరమున నొకకుమారుఁడుకలిగెను. ఆయ నకు శ్రీ రాజా బుచ్చితిమ్మజగపతి రాజుగారని నామధేయమిడిరి. కాని ఆయన, తలిదండ్రుల దురదృష్టవశమున నాలుసంవత్సరములు మాత్రమే జీవించి, జననీజనకులు బాగుండఁగనే లోకాంతరగతులైరి. అందువలన శ్రీ రాయజగపతిరాజుగారి యనంతరమునఁ బ్రథమపత్నియైన లక్ష్మీనర సయ్యమ్మగారే యధికారమునకువచ్చిరి ఈమెకిఁక సంతానము లేక పోవుటచేత నీమెభర్తగారైన శ్రీ రాయజగపతిరాజుగారు తాము చని పోవునప్పుడీమెకు దత్తుచేసికొనుటకనుజ్ఞ యిచ్చిరి. ఆప్రకారమే లక్ష్మీ నరసయ్యమ్మాదేవిగారును గోపాలపురమునయున్న తను సన్నిహితజ్ఞాతి యైన వత్సవాయవారి చిన్నవాని నొకనిని పెంచుకొనిరి శ్రీ రాజా తిమ్మజగపతిరాయ నామాంకితులగు నాదత్తపుత్రులును దన్ను పెంచు కొన్నతల్లిని విచారసాగరమునముంచి కొంతకాలమునకు విగతాసులైరి.

ఈ దత్తకుని మరణానంతరమున శ్రీ లక్ష్మీనరసయ్యమ్మగారు రెండవమాఱు దత్తుచేసికొనుటకుఁ బ్రయత్నించఁగా నప్పుడున్న వత్స వాయవారందఱిలో దగ్గఱి వారసులైన భీమవరపుకోట నివాసులగు వత్సవాయజగన్నాథరాజుగారు దత్తుతీసికొనునది యొక్క పర్యాయమే

గాని రెండవమాఱుకూడదని వాదముచేసి దావా తెచ్చిరి. అప్పుడు రాజమహేంద్రవరముజిల్లాకోర్టునకుఁ బైనిదగు బందరులోనున్న ప్రావిన్షియల్ కోర్టువారు వ్యాజ్యమును విచారించి రెండవ పర్యాయము దత్తుతీసికొనుట శాస్త్ర సమ్మతముకాదని విపరీతముగా నిర్ణయించిరి. అటుతరువాత పెద్దాపురపుసంస్థాన మవిభాజ్యపు జమీందారీ గనుక పురుషులేకాని స్త్రీలు పరిపాలించకూడదనియు, మేము ముఖ్యవారసులము గనుక జమీందారీని మావశము చేయవలసినదనియుఁ బైనఁ జెప్పిన జగన్నాథరాజుగారే తిరిగి వ్యాజ్యము తెచ్చిరి. ఆ వ్యాజ్యము నప్పటి రాజమహేంద్రవరము జిల్లాకలెక్టరుగారు విచారించి యుభయులకు రాజీనామా కుదిర్చిరి. ఆ రాజీ ప్రకారము శ్రీ లక్ష్మీనరసయ్యమ్మా దేవిగారే తామున్నంతకాలమును సంస్థానమును బరిపాలించుటకును, ఆమె యనంతరమున జమీందారీయంతయు దావా తెచ్చిన శ్రీ జగన్నాథరాజుగారికి చెందుటకును, అంతవఱకువారు బీదలై నిరాధారులుగానున్నందున వారి జీవనమునిమిత్తము పెద్దాపురపు జమీందారీ లోనిదగు కొత్తాము యస్టేటును వారి కిచ్చుటకును నిర్ణయింపఁబడినది.

ఆ ప్రకారమే క్రీ. శ. ౧౮౧౦వ సంవత్సరమున కొత్తాము యస్టేటు పెద్దాపురపుజమీందారీనుండి చీలిపోయి వత్సవాయ జగన్నాథరాజుగారికి జీవనాధారముగా యీయబడెను.

ఈ లక్ష్మీనరసయ్యమ్మాదేవిగారు పదిసంవత్సరములు పరిపాలించి క్రీ. శ. ౧౮౧౯వ సంవత్సరమునఁ జనిపోయిరి.

## —: శ్రీబుచ్చిసీతయ్యమ్మాదేవిగారు :—

### పెద్దాపురముసావేశీలోనున్న రాజుల వంశావతార క్రమము.

అటుతరువాత చనిపోయిన శ్రీ రాయజగపతిరాజుగారి ద్వితీయ భార్యయైన శ్రీ బుచ్చిసీతయ్యమ్మాదేవిగారు పరిపాలనా భారమును వహించిరి. కాని భీమవరపుకోట వత్సవాయ జగన్నాధరాజుగారు ఇది వఱలో రాజమహేంద్రవరము జిల్లాకలెక్టరుగారుచేసిన రాజీ ప్రకారము తమకే యధికారమురావలెనని దావాచేసిరి. ఆ దావాపర్యవసానము తేలువఱకు జమీందారీ గవర్నమెంటువారి స్వాధీనమున నుంచఁబడెను. ఈదావా పదునాల్గుసంవత్సరములు జరిగినపిదప కట్టకడపట శ్రీ బుచ్చిసీతయ్యమ్మాదేవిగారిపక్షమునఁ దీర్పుచేయఁబడినది. ఆతీర్పు ప్రకారమప్పటికున్న రాణులందరియనంతరముననఁగాని వారసులగు జగన్నాధరాజుగారికి జమీందారీవశముకాఁగూడదనియుఁ జమీందారీ యమానీలోనున్నకాలమున నిలువయున్నసొమ్ము శ్రీ బుచ్చిసీతయ్యమ్మాదేవిగారి కొప్పగింపఁబడవలయుననియు నేర్పాటుజరిగెను.

తీర్పు తమ పక్షమైన సంవత్సరముననే యనఁగా ౧౮౬౯లో శ్రీ బుచ్చిసీతయ్యమ్మగారు సింహాసనమెక్కిరి. సింహాసన మెక్కిన యొకటి రెండు సంవత్సరములలో నామె పెద్దాపురమున నొక సత్రమును, ఒంటిమామిడి గ్రామముననొకసత్రమును స్థాపించి యందు నిర్విఘ్నముగ నన్నదానము జరుగుటకై కొన్నిభూముల నొసంగెను. ఈరెండు సత్రములలోను వర్ణభేదములేక రెండుపూటల నన్నదానము చేయఁబడును. పెద్దాపురముననున్న సత్రమును, ఒంటిమామిడినుండి

కత్తిపూడి ( పెద్దాపురమున కీశాన్యదిక్కుగా పదునేడు నరమైళ్లదూరమునమన్నది ) కి మార్చఁబడిన రెండవసత్రమును ప్రకృతమున గవర్నమెంటువారి స్వాధీనమునమండి ప్రాజ్ఞురాలును, సౌదార్యగుణసంశోభితయు నగు మానవతీశిరోమణి శ్రీ బుచ్చిసీతయ్యమ్మాదేవిగారి శుభకీర్తినిఁ జాటుచున్నవి.

తరువాత శ్రీ బుచ్చిసీతయ్యమ్మగారు తమ భర్తగారు రండవు భార్యలకు దత్తుతీసికొన నధికారమిచ్చిరను కారణమునఁ దమ సవతిగారైన శ్రీ లక్ష్మినరసయ్యగారు చేసికొన్న స్వీకారము చెడిపోయినది గనుక తాము మరలయెవరినైనఁ బెంచుకొనుట కభ్యంతరముండకూడదని నిశ్చయించి పోషకపుప్రయత్నము చేయుచువచ్చి తునకు కోటగంద్రేడుగ్రామమునయున్న తమ మేనత్తమనుమలును వత్సవాయనరసరాజుగారి పౌత్రులునైన వేంకటజగపతిరాజుగారినిఁ దీసికొనివచ్చి తమ సంరక్షణలోనుంచుకొని పెంచుచువచ్చిరి.

ఈ పైనిఁజెప్పిన వత్సవాయి నరసరాజుగారు, పెద్దాపురసంస్థానమును సంపాదించిన వత్సవాయ ముసలితిమ్మరాజుగారి పెదతాతగారి సంతతిలోనివారును శ్రీ రామవిలాసప్రబంధమునుగృతినొందిన కాండ్రేగుల శ్రీ వత్సవాయ గోపరాజుగారికి దగ్గఱబంధువులును దొంతమూరు నివాసస్థులునై యుండిరి. విజయనగరసంస్థానమున బహుశూరాగ్రేసరులనిపేరువడిన శ్రీ దాట్ల వేంకటరాజు కుమందానుగారికి వీరల్లురగుటచేత నాసంబంధమనుసరించి విశాఖపట్టణమండలమునకరిగి విజయనగరసంస్థానములోనిదగు కోటగండ్రేడుగ్రామమును నివాసముగా నేర్పఱుచుకొని విజయనగరసంస్థానాధీశుల కనేకయుద్ధముల సహాయులై యుండి వారివలన విశేషగౌరవమర్యాదలనుపొంది కొన్నియేండ్లను

గూడ వారినుండి గుత్తకుఁబుచ్చుకుని విశేషధనము నే కాక యశోధన మునుగూడ సముపార్జించిరి. వారు తుదకు శ్రీ విజయనగర పరిపాలకులైన చినవిజయరామగజపతిరాజుమహారాజులుంగారికి సైన్య సమేతముగ సాహాయ్యులై వెళ్లి పద్మనాభయుద్ధమున వారితోఁబాటు వీరశయనమునొందిరి.

శ్రీ బుచ్చిసీతయ్యమ్మగారు తమసంరక్షణను బెరుగుచున్న యీ వీరాగ్రేసరవంశజాతులగు శ్రీ వేంకటజగపతిరాజుగారిని యథాశాస్త్రీయముగాఁ బెంపకము చేసికొని, మహావైభవమున వివాహమాచరించి ఆయనయే సంస్థానమునకుఁ బ్రభువులని ప్రకటించిరి.

ఈ సమాచారమును వారసులైన జగన్నాథరాజుగారు తెలిసికొని పెద్దరాణిగారు దత్తుతీసికొనఁగా దానికి విఘాతమువచ్చినదిగనుక తిరుగఁ బెంపకముచేసికొనఁ గూడదనియు, పెంపకము రద్దుచేయువలసినదనియు దావాతెచ్చిరి. వెనుకటివలెనే బంగరుప్రొవిన్షియల్ కోర్టువారు సదరుదావానువిచారించి మరలదత్తముచేసికొనుట కధికారము లేదని తీర్మానించిరి.

అటుపిమ్మట శ్రీ బుచ్చిసీతయ్యమ్మగారు కొన్ని యీనాంభూములు మున్నగునవి దత్తపుత్రుని జీవనాధారముకిచ్చి యింకను విశేషోపకారముచేయుతలంపుననుండఁగా నామె యాకస్మికముగా విషూచిజాడ్యమువలన క్రీ. శ. ౧౮౩౯వ సంవత్సరమునఁ గాలధర్మమునొంది దత్తపుత్రున కాశాభంగముగలిగించెను.

దత్తకులగు శ్రీ వేంకటజగపతిరాజుగారును దమ కొసంగఁబడిన యీనాంభూములవలనఁ గాలక్షేపముచేయుచుఁ దమ పెంపుడుతల్లిగారి వద్దనే యుండెడివారు. ఇట్లుండఁగాఁ గళత్రవియోగము సంభవించి

నందున ఆయనమరల, కాకినాడతాలూకా కోలంకనివాసులును, విద్వాంసులునగు శ్రీ దంతులూరి జగన్నాధరాజుగారి జ్యేష్ఠపుత్రికయైన శ్రీ వేంకటరమణయ్యమ్మగారిని బరిణయమాయెను. భవ్యులగు నీ యిరువురు దంపతులకు శ్రీ సీతారామజగపతిరాజుగారు, శ్రీ రాయజగపతిరాజుగారు అను నిరువురు పుత్రులుకలిగిరి. పుత్రలాభమును బొందిన తరువాతఁ గొంతకాలమునకు శ్రీ వేంకటజగపతిరాజుగారు స్వర్గస్థులైరి.

శ్రీ వేంకటజగపతిరాజుగారి ప్రథమపుత్రులైన శ్రీ సీతారామజగపతిరాజుగారికి వేంకటజగపతిరాజుగారు, అప్పలనరసింహజగపతిరాజుగారు, వేంకటసూర్యనారాయణజగపతిరాజుగారు అను ముగ్గురుకొమారులుకలరు. వారిలో ప్రథములైన వేంకటజగపతిరాజుగారికి సంతానములేదయ్యెను. ఇట్లుండఁగ నేవారు లోకాంతరగతులైరి. ద్వితీయులైన అప్పలనరసింహజగపతిరాజుగారికి చినసీతారామరాజు అనునొక కొమారుఁడు కలఁడు. తృతీయులగు వేంకటసూర్యనారాయణజగపతిరాజుగారికి పెదసీతారామజగపతిరాజను తనయుఁడుకలఁడు. ఇటీవల శ్రీ సీతారామజగపతిరాజుగారి ద్వితీయపుత్రులగు అప్పలనరసింహజగపతిరాజుగారు దేహవియోగమునొందిరి.

శ్రీ వేంకటజగపతిరాజుగారిద్వితీయపుత్రులును ధర్మశాస్త్ర, వైద్యశాస్త్ర, నీతిశాస్త్ర పారంగతులని ప్రసిద్ధిగాంచినవారును గీర్వాణపండితులునగు శ్రీ రాజా రాయజగపతిరాజుగారే మాపితామహులు. వీరు చిరకాలము జిల్లాబోర్డుమెంబరుగానుండి దేశక్షేమమునకై పాటుపడి గవర్నమెంటువారికి శ్లాఘాపాత్రులైరి. శ్రీ విక్టోరియామహారాజ్ఞిగారి జూబిలీ ( పంచాదశవర్షప్రమోత్సవము ) సందర్భమున ౧౮౯౭ వ సంవత్సరము సెప్టెంబరు ౭ వ తేదీని శ్రీ కలకత్తాగవర్నరుజనరలుగారు

వీరికొక పట్టాభిసంగిరి శ్రీరామ భక్తులగు వీరికి దైవ భక్తియు, పురాణశ్రవణాసక్తియు విశేషముగఁగలదు. వీరు తమయొక్క సత్ప్రవర్తనచేతను, యోగ్యతచేతను, సద్గుణవిశేషమునను, బొబ్బిలి, విజయనగరము, పిఠాపురము మున్నగు జమీందారులందఱి యాదరణమును అందఱితోను సమానమైన గౌరవమునుఁబొందుచు సుమారెనుబదియేండ్ల ప్రాయముగలవారై యిప్పటికిని దైవకటాక్షముచేత భగవదారాధనముచేయుచు దృఢకాయులై యుండి మహారాజులకీర్తిని నిలుపఁబెట్టుచు నీగ్రంథమునంకితమునొందిరి.

ఈ రాయజగపతిరాజుగారికి వేంకటజగన్నాథజగపతిరాజుగారు, నారాయణజగపతిరాజుగారు, వరాహనరసింహజగపతిరాజుగారు, లక్ష్మీనరసింహజగపతిరాజుగారు, నను నలుగురుతనయులు కలిగిరి. వీరిలో మొదటివారును నాలవవారును సంతానవిహీనులయియే కాలధర్మము నొందిరి. రెండవవారైన శ్రీనారాయణజగపతిరాజుగారు పూజ్యులగు మాజనకులు. వీరికి పెదరాయజగపతిరాజు, వేంకటజగన్నాథజగపతిరాజు, వేంకటకృష్ణజగపతిరాజు, లక్ష్మీనరసింహజగపతిరాజు నను నలుగురు తనయులున్నారు. వారిలో నేను ప్రథమకళత్రపుత్రకుఁడను. మిగిలినముగ్గురును ద్వితీయకళత్రసంజాతులు. తృతీయులునుఁ మా పినతండ్రులునగు వరాహనరసింహజగపతిరాజుగారికి చినరాయజగపతిరాజు, వేంకటరామజగపతిరాజు, వేంకటనారాయణజగపతిరాజు నను ముగ్గురుకొమారులున్నారు.

## —: శ్రీ బుచ్చిబంగారయ్యాదేవిగారు :—

శ్రీ బుచ్చిసీతయ్యామ్మాదేవిగారి యనంతరమున శ్రీ రాజా

రాయజగపతిరాజుగారితృతీయభార్య యగు శ్రీబుచ్చిబంగారయ్యాదేవిగారు రాజ్యభారమును వహించిరి. వీరు సిద్ధాంతం నివాసులగు నల్లపరాజు శ్రీహరిరాజుగారి తోఁబుట్టువులు. వీరు రెండేండ్లమాత్రమే రాజ్యము చేసి స్వర్గస్థులైరి.

## సంస్థానముయొక్క క్రీ. శ. ౧౭౩౭ వ సంవత్సర తదనంతర వృత్తాంతము.

శ్రీబుచ్చిబంగారయ్యాదేవిగారు పరమపదించినపిదప ౧౭౩౮ వ సంవత్సరమున శ్రీ వత్సవాయజగన్నాథరాజుగారి జ్యేష్ఠపుత్రులయిన శ్రీ సూర్యనారాయణజగపతిరాజుగారు తమకిష్టమయిన కడపటిదావా తీర్పుప్రకారమధికారమునకువచ్చి కొద్దిసంవత్సరములుమాత్రమే రాజ్య మేలిరి. కాని వీరు రాజ్యమునకువచ్చిన సంవత్సరము నా మఱుసటి సంవత్సరమునుగూడ నదియేమిపాపకర్మముననోగాని క్షామమతిశయించి యుండుటచేత దొరతనమువారికిఁ జెల్లించవలసిన పేష్కషు విస్తారము బాకీపడియుండెను. ఆ కారణమున ౧౮౪౭వ సంవత్సరమున కిర్లంపూడి, దొంతమూరు, వీరవరం, కోలంక, గొల్లప్రోలు, జగ్గంపేట, పలివెల, గోపాలపురం, కపిలేశ్వరపురం, తోటపల్లి మొదలగు పిఠాపురము జమీందారీలోని శేషించిన చాలగ్రామములు, ముఠాలు వేలము వేయఁబడి యన్యాక్రాంతము లయ్యెను. ఇట్లు దొరతనమువారికి పేష్కషు బాకీపడుట, వేలము వేయఁబడుట యీమొదలగు చిక్కు లీ సంస్థానమున కెన్నోమారులు తటస్థించుటచేత నీబాధలు పడుటకంటె దొరతనమువారికే యీశేషించిన సంస్థానము నిచ్చివేయునెడల నుత్తమముగా నుండుననియు, నందువలనఁదమకు తౌజీకూడ విశేషముగ రాఁగలదనియు నెంచి శ్రీ సూర్యనారాయణజగపతిరాజుగారు తమ

జీవనాధారము నిమిత్తము కొత్తాము యెస్టేటును మాత్రముంచుకొని యీవటులో వేలము కాఁగా మిగిలిన సంస్థానమును గవర్నమెంటువారి యధీనము చేసిరి. అటుతరువాత కొంతకాలమునకనఁగా క్రీ. శ. ౧౮౭౩ వ సంవత్సరమునఁ గోటభూమి, లోగిళ్లు దొరతనమువారి వశము చేయఁబడినట్లు చెప్పుదురు.

ఈ సంస్థానముపోవుటకుఁ గారణాంతరమొకటి చెప్పఁబడుచున్నది. ఈ యధికారమునకువచ్చిన సూర్యనారాయణజగపతిరాజుగారు వేశ్యాప్రియులనియు, వీరధికారమునకువచ్చిన రెండు సంవత్సరములకే వీరు చేరఁదీసిన వేశ్యచనిపోయెననియు నంతమీఁదట విరక్తులై, యప్పు డధికారమును జేయుచున్న కలెక్టరుగారు కొంతకాలమువఱకు పేష్కషు చెల్లింపఁబడనక్కఱలేకుండ యందులాగునఁజేసెదమని జెప్పినను వినక జమీందారీని గవర్నమెంటువారి యధీనమునుజేసెననియుఁ జెప్పుదురు. కాని యిదియెంతవఱకు విశ్వసింపఁదగియున్నదో తెలియదు. ఏదియెటులున్నను సంస్థానముమాత్రము శ్రీ సూర్యనారాయణజగపతిగారిచేతనే గవర్నమెంటువారి కొసంగఁబడినట్లు తెలియఁగలదు. ఇంతగొప్పసంస్థానమింతనామమాత్రావశేషమైపోవుటకు తగినకారణముదురూహ్యముకాని బ్రిటిషుప్రభువుల యనుగ్రహమే యీ సంస్థానాధీశులు పూర్ణముగా సంపాదించినయెడల విజయనగర సంస్థానమువలె చిరస్థాయియై వర్ధిల్లుచుండునేమో? ఆలోచనీయము!

ఈ సూర్యనారాయణరాజుగారు సంస్థానము నిచ్చివేసినందులకై గవర్నమెంటువారీయనకు నెలకు రు ౬౦౦ ల చొప్పున తౌజీనిచ్చుచు వచ్చిరి. మఱికొంతకాలమైనపిదప నా తౌజీనొసంగుటకూడ కొన్నికారణములవలన నాగిపోయినది.

ఇటీవల గోదావరిజిల్లాకలెక్టరు వి. ఏ. బ్రాడీదొరవారు ఎందరు కోరినను నిరాకరించి శ్రీ బుచ్చిసీతయ్యమ్మాదేవిగారి పౌత్రులయిన శ్రీ రాయజగపతిరాజుగారికిచ్చుట న్యాయమని స్థిరపరచి జిరాయితీ రేటుకట్టి కోటభూమినంతయు వారిస్వాధీనము చేసియున్నారు. నాఁటి నుండియుఁ గోటభూమి వారి యనుభవమున నున్నది. ఈ కోటభూమి యిప్పుడు వ్యవసాయమున కుపయోగింపఁబడుచున్నది.

—: విశేషాంశములు :—

౧. ఈ సంస్థానముక్రింద పదునెనిమిది మన్యపుసర్దారీలుండెనని యీావళిలోఁజెప్పియుంటిమి కదా! ఆపదునెనిమిదిసర్దారీ (ఒకసర్దారుయధీనమునసుండుదేశము సర్దారీయనఁబడును) లేపదునెనిమిది పరగణాలనియు నాక్కొక్కపరగణాకొక్కొక్క బురుజుచొప్పున నీకోటకు పదునెనిమిది బురుజులుండెడివనియుఁ జెప్పఁబడుచున్నది. ఆబురుజులలో తాళ్లబురుజు, తోకబురుజుమున్నగునవి సుప్రసిద్ధములు.

౨. కోటలోనిప్పటికిని మదీనాపాచ్ఛాగారి గోరీయని యొక గోరీ కలదు. అది పదియడుగులపొడవుకలదు. ఈగోరీకోటకట్టుటకుఁబూర్వముఁనుంచియునుండెనని పెద్దలందురు. ఈ పెద్దాపురసంస్థానప్రభువులందఱు మహమ్మదీయుల పండుగదినములలో విశేషోత్సవములుచేయించుచుండెడివారు. ఈగోరీవిషయమై కొందఱుమహమ్మదీయపండితులనుగనుఁగొన నీ స్థలమొకపుణ్యక్షేత్రముగాఁ తమమతగ్రంథములఁజెప్పఁబడునట్లుచెప్పుదురు. అందుచేఁ దూర్పుగా నేడేటఁబరప్రదేశములనుండి కొంతమంది యాత్రికులువచ్చి మ్రొక్కుబడులు చెల్లించుచుందురు.

3. ఇంజరం— ఇదిపూర్వము పెద్దాపురము జమీాందారీలోనిది.

ఇది౧౮౪౫లో విక్రయించఁబడినది. ఇప్పుడిది మూఁడుగ్రామములుకల చిన్నసంస్థానము. కాకినాడకు పదునేను మైళ్లదూరమున యానాం దగ్గఱనున్నది. ఇప్పుడిది చెల్లించు పేష్కషు రు. ౨, ౮౩౨ లు.

జగ్గంపేట — ఈజమీందారీలో నిరువదియెనిమిది గ్రామములు కలవు. ఇప్పుడిది చెల్లించు పేష్కషు రు. ౩౩,౦౭౨ లు.

కొంతమూరు — ఇదిచెల్లించుపేష్కషు రు. ౩, ౨౭౬ లు.

రాయవరం — ఇందురెండుగ్రామములు కలవు. ఇదిచెల్లించు పేష్కషు రు. ౧, ౯౯౮ లు.

ఈ మూఁడుచిన్నయెస్టేట్లును పెద్దాపురసంస్థానములోనుండఁగా వేలముకాఁబడినపుడు వీనిని పిఠాపురమురాజావారుకొని రావువేంకటరావు అనువారికిచ్చిరి. వారిసంతతివారేయిప్పటికిని వీనిననుభవించుచున్నారు.

కిర్లంపూడి — ఈ యెస్టేటు పదిగ్రామములది. ఇదిచెల్లించు పేష్కషు రు. ౨౩, ౧౮౭ లు.

తోటపల్లి — దీనిని పరిపాలించునతఁడు పెద్దాపురపుజమీందారుల క్రింద మొఖాసాదారుగా నుండెడివాఁడు. ప్రతిసంవత్సరమును జమీందారీకి రు. ౪,౦౦౦ లను గప్పముచెల్లించుచు నవసరమువచ్చినప్పుడు ౬౦౦లమంది భటులతో సేగుదెంచుట యతని

విధియైయుండెను. ఈజమీందారీయందు నూఱు గ్రామములు కలవు. ఇదియిటీవల గవర్న మెంటువారి స్వాధీనమైనది.

౮. పెద్దాపురసత్రమునకు రు. 3,౮౦౦లువచ్చు భూవసతియును, కత్తిపూడిసత్రమునకు రు. 3,౦౦౦లువచ్చు భూవసతియుఁగలదు.

౫. చనిపోయిన శ్రీకోతాంజమీందారుగారైన శ్రీరాజావత్సవాయ వేంకటసింహాద్రిజగపతిరాజుగారు, పెద్దాపురసంస్థానమును దొరతనమువారివశముచేసిన శ్రీ వత్సవాయ సూర్యనారాయణజగపతిరాజుగారి ద్వితీయపుత్రులు. ఇప్పడాకోతాంయస్టేటు చనిపోయిన వెంకటసింహాద్రిజగపతిరాజుగారి భార్యయైన శ్రీమతి రాజావత్సవాయ వెంకటసుభద్రయ్యమ్మాజగపతిదేవిగారివలనఁ బరిపాలింపఁబడుచున్నది. ఈయెస్టేటున ముప్పదియెనిమిదిగ్రామములుకలవు. ఈయెస్టేటు దొరతనమువారికి రు ౨౬., ౨౧౯లు పేష్కషు చెల్లుచున్నది.

ప్రస్తుతపరిపాలకురాలగు నీసాధ్వి, కోలంక దంతులూరివారి యాఁడు పడుచు. ఈమె మహోదారగుణసంపన్నురాలై పూర్వపురాణులంబలె చిరకీర్తిని గడించఁగలరను శుభసూచనలుపొడకట్టుచున్నవి.

ఒకప్పుడు మహదైశ్వర్యభోగముల ననుభవించి, నిస్తులశౌర్య పరాక్రమాదులఁకును, అపారపాండిత్యసంపదకును, ఆంధ్రకవీంద్రపోషణమునకును బ్రఖ్యాతికెక్కిన రాజచంద్రులచేతఁ బరిపాలింపఁబడి,విరాజిల్లిన శ్రీపెద్దాపురసంస్థానచరిత్రమిప్పటికి ముగింపునకు వచ్చినది. కన్నులారఁజూతమన్న నీసంస్థానచారిత్రము కనఁబడుచున్నదిగాని సంస్థానముమాత్రమూరును బేరును లేక కాలగర్భమున మటుమాయమైనది. ఆహా! ఎప్పడేటుపోయి యెటువచ్చునదియు, తుదకుత్తరక్షణముననేమి

సంభవించునదియుఁ గూడ నొక్కింతయైనం దెలియరాదుకదా! భగవద్విలాస మెంతటికవిపుంగవులకైన వర్ణనాదుస్సాధ్యము! భగవదుద్దేశ్యములు దుర్గ్రాహ్యములు!!

పూర్వమొకప్పుడీ పెద్దాపురపు సంస్థానములోనివేయని నోరార వచించుటకిప్పటికిని కొత్తాం, వీరవరం, కిర్లంపూడి, దొంతమూరు, జగ్గంపేట, రాయవరం, గొల్లప్రోలు, పలివెల, ఇంజరం, ఈతొమ్మిది యెస్టేట్లుమాత్రమే నిలిచియున్నవి.

ఇవ్విధమున (నెన్నెన్నిసంస్థానములు చితికిపోలేదు! ఎన్నెన్ని రాజ్యములు కూలిపోలేదు! ఎన్నెన్నిమహాసామ్రాజ్యములు సమయముతటస్థించినంతనే కాలగర్భమున లీనమై యంతరించిపోలేదు! కాని యివియన్నియు నశాశ్వతములు. ఇప్పటికి నప్పటికిని వాని చరిత్రలు మాత్రమే వినశ్వరములై వెలుగొందుచున్నవి.)

# తప్పొప్పుల పట్టిక.

| పుట. | పంక్తి. | తప్పు | ఒప్పు. |
|---|---|---|---|
| ౨ | ౮ | 1178, 1182 | ౧౧౭౮, ౧౧౮౨ |
| ౬ | ౬ | నుపహరించుచున్నాడను. | నుపహరించుచున్నారము. |
| ౨౪ | ౧ | యుండెనుగా | యుండెనుగాని |
| ౨౬ | ౭ | బెర్నీతో | శేర్నీతో |
| ౩౦ | ౬ | సత్కార్యసక్తి | సత్కార్యాసక్తి |
| ౩౧ | ౧౦ | | ఈరాజుగారు |
| ౩౨ | ౧౪ | రాజులత్తాంతము | రాజులవృత్తాంతము |
| ౩౨ | ౧౭ | విక్రమార్థ | విక్రమాదు |
| ౩౨ | ౧౮ | ృతచే | లచే |

నోటు;— అచ్చుటచ్చుటగల పరిమాణజనితములయిన దోషము లను దిద్దుకొని చదువవలెను.